ఉపాధితో ప్రగతి

- జిల్లాలో 96శాతం పనుల కల్పన
- 5.06 లక్షల మందికి రూ.272 కోట్ల వేతనం చెల్లింపు
- వచ్చే మూడు నెలల్లో 2.95లక్షల కుటుంబాలకు పనులు



ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 96 శాతం ప్రగతిని సాధించారు. 4.42 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1.35 కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు 1.29లక్షల పనిదినాలు కల్పించారు. జిల్లాలో 2.95 లక్షల కుటుంబాల్లోని 5.06 లక్షల మంది వేతనదారులకు పనులు కల్పించి వేతన రూపంలో రూ.272 కోట్లు చెల్లించారు. ఉపాధి అనుసంధానంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.180.70 కోట్ల అంచనాతో సీసీరోడ్లు, డ్రైన్లు, బీటీరోడ్లు, టూరిజం రోడ్లు, ఎస్సీ, ఎస్టీ కాలనీలకు అనుసంధానం చేసేందుకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం కోసం 1,369 పనులకు అనుమతులు ఇచ్చారు. వాటిలో ఇప్పటివరకు 1,180 పనులు పూర్తిచేయగా 141 పురోగతిలో ఉన్నాయి. ఆ పనులకు రూ.132.02 కోట్లు ఖర్చు చేశారు. 2025-26లో ఉపాధి ద్వారా పనులు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రానున్న మూడు నెలలకు కూలీలకు 1.11 కోట్ల పనిదినాలు కల్పించి 2.95లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారు. పశువుల నీటి కుంటలు, సేద్యపు నీటి కుంటలు, పంట కాలువలు, సాగునీటి చెరువుల్లో పూడికతీత పనులతో పాటు సగటున కనీస వేతనం రోజుకు రూ.290 నుంచి రూ.300 తగ్గకుండా ఉండేలా చర్యలు చేపట్టారు. జిల్లాలో రూ.4.72 కోట్ల వ్యయంతో 1,475 పశువుల నీటితొట్లు, రూ.47.50 కోట్ల వ్యయంతో 9,500 నీటి కుంటలు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించారు. రూ.101.70 కోట్ల వ్యయంతో ఫీల్డ్/ఫీడర్ చానల్స్‌లో పూడికతీత పనులు చేయాలని, 546 చెరువుల్లో పూడికతీత పనులను రూ.54.60 కోట్లతో చేపట్టాలని నిర్ణయించారు. కోనేరుల పునరుద్ధరణ పనులను కూడా చేపట్టి నీటి నిల్వలు పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. రానున్న మూడు నెలల కాలంలో చేయాల్సిన పనులపై కలెక్టర్ అన్సారియా డ్వామా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నిబద్ధతకు పట్టం

మొదటి నుంచి పార్టీలో పనిచేసిన వారు.. ప్రత్యేకించి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కష్టించిన వారికి గుర్తింపు దక్కింది. ఇంకా గతంలో ఏదో స్థాయిలో పదవులు నిర్వహించిన వారికే అధికార తెలుగుదేశం పార్టీ వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ల పదవులను కట్టబెట్టింది. అందులోనూ సామాజికవర్గాల సమతూకానికి ప్రాధాన్యమిచ్చింది. ఆపై మహిళలకు పెద్దపీట వేసింది. ఉమ్మడి జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులకు అధిష్ఠానం శుక్రవారం పేర్లు ఖరారు చేసింది. గతంలోనే మూడు ఏఎంసీలకు ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో పది మార్కెట్ కమిటీ చైర్మన్ల ఎంపిక పూర్తయ్యింది. వివిధ కారణాలతో మరో ఐదు కమిటీల ఎంపికను వాయిదా వేసినప్పటికీ రానున్న వారంలో వాటి నియామకాలు పూర్తికానున్నాయి.



పార్టీలో కష్టపడి పనిచేసిన వారికే ఏఎంసీ చైర్మన్ పదవులు



మన్నం రాజేశ్వరి, మద్దిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్



దారం నాగవేణి, దర్శి ఏఎంసీ చైర్‌పర్సన్



యారవ రమాదేవి, కనిగిరి ఏఎంసీ చైర్‌పర్సన్



పూనూరి భూపాల్‌రెడ్డి కంభం ఏఎంసీ చైర్మన్

- సామాజిక సమతూకానికీ ప్రాధాన్యం
- ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన కొత్త వారికి నిరాశ
- ఇప్పటికే పదింటికి ఖరారు
- బీసీలకు మూడు, ఎస్సీలకు ఒకటి, జనరల్‌కు ఐదు కేటాయింపు
- మిగిలిన ఐదులో ఎస్సీలకు రెండు, బీసీలకు ఒకటి, ఓసీలకు రెండు ఇచ్చే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో నియామకాల తీరుతెన్ను ఇదీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా తొలుత గిద్దలూరు, మార్కాపురం, అద్దంకి కమిటీలకు చైర్మన్ల పేర్లను టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. శుక్రవారం కంభం, దర్శి, కనిగిరి, సంతనూతలపాడు, సంతమాగులూరు, పర్చూరు, చీరాల మార్కెట్ కమిటీలకు చైర్మన్‌ల పేర్లను ప్రకటించింది. వీరి నియామకపత్రాలు అధికారికంగా నేడో, రేపో వచ్చే అవకాశం ఉంది. ఒంగోలు, కొండపి, ఎర్రగొండపాలెం, కందుకూరు ఏఎంసీలకు చైర్మన్లను నియమించాల్సి ఉంది. శుక్రవారం ఖరారైన కమిటీల్లో కనిగిరికి యారం రమాదేవి, దర్శికి దారం నాగవేణి, మద్దిపాడుకు మన్నం రాజేశ్వరి, కంభంకు పూనూరు భూపాల్‌రెడ్డి, పర్చూరుకు గుంజి వెంకటరావు, చీరాలకు కేసవరపు జనార్దన్‌రావు, సంతమాగులూరుకు టి.రమేష్ ఉన్నారు. అంతకుముందు మార్కాపురానికి ఎం.వెంకటరెడ్డి, గిద్దలూరుకు పి.బాలయ్య, అద్దంకికి పద్మావతి పేర్లను అధిష్ఠానం ఖరారు చేసింది. ఇలాంటి పదవులకు ఆయా నియోజకవర్గాల అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఇచ్చిన పేర్లను యథాతథంగా ఆమోదించడం ఇప్పటి వరకూ జరిగింది. కానీ ప్రస్తుతం అధికార

మిగతా 6వ పేజీలో

త్వరలో మిగిలినవి ప్రకటన

మిగిలిన ఏఎంసీల్లో ఒంగోలు చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించారు. ఎమ్మెల్యే జనార్దన్ నుంచి ఇంకా ప్రతిపాదన వెళ్లక ఎంపిక జరగలేదు. కొండపి చైర్మన్ పదవిని జనరల్ మహిళకు కేటాయించారు. మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యలు అభ్యర్థి ఎంపిక విషయంలో తికమకపడుతున్నట్లు తెలిసింది. ఎర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్ పదవిని ఓసీ జనరల్‌కు కేటాయించారు. పార్టీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు కమ్మ సామాజికవర్గానికి చెందిన మూడు పేర్లు పంపి అధిష్ఠానాన్నే తుది నిర్ణయం తీసుకోమని కోరినట్లు సమాచారం. పొదిలి చైర్మన్ పదవిని బీసీ మైనారిటీకి కేటాయించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే నారాయణరెడ్డి సిఫార్సు కోసం ఎదురుచూస్తున్నారు. కందుకూరు చైర్మన్ పదవిని దళితులకు కేటాయించగా ఎమ్మెల్యే ఇచ్చిన పేరుపై అధిష్ఠానం పరిశీలన ప్రారంభించింది. ఈ ఐదు ఏఎంసీల చైర్మన్ పదవులకు వచ్చే వారంలో నియామకం జరిగే అవకాశం ఉంది.



ఎస్ఈజెడ్‌లోని ఫ్యాక్టరీలో గ్రానైట్ పలకలను పరిశీలిస్తున్న మంత్రి రవీంద్ర

గనుల శాఖను భ్రష్టుపట్టించారు

- ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- గుండ్లాపల్లి ఎస్ఈజెడ్‌లోని ఫ్యాక్టరీల సందర్శన

మద్దిపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇసుక, ఇతర ఖనిజాల దోపిడీతో గనుల శాఖను వైసీపీ పాలకులు గత ఐదేళ్లలో పూర్తిగా భ్రష్టుపట్టించారని ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. శుక్రవారం మద్దిపాడు మండలం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం ఎస్ఈజెడ్‌లోని గ్రానైట్ ఫ్యాక్టరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మైనింగ్, ఎక్సైజ్ శాఖలో త్వరలో మెరుగైన విధానాలు తీసుకొస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మైనింగ్‌లో ఇష్టారీతిన దోచుకున్నారని, వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వానికి జమచేయకుండా సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నారని విమర్శించారు. న్యాయబద్ధంగా వ్యాపారాలు చేసే వారిని రాష్ట్రం నుంచి తరిమేశారని ధ్వజమెత్తారు. గత ముఖ్యమంత్రి కొంతమంది ఏజెంట్లను పెట్టుకొని గనుల శాఖను సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇసుక విధానం అమలు చేసినప్పుడు రీచ్‌లో స్టాక్ పాయింట్ల పర్యవేక్షణ ఉండేదన్నారు. ఇసుక కొరత లేకుండా చర్యలు చేపడతామని రవీంద్ర

మిగతా 6వ పేజీలో

పశ్చిమం అతలాకుతలం

- అకాల వర్షం, గాలులతో పలుచోట్ల నష్టం
- నేలకొరిగిన వివిధ రకాల పైర్లు, తోటలు
- మిర్చిని కాపాడుకునేందుకు రైతుల పాట్లు
- గాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఒంగోలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశ్చిమప్రాంతంలో గురువారం రాత్రి గాలులతో కూడిన వర్షం పడింది. కొన్ని మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీగా కురిసింది. అలా ఒకవైపు గాలులు, మరోవైపు అకాల వర్షంతో పశ్చిమ ప్రాంతంలోని చాలాచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయంతోపాటు పొలాల్లో ఉన్న పంటలకు నష్టం వాటిల్లింది. అక్కడక్కడా కోత దశలో ఉన్న మొక్కజొన్న, అరటి, బొప్పాయి తోటలు నేలవాలాయి. కల్లాల్లో ఉన్న మిర్చి తడిసిపోతుండటంతో వాటిని రక్షించుకునేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. పశ్చిమాన వివిధ గ్రామాల్లో వెయ్యి ఎకరాలలో మొక్కజొన్న, అరటి, బొప్పాయి తోటలు దెబ్బతిని రూ.2కోట్ల మేర రైతులు నష్టపోయారు.

అకాలంలో గాలివాన

జిల్లాలో రెండు వారాలుగా ఎండల తీవ్రత పెరిగింది. ప్రత్యేకించి పశ్చిమప్రాంత మండలాల్లో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ తరుణంలో గురువారం సాయంత్రం ఆ ప్రాంతంలో వాతావరణంలో మార్పు చోటుచేసుకొంది. దీంతో కాస్తంత ఊరట పొందుతామనుకున్న ప్రజానీకానికి కొద్దిసేపటికే వర్షం అధికం కావడంతోపాటు గాలుల తీవ్రత పెరగడం తీవ్రంగా ఇబ్బందిపెట్టింది. జిల్లావ్యాప్తంగా చూస్తే అధిక ప్రాంతాల్లో జల్లులు ఉన్నప్పటికీ పశ్చిమంలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు గాలివాన ప్రభావం కనిపించింది. చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అక్కడక్కడా కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు 24 గంటల వ్యవధిలో జిల్లాలో సగటున 9.4 మీ.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఎర్రగొండపాలెం మండలంలో 66.2 మి.మీ కురిసింది. పెద్దారవీడు మండలం సానికవరంలో 60.0, పుల్లలచెరువు మండలంలో 46.0, కొమరోలులో 25.8, త్రిపురాంతంలో 23.40, బేస్తవారపేటలో 20.4, దోర్నాలలో 17.8

మిగతా 6వ పేజీలో



గాలులకు ఎర్రగొండపాలెం మండలం బోయలపల్లి వద్ద దెబ్బతిన్న బొప్పాయి తోట



బేస్తవారపేట మండలం బెన్నివారిపల్లిలో నేలవాలిన మొక్కజొన్న



పోతంపల్లి చెరువుకు గండిపడి వృథాగా పోతున్న నీరు

కళాశాలల్లో లెక్చరర్ల హేతుబద్ధీకరణ

- 455 మిగులు పోస్టులు గుర్తింపు
- ఒంగోలు జీజీహెచ్‌కి 12 మంజూరు

7

బెట్టింగ్ రాయుళ్లపై పోలీసుల పంజా

7

- నగరంలో 10 మందిని అదుపులోకి తీసుకొని విచారణ

రైళ్లలో దొంగలు కనిపిస్తే వదలొద్దు

- నిరంతర గస్తీ ఏర్పాటు : రైల్వే సీఐ
- దోపిడీలపై అప్రమత్తమైన పోలీసులు

7

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- తాగునీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి
- పంచాయతీ, మండల కేంద్రాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయండి
- అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి కాలంలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడైనా నీటి సమస్య తలెత్తితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. వేసవిలో నీటిఎద్దడి లేకుండా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని మునిసిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అధికారుల నిర్లక్ష్యం వల్ల నీటి సమస్య ఉత్పన్నమైతే అందుకు ఆయా శాఖల అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లాలో సమస్య ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి అధికారులంతా సమన్వయంతో తాగునీటి సమస్య రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోని తాగునీటి వనరులను నింపుకోవాలన్నారు. బోర్‌వెల్స్ పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చూడాలన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున ప్రతి గ్రామ పంచాయతీ, మండలకేంద్రాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణప్రాంతాల్లోని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఆటోస్టాండ్లు, పబ్లిక్ ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం పనులు జరిగే

మిగతా 6వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పాల్గొన్న అధికారులు

స్పాట్‌కు ముఖం చాటేశారు

- ఇంకా 58 మంది టీచర్ల కొరత
- ఫోన్ చేసి పిలిచినా ససేమిరా..!



ఒంగోలు విద్య, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనానికి స్కూల్ అసిస్టెంట్లు (సబ్జెక్టు టీచర్లు) ముఖం చాటేస్తున్నారు. ఏడు రోజులపాటు జరిగే స్పాట్‌లో శుక్రవారానికి ఇంకా కొన్ని సబ్జెక్టు టీచర్ల కొరత ఉందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. గురువారం నుంచి కొరత ఉన్న సబ్జెక్టులకు సంబంధించి పాఠశాల హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు నేరుగా మూల్యాంకనం కేంద్రం నుంచి ఫోన్లు చేస్తున్నా వచ్చేందుకు వారు ససేమిరా అంటున్నారు. జిల్లాలో 10వ తరగతి జవాబుపత్రాల మూల్యాంకనానికి 600 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు అవసరం కాగా 542 మంది మాత్రమే హాజరయ్యారు. ఇంకా 58 మంది అవసరం ఉంది. 150మంది చీఫ్ ఎగ్జామినర్లను స్పాట్‌కు నియమించగా 92మంది మాత్రమే వచ్చారు. మూల్యాంకనానికి సిబ్బంది నియామకంలో 60ఏళ్లు దాటిన వారు, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మినహాయింపు ఇచ్చారు. ఇలాంటివారు సుమారు 600 మంది వరకూ ఉన్నారు. వీరితో పాటు స్పాట్‌కు నియమితులైన వారిలో కొందరు వివిధ కారణాలతో మినహాయింపులు పొందారు. తీరా పేపర్లు దిద్దే సమయం వచ్చేసరికి కొన్ని సబ్జెక్టుల్లో టీచర్ల కొరత ఏర్పడింది. ప్రధానంగా బయోలాజికల్ సైన్స్, సోషల్, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో టీచర్ల అవసరం ఉంది. సోషల్ స్టడీస్ మూల్యాంకనం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ సబ్జెక్టులో 8మంది టీచర్ల కొరత ఉంది. బయోలాజికల్ సైన్స్, ఇంగ్లీషు మూల్యాంకనం కోసం ఆయా టీచర్లకు గురువారం నుంచి ఫోన్లు చేస్తున్నా రావడం లేదు. అధికారులు చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీచేస్తున్న లెక్కచేయడం లేదు. ఈ విధంగా సరిపడినంత మంది టీచర్లు ఎప్పటికి వస్తారో, మూల్యాంకనం ఎప్పటికి పూర్తవుతుందో చూడాలి.



ప్రమాదంలో దెబ్బతిన్న మినీ లారీ ముందు భాగం

ప్రమాదం మీద ప్రమాదం

- కారు బోల్తా
- సహాయక చర్యల కోసం ఆగిన లారీని ఢీకొన్న మినీ లారీ
- రైతు మృతి... 15 మందికి గాయాలు
- గొబ్బూరు వద్ద ఘటన

వివరాలు 7వ పేజీలో

సహజీవనం పేరుతో దగా చేసిన వ్యక్తిపై కేసు

మద్దిపాడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మహిళను ప్రేమ పేరుతో లోబర్చుకుని దగా చేసిన ఘటన వెలుగుచూసింది. గుండ్లాపల్లి దళితవాడకు చెందిన వేమా రమేష్‌బాబు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన భర్త చనిపోయిన మహిళతో నమ్మకంగా ప్రేమాయణం సాగించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఒంగోలులో ఒక గదని తీసుకుని 11 సంవత్సరాలు ఇద్దరూ సహజీవనం చేశారు. ఆమె వద్ద రూ.22 లక్షలు తీసుకుని అడిగినప్పుడు దాటవేత ధోరణి కొనసాగిస్తున్నాడు. రమేష్‌బాబు తాను సహజీవనం చేస్తున్న మహిళ అక్కతో సంబంధం పెట్టుకు న్నాడు. ఇదేమని అడిగే వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈక్రమంలో బాధితు రాలు హైకోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలతో ఆమె ఎస్పీ దామోదర్‌ను కలిసి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివరామయ్య తెలిపారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 17 లెక్చరర్ పోస్టులు, 6 సీనియర్ లెక్చరర్ పోస్టులు ఉన్నాయని, డిప్యూటేషన్ ప్రాతిపదికన ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికైన వారికి 2025-26 విద్యాసంవత్సరానికి మైనంపాడు డైట్ కళాశాలలో జీతం చెల్లిస్తారని తెలిపారు. ఈనెల 16, 17 తేదీల్లో రాత పరీక్ష, 19న ఇంటర్వ్యూ, 21న డిప్యూటేషన్ ఆర్డర్ జారీ ఉంటుందని, 22న డైట్ ఉద్యోగం కేటాయిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 9381695987 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

నిబద్ధతకు పట్టం

(5వ పేజీ తరువాయి)

టీడీపీ ప్రత్యేకించి నారా లోకేష్ ఆ విధానానికి తిలోదకాలు ఇచ్చారు. ఎమ్మెల్యేలు సూచించిన పేర్లను వెనక్కు పంపి గత ఎన్నికలకు ముందు, పార్టీలో బూత్‌స్థాయి నుంచి పైస్థాయి వరకు ఎక్కడైనా కీలక బాధ్యతలు నిర్వహించిన వారు, అందులోను గత ఎన్నికల్లో కూటమి పార్టీల గెలుపుకోసం కీలకంగా పనిచేసిన వారి పేర్లు సూచించాలని కోరారు. ఈ విషయమై మంత్రి నారా లోకేష్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలకు మౌఖికంగా నిర్దిష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చారు. కొందరు ఎమ్మెల్యేలు తమకు ఆర్థిక సహకారం అందించారంటూ కొత్త పేర్లు సిఫార్సు చేసినా తిరస్కరించారు. ప్రస్తుతం ఎంపికైన పదిమందిని పరిశీలిస్తే అధిష్ఠానం చెప్పిన కోవకు చెందిన వారు కావటమే విశేషం. చివరకు చైర్మన్లుగా ఎంపికైన మహిళలకు సంబంధించి కూడా వారు గానీ వారి భర్త లేక తండ్రి పార్టీలో కీలకంగా వ్యవహరించి ఉంటేనే అవకాశం కల్పించారు. మూడు ఏఎంసీ చైర్మన్ల పదవులకు సంబంధించి ఎమ్మెల్యేల సిఫార్సులను వెనక్కు పంపి తిరిగి కొత్త పేర్లు తెప్పించుకొని పార్టీలో పనిచేసిన వారు అనే అర్హత ఆధారంగా ఎంపిక చేశారని తెలిసింది.

మహిళలు, బీసీలకు ప్రాధాన్యం

ఇప్పటికీ ఖరారైన చైర్మన్ పదవుల్లో నాలుగు మహిళలు, మూడు బీసీల దక్కాయి. మహిళల్లో అద్దంకి నుంచి దళితుల్లో మాదిగ సామాజికవర్గానికి చెందిన పద్మావతిని ఎంపిక చేశారు. ఆమె తండ్రి నాగేశ్వరరావు ఆ నియోజకవర్గంలో తొలి నుంచి పార్టీలో ఉన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు పార్టీలు మారినా సరే ఆయన మాత్రం పార్టీకే నిబద్ధతతో పనిచేశారు. దర్శి నుంచి కాపు సామాజికవర్గానికి చెందిన దారం నాగవేణిని ఎంపిక చేశారు. ఆమె ప్రస్తుతం కౌన్సిలర్ కూడా. ఆమె భర్త సుబ్బారావు దర్శి పట్టణ టీడీపీ నాయకుడిగా చాలాకాలం పనిచేశారు. మద్దిపాడు చైర్మన్‌గా ఎంపికైన రాజేశ్వరి భర్త ప్రసాద్ చీమకుర్తి మండలంలో పార్టీలో అనేక కీలక పదవులు నిర్వహించారు. కనిగిరి చైర్మన్‌గా ఎంపికైన రమాదేవి భర్త శ్రీనివాసులు గత ఎన్నికల్లో టీడీపీ పక్షాన కీలకంగా పనిచేశారు. ఆయన తోడళ్లుడు జనార్దన్ రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. బీసీల్లో గిద్దలూరు నుంచి యాదవ సామాజికవర్గానికి చెందిన బాలయ్య, చీరాల నుంచి జనార్దన్‌రావు, పర్చూరు నుంచి వెంకటరావు ఎంపిక కాగా ముగ్గురు టీడీపీలో పాతకాపులే. మార్కాపురం నుంచి ఎంపికైన వెంకటరెడ్డి గతంలో బూత్ కన్వీనర్‌గా, గత ఎన్నికల్లో క్లస్టర్ ఇన్‌చార్జిగా పనిచేశారు. కంభం నుంచి ఎంపికైన భూపాల్‌రెడ్డి 2014 టీడీపీకి చేసి, 2019 వైసీపీలోకి వెళ్లినా ఆ వెంటనే టీడీపీలోకి వచ్చారు. టీడీపీకి అండగా పార్టీ బాధ్యతలు నిర్వహించారు. సంతమాగులూరు చైర్మన్‌గా ఎంపికైన కుందుర్తి గ్రామంకు చెందిన టి.రమేష్ ఒకప్పుడు కరణం బలరాంతో ఉన్నా ప్రస్తుతం మంత్రి రవికుమార్ వద్దకు వచ్చిన తర్వాత పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ప్రస్తుతం బాపట్ల జిల్లా పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. బలహీనవర్గాల నుంచి పర్చూరు చైర్మన్‌గా ఎంపికైన వెంకటరావు మాజీ మంత్రి, వైసీపీ నాయకులు గాదె వెంకటరెడ్డి స్వగ్రామమైన పావులూరులో టీడీపీ పక్షాన పనిచేస్తూ గతంలో ఒకసారి జడ్పీటీసీగా పనిచేశారు. చీరాలకు చెందిన జనార్దన్‌రావు కూడా టీడీపీ బీసీసెల్ రాష్ట్ర నాయకుడిగా ఉన్నారు.

జిల్లాలో అకాల వర్షం

● 22 మండలాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వాన

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. శుక్రవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 9.4మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా యర్రగొండపాలెంలో 66.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా పామూరు మండలంలో 2.2 మి.మీ. వర్షపాతంనమోదైంది. జిల్లాలో 38 మండలాలు ఉండగా 22 మండలాల్లో అకాల వర్షం కురిసింది. పుల్లలచెరువు 46.0, కొమరోలు 25.8, త్రిపురాంతకం 23.4, బేస్తవారిపేట 20.4, దోర్నాల 17.8, దొనకొండ 17.8, అర్ధవీడు 16.8, కొనకనమిట్ల 15.2, పెద్దారవీడు 14.2, పొదిలి 13.8, దర్శి 11.0, వెలిగండ్ల 11.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. కురిచేడు 9.0, హనుమంతునిపాడు 8.4, గిద్దలూరు 8.2, కనిగిరి 7.8, తర్లుబాడు 6.4, రాచర్ల 6.0, మార్కాపురం 5.6, కంభం 4.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

193 హెక్టార్లలో పంటలకు నష్టం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కురిసిన అకాల వర్షానికి 193.44 హెక్టార్లలో నాలుగు రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఎనిమిది గ్రామాల పరిధిలో 235 మంది రైతులకు చెందిన వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. సీఎస్‌పురం మండలంలో రెండు గ్రామాలకు చెందిన 13 మంది రైతులు, వెలిగండ్ల మండలంలో ఒక గ్రామానికి చెందిన 12 మంది రైతులు, బేస్త వారిపేట మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 210 మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. వరి పంట 12 మంది రైతులకు చెందిన 4.04హెక్టార్లు, మినుము ఒక రైతుకు చెందిన ఒక హెక్టారు, ఆలసంద 12 మ ంది రైతులకు చెందిన 10 హెక్టార్లు, మొక్కజొన్న 210 మంది రైతులకు చెందిన 178.40 హెక్టార్లలో ఆకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు.

గనులశాఖను భ్రష్టు పట్టించారు

(5వ పేజీ తరువాయి)

అన్నారు. ప్రకాశం జిల్లాలో 1,500కిపైగా మైనింగ్ సంస్థలు ఉన్నాయని, కూటమి ప్రభుత్వంలో వ్యాపారులపై వేధింపులు ఉండవన్నారు. మైనింగ్ కంపెనీలపై వేల కోట్లు పెనాల్టీలు వేసి కంపెనీలను హస్తగతం చేసుకునేందుకు వైఎస్ జగన్ కుట్రలు చేశారన్నారు. త్వరలోనే నూతన పాలసీతో మైనింగ్ సమస్యలను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. గతంలో తప్పుడు కేసులతో మూతబడిన అన్ని కంపెనీలను తెరిపిస్తామని హామీ ఇచ్చారు. నూతన విధానంతో రాష్ట్ర ఆదాయం పెరగడంతోపాటు ఉపాధి అవకాశాలు పెంచేలా చర్యలు చేపడతామన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో జరిగిన అక్రమాలను బయటకు తీసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్ర అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. తొలుత మంత్రికి పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, ఆళ్ల రవి, మండవ రత్నాకర్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

పశ్చిమం అతలాకుతలం

(5వ పేజీ తరువాయి)

దొనకొండలో 18.8, అర్ధవీడులో 16.8, కేకేమిట్లలో 15.20 మి.మీ నమోదైంది. ఇతర పలు మండలాల్లోనూ జల్లులు పడ్డాయి.

పొంగిన వాగు.. తెగిన చెరువు కట్ట

గాలివానకు బేస్తవారపేట మండలంలో దాదాపు 500 ఎకరాల్లో కోత దశలో ఉన్న మొక్కజొన్న నేలవాలింది. ఆ మండలంలోని సోమవారపుపేటలో అరటి తోటలు పడిపోగా పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. ఎర్రగొండపాలెం మండలం గుడిపాడు గ్రామ సమీపంలోని వాగు పొంగి రాత్రి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బోయలపల్లి, అమానిగుడిపాడు, ఎర్రగొండపాలెం గ్రామాల్లో బొప్పాయి తోటలు ధ్వంసమయ్యాయి. కొమరోలు మండలం ఇడమకల్లులో పిడుగుపడి రెండు గేదెలు మృతిచెందగా పలు గ్రామాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయి. పెద్దారవీడు మండలం పోతంపల్లిలో వర్షపు నీటితో చెరువు నిండి కట్టకు గండిపడింది. మార్కాపురం మండలం గజ్జలకొండలో బర్లీ పొగాకు పందిళ్లు లేచిపోయాయి. ఇక దొనకొండ, దోర్నాల, ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దారవీడు తదితర మండలాల్లో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి వర్షపు జల్లులకు తడిసిపోయే పరిస్థితి ఏర్పడగా వాటిని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పించడంతోపాటు షామియానాలు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ఆస్పత్రుల, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎం మాధురి, వివిధ శాఖల అధికారులు చిరంజీవి, వెంకటనాయుడు, వరలక్ష్మి, బాలశంకరరావు, జోసఫ్‌కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సూరిబాబు, హేనసుజన, విద్యాసాగర్, డాక్టర్ బేబిరాణి, శ్రీనివాస సంజయ్ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

మార్కాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మార్కాపురం పట్టణంలోని కాలేజీ రోడ్డులో శుక్రవారం ఉదయం వెలుగుచూసింది. ఈ ఘటనలో స్థానిక నాగులపుట్ట వీధికి చెందిన గుర్రాల మహేష్ కుమార్(26) మృతి చెందాడు. ఎస్సై డాక్టర్ రాజమోహన్ కథనం మేరకు... స్థానిక కాలేజీ రోడ్డులోగల దుస్తుల షోరూమ్‌లో మహేష్‌కుమార్ మేనేజర్‌గా 7 నెలల నుంచి పనిచేస్తున్నాడు. ఈ మధ్యే ఆ షోరూమ్ తీసేసి సదరు భవనంలో మరో షోరూమ్ ఏర్పాటు చేయడానికి పనులు జరుగుతున్నాయి. గతంలో పనిచేసిన అనుభవం ఉండటంతో మహేష్‌కుమార్‌నే నూతన షోరూమ్ వాళ్లు మేనేజర్‌గా నియమించుకున్నారు. ఈ నెల 7న సదరు షోరూమ్ ప్రారంభించాల్సి ఉంది. ఎప్పటిలాగే గురువారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లిన మహేష్‌కుమార్ భోజనం చేసి మళ్లీ షోరూమ్ వద్దకే వచ్చి పనులు పర్యవేక్షించాడు. రాత్రి కూడా ఇంటికి రాకపోవడంతో మహేష్‌కుమార్ తల్లిదండ్రులు రాముడు, పిచ్చమ్మలు సహోద్యోగి షబ్బీర్‌ను విచారించారు. అతను షోరూమ్ వద్దకు వెళ్లి లోపల పరిశీలించగా ప్లాస్టిక్ తాడుతో ఉరివేసుకుని ఉన్నాడు. వెంటనే విషయాన్ని మహేష్‌కుమార్ తల్లిదండ్రులకు తెలిపాడు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజమోహన్‌రావు తెలిపారు.

మోటారుసైకిల్‌ను ఢీకొన్న వాహనం

● ఒకరు మృతి.. మరొకరికి గాయాలు


ప్రమాదంలో మృతి చెందిన విజయభాస్కర్

పెద్దదోర్నాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం మోటారు సైకిల్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన మండల పరిధిలోని గంటవానిపల్లె గ్రామం వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎగువ చెర్లోపల్లికి చెందిన పాముల విజయభాస్కర్(24)మృతిచెందగా, అదే గ్రామానికి చెందిన కఠారి పోలురాజుకు గాయాలయ్యాయి. ఎస్సై మహేశ్ తెలిపిన కథనం ప్రకారం... విజయభాస్కర్, పోలురాజు దోర్నాలలో తమ పనులు ముగించుకుని మోటారుసైకిలుపై స్వగ్రామం చెర్లోపల్లి వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుండి ఇద్దరు కిందపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన ప్రయాణికులు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్సై మహేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని తన వాహనం ద్వారా క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యాధికారి పరిశీలించగా అప్పటికే విజయభాస్కర్ మృతి చెందినట్లు గుర్తించారు. పోలురాజుకు ప్రథమ చికిత్స నిర్వహించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మార్కాపురం రూరల్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు చెప్పారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ లలితమ్మ, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు


ప్రమాదానికి కారణమైన బస్సు, (ఇన్‌సెట్‌లో) గాయపడిన కోటేశ్వరరావు

నాగులుప్పల పాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మద్దిరాలపాడు వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు నగరం సత్యనారాయణపురంనకు చెందిన పి.కోటేశ్వరరావు శుక్రవారం సాయంత్రం మద్దిరాలపాడు నుంచి తన మోటార్‌సైకిల్‌పై జాతీయ రహదారిలోకి ప్రవేశించే క్రమంలో చీరాల నుంచి ఒంగోలు వెళుతున్న బైపాస్ రైడర్ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. దాంతో స్థానికులు కోటేశ్వరరావును చికిత్స నిమిత్తం 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

రొయ్యల దిగుమతులపై సుంకాన్ని రద్దు చేయాలి

ఒంగోలు నగరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రొయ్యల ఉత్పత్తుల దిగుమతులపై అమెరికా దేశం విధించిన 26శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేసే దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలని జిల్లా రొయ్యల రైతుల సంఘం అధ్యక్షుడు దుగ్గినేని గోపీనాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సుంకాన్ని విధించటం వల్ల రొయ్యల రైతులకు గిట్టుబాటు ధరలపై తీవ్ర ప్రభావం చూపనుందని తెలిపారు. అమెరికా మన దేశం రొయ్యలపై ఇప్పటికే యాంటి డంపింగ్ డ్యూటీ పేరుతో 3.88 శాతం, కౌంటర్‌వయలింగ్ డ్యూటీ పేరుతో 5.77 శాతం సుంకాన్ని విధించిందని గుర్తు చేశారు. దేశంలో ఉత్పత్తి జరిగే రొయ్యల్లో 70శాతం మన రాష్ట్రం నుంచే ఉత్పత్తి అవుతుందన్నారు. ఇటీవల అమెరికా విధించిన దిగుమతి సుంకాల వలన మన రాష్ట్రంలోని రొయ్యల రైతులు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని నరేంద్రమోదీ కలుగు చేసుకుని దిగుమతి సుంకాన్ని రద్దు చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

జీజీహెచ్‌లో సమస్యలపై దృష్టి పెట్టాలి

● మెడికల్ అదనపు డీఎండీ ఆదేశం


వైద్యాధికారులతో మాట్లాడుతున్న అదనపు డీఎండీ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈనెల 10న జీజీహెచ్‌కు విచ్చేస్తున్న నేపథ్యంలో సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని అడిషనల్ డీఎంఈ (అకడమిక్) డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం ఒంగోలు విచ్చేసిన ఆయన స్థానిక జీజీహెచ్‌లోని పలు సమస్యలపై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే వార్డుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జీజీహెచ్‌లో మొట్టమొదటిసారిగా రూ.6.3 కోట్లతో ఏర్పాటు చేసి క్యాథ్‌లాబ్ ప్రారంభిస్తారని, దీని ద్వారా జిల్లాలోని ప్రజలకు గుండె సంబంధిత వ్యాధులకు మరింత భరోసా లభిస్తుందని తెలిపారు. రూ.లక్షల్లో ఖర్చు అయ్యే గుండెవ్యాధులకు క్యాథ్‌లాబ్ మరింత ఉపయోగమన్నారు. జీజీహెచ్‌లో సమస్యలను నివేదిక రూపంలో సిద్ధం చేయాలని, ఎలాంటి ఫిర్యాదులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అంతకముందు క్యాథ్‌లాబ్‌ను పరిశీలించిన ఆయన వార్డుల్లో పర్యటించి రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ టి.జమున, అదనపు సూపరింటెండెండ్ నామినేని కిరణ్, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ ఏడుకొండలు, సీఎస్ఆర్ఎంవో మాధవీలత, కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు రెండు ప్రాజెక్టుల ఎంపిక


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అధికారులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ బాలికల మునిసిపల్ హైస్కూలులో శుక్రవారం నిర్వహించిన ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ జిల్లాస్థాయి ప్రాజెక్టుల ప్రదర్శనలో రెండు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. బేస్తవారపేట బాలుర జడ్పీ హైస్కూలు విద్యార్థులు ప్రదర్శించిన బైబై టెర్మైట్స్ ప్రాజెక్టు, జంగంగుంట్ల జడ్పీ హైస్కూలు విద్యార్థుల నీమ్ బిస్కట్స్ ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల ఆలోచనలు సమాజంలోని సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఉండాలన్నారు. ప్రదర్శనకు పది ప్రాజెక్టులు రాగా రెండింటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. పాఠశాల విద్యాశాఖ, ఉన్నం స్వచ్ఛంధ సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంవో ఎం.రమేష్, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్, రవికాంత్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగిన లారీని మరో వాహనం ఢీ



- రైతు మృతి.. 15 మందికి గాయాలు
- మిరపకాయలను తీసుకెళ్తుండగా ప్రమాదం

పెద్దారవీడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గొబ్బూరు వద్ద అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సుమారు రాత్రి 12 గంటల సమయంలో అమరావతి-అనంతపురం రోడ్డుపై అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కారు తిరగబడింది. అందులో ప్రయాణిస్తున్న 13 మందికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ప్రమాదాన్ని గమనించి వెనుక వస్తున్న లారీ డ్రైవర్, క్లీనర్ రోడ్డుపై లారీని ఆపి కారులో ఉన్న బాధితులను బయటకు తీసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో వెనుక నుంచి మిరపకాయల లోడుతో గంటూరు వెళ్తున్న మినీ లారీ ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు రైతులు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ఖాసిం అనే రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో రైతు, మినీ లారీ డ్రైవర్లను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో కారు దగ్ధం



పెద్దదోర్నాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉన్నపళంగా మంటలు లేచి ప్రయాణిస్తున్న కారు దగ్ధమైన ఘటన మండల పరిధిలోని శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో చింతల వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. గుంటూరుకు చెందిన రవీంద్రకుమార్ తన స్నేహితుడు శ్రీను వద్ద నుంచి రెనాల్ట్ కారును తీసుకుని కుటుంబ సభ్యులతో శ్రీశైలం వెళ్తున్నారు. చింతల దాటిన తర్వాత ఘాట్ రోడ్డు ఎక్కుతున్న సమయంలో ఇంజను నుంచి మంటలు, పొగ వ్యాపిస్తుండడంతో డ్రైవర్ అప్రమత్తమై కారు నిలిపి అందర్నీ కిందకు దింపారు. మంటలు ఎగిసిపడ్డాయి. అధిక ఉష్ణోగ్రత వల్ల మంటలు అంటుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకునే సమయానికి కారు పూర్తిగా కాలిపోయింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

సమన్వయంతో పనిచేసి సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- అద్దంకి నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి రూ.50 కోట్లు మంజూరు
- రూ. .38 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అద్దంకి, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి సమస్యలు పరిష్కరించాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం జరిగిన ప్రజావేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ ప్రాథమిక దశలో సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో జటిలం అవుతాయన్నారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అద్దంకి పట్టణ, మండల పరిధిలో సుమారు 100కు పైగా అర్జీలు మంత్రి స్వీకరించారు. అత్యధిక శాతం అర్జీలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారంపై అర్జీదారులకు స్పష్టత ఇచ్చారు. టిడ్కో ఇళ్లు, వేలమూరిపాడులో శ్మశాన సమస్య, కొటికలపూడిలో విద్యుత్ స్తంభాలను హైవే నిర్మాణ సంస్థ టిప్పర్‌లు ఢీకొని విద్యుత్ సరఫరా నిలిచిపోవటం తదితర సమస్యలను అర్జీల ద్వారా రవికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు సుమారు 50 కోట్ల రూపాయల నిధులు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయన్నారు. శాంతినగర్-మైలవరం-వి.కొప్పెరపాడు రోడ్డుకు నాబార్డ్ నుంచి త్వరలో 10 కోట్ల రూపాయలు నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా అద్దంకి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో 57 కోట్ల రూపాయలతో మంచినీటి పథకాలు వినియోగంలోకి వచ్చే విధంగా పనులు జరుగుతున్నాయన్నారు. అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి 2.5 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయన్నారు. బల్లికురవ, ఏల్చూరులలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాలకు 1.80 కోట్ల రూపాయలు చొప్పున మంజూరు అయ్యాయన్నారు. అద్దంకి పట్టణంలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు కానున్నాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన వాల్‌పోస్టర్‌లను మంత్రి ఆవిష్కరించారు. మెప్మా సిబ్బంది, ఆర్‌పీలను మంత్రి రవికుమార్ అభినందించారు.


అద్దంకిలో అర్జీలు తీసుకుంటున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

89 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

అద్దంకి నియోజకవర్గ పరిధిలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న 81 మందికి, అత్యవసర వైద్యం అవసరమైన 8 మందికి మొత్తం 1.38 కోట్ల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ముందస్తు మంజూరు పత్రాలు మంత్రి రవికుమార్ అందజేశారు. ఈ కార్యక్రమాలలో చీరాల ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు, తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఎంపీడీవో శింగయ్య, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, వివిధశాఖల అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించాలి

- జేసీ గోపాలకృష్ణ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులు పండించిన పంటను ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు కొనుగోళ్లు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి గ్రేడ్-ఏ ధాన్యం మద్దతు ధర క్వింటా రూ.2320, సాధారణ రకం మద్దతు ధర క్వింటా రూ.2300లకు కొనుగోలు చేయాలన్నారు. రబీ పంట కాలంలో 32,425 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారన్నారు. 76,397 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి వస్తుందని అందులో 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 27 మండలాల్లోని 239 రైతుసేవా కేంద్రాలను అనుసంధానం చేస్తూ 41 ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేయాలని జేసీ ఆదేశించారు. గోనె సంచులు, హమాలీలు, రవాణా సౌకర్యాల ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 41 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యాన్ని 11 రైస్‌మిల్లులకు రవాణా చేయాలని సూచించారు. రబీ పంట కాలంలో వచ్చే ధాన్యంలో విరుగుడు, నూకశాతం ఎక్కువగా ఉండటం వల్ల బాయిల్డ్ రైస్ మిల్లులను గుర్తించి తద్వారా వచ్చే బాయిల్డ్ బియ్యం, పచ్చిబియ్యాన్ని భారత ఆహర సంస్థకు రవాణా చేయాల న్నారు. రానున్న వారం రోజుల్లో వాతావరణ శాఖ సూచనల మేరకు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందువల్ల ధాన్యం తడవకుండా టార్పలిన్ పట్టలను పరిచి భద్రపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, వ్యవసాయ, సహకార సంఘాల అధికారులు ఉన్నారు.



ఓపెన్ ఇంటర్ స్పాట్ ఓకే

ఒంగోలు విద్య, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఏబీఎం జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి రెండో రోజైన శుక్రవారం అధ్యాపకులు పెరిగాయి. స్పాట్ ప్రారంభ మొదటి రోజు మూల్యాంకానికి అవసరమైన మేరకు అధ్యాపకులు రాలేదు. కేవలం 41 మంది మాత్రమే హాజరు కాగా శుక్రవారం ఆ సంఖ్య 164కు పెరిగింది. అంటే శుక్రవారం 123 మంది కొత్తగా మూల్యాంకనం విధులకు హాజరయ్యారు. 125 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు అవసరం కాగా 118 మంది, 25 మంది చీఫ్ ఎగ్జామినర్లకు 23 మంది, స్క్రూటనైజర్లకు 25 మంది హాజరయ్యారు. అవసరమైన మేరకు ఎగ్జామినర్లు మూల్యాంకానికి హాజరు కావడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా 7వ తేదీకి మూల్యాంకనం పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

వక్ఫ్ బిల్లు ఆమోదానికి సహకరించడం దుర్మార్గం

- ముస్లిం నాయకులు టీడీపీకి రాజీనామా చేయాలి : సత్తార్



నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదించడం ముస్లింలకు వెన్నుపోటు పొడవటమేనని సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్దుల్ సత్తార్ ఆరోపించారు. బిల్లు ఆమోదానికి బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారమే కారణమన్నారు. ఒంగోలులో ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా కుతంత్రాలతో ఈ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించుకున్నారని ఆరోపించారు. ఈ బిల్లు వద్ద ముస్లింలకు ఏ విధంగా మేలు చేకూరుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే, విమానశ్రాయాలు, ఎల్‌ఐసీలను అమ్ముతుంటే పార్లమెంట్ సభ్యులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇచ్చిన పార్టీలకు గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీలోని ముస్లిం పార్టీ నాయకులందరూ రాజీనామాలు చేసి బయటకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాజావలి, ఆరిఫ్, షఫీగని, ఇమామ్, ఆయూబ్, మహ్మద్ ఆలీ, బాజీ, షమీమ్, రజాక్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ల హేతుబద్ధీకరణ

- 455 మిగులు పోస్టులు గుర్తింపు
- ఒంగోలు జీజేసీకి 12 మంజూరు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ల హేతుబద్ధీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 455 జూనియర్ లెక్చరర్ పోస్టులు మిగులుగా గుర్తించారు. ఈ మిగులు పోస్టులను రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా పోస్టులు మంజూరు చేయకుండా ఏర్పాటు చేసిన 84 కొత్త ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కేటాయించారు. ఈ మేరకు ఇంటర్మీడియేట్ విద్యా కార్యదర్శి కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రాష్ట్రంలోనే అత్యధికంగా 12 పోస్టులు మంజూరు చేశారు. ఇంటర్ విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మిగులు టీచర్లను హేతుబద్ధీకరణ ద్వారా అవసరం ఉన్న కళాశాలల్లో నియమించేందుకు చర్యలు చేపట్టింది. కొన్ని కళాశాలల్లో విద్యార్థులు లేక అధ్యాపకులు ఖాళీగా ఉంటుండగా మరికొన్ని కళాశాలల్లో విద్యార్థులకు బోధించేందుకు అధ్యాపకులు లేక కేవలం కాంట్రాక్టు అధ్యాపకులతో కళాశాలలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 455 జూనియర్ లెక్చరర్ పోస్టులు మిగులుగా గుర్తించారు. వీటిలో 214 పోస్టులను యథాతథంగా అవసరం ఉన్న కొత్త కళాశాలలకు బదిలీ చేస్తారు. మిగిలిన 241 పోస్టులను ఇతర సబ్జెక్టులకు మార్పు చేసి కొత్త కళాశాలలకు కేటాయిస్తారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రస్తుతం ఉన్న కోర్సులు కొన్నింటిలో పిల్లలు చేరడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న కొత్తకోర్సుల సబ్జెక్టులకు మార్చి కళాశాలలకు కేటాయిస్తారు.

ఒంగోలు జీజేసీకి 12 పోస్టులు

ప్రభుత్వం ఒంగోలులో కొత్తగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలకు గతంలో ఒక్క పోస్టు కూడా మంజూరు కాలేదు. ప్రస్తుతం హేతుబద్ధీకరణలో 12 పోస్టులు మంజూరు చేశారు. ఇంగ్లీషు, తెలుగు, సంస్కృతం, ఫిజికల్ ఎడ్యుకేషన్, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజీ, హిస్టరీ, కామర్స్, ఎకనామిక్స్ పోస్టులు, పెద్దారవీడు జీజేసీకి ఇంగ్లీషు, తెలుగు, లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హిస్టరీ, తాళ్ళూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, లెక్కలు పోస్టులు మంజూరు చేశారు. జరుగుమల్లి మండలం కామేపల్లిలో అప్పటి విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఒక్క పోస్టు కూడా మంజూరు కాలేదు.

టేప్‌బాల్ క్రికెట్ ఇండియా జట్టుకు ఎంపిక



సుమంత్


యశ్వంత్

అద్దంకి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): టేప్‌బాల్ క్రికెట్ ఇండియా జట్టుకు అద్దంకి పట్టణానికి చెందిన పూనూరి సుమంత్, యశ్వంత్‌లు ఎంపికయ్యారు. ఈ నెల 6 వ తేదీ నుంచి శ్రీలంకలో ప్రారంభమయ్యే టేప్‌బాల్ క్రికెట్ సిరీస్‌కు భారత జట్టులో అద్దంకి పట్టణంలోని బ్రహ్మానందం కాలనీ రోడ్డుకు చెందిన టీడీపీ ఎస్సీ సెల్ నేత పూనూరి నరేంద్ర కుమారులు సుశీల్ సుమంత్, సుశీల్ యశ్వంత్‌లు ఆడనున్నారు. సామాన్య కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు ఇండియా జట్టుకు ఎంపిక కావటం పట్ల పలువురు అభినందిస్తున్నారు. సుమంత్ బీటెక్ చదివి హైదరాబాద్ లో సాఫ్ట్‌వేర్‌గా, యశ్వంత్ ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ కంపెనీలో లీగల్ అడ్వైజర్ గా పనిచేస్తున్నారు. ఇరువురు మూడు సంవత్సరాల పాటు హైదరాబాద్ క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. ఫిబ్రవరిలో ముంబైలో జరిగిన సెలక్షన్స్‌లో ఇద్దరూ ఎంపికయ్యారు.

బెట్టింగ్ రాయుళ్లపై పోలీసుల పంజా

- నగరంలో 10 మందిని అదుపులోకి తీసుకొని విచారణ

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఐపీఎల్ జోరులో క్రికెట్ బెట్టింగ్‌లు అధికమయ్యాయి. కొంతమంది యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లు వేస్తుండగా మరికొంత మంది ఏజెంట్ల ద్వారా పందేలు వేయడం పరిపాటిగా మారింది. దీంతో ఒంగోలు నగరంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు నేతృత్వంలో 15 పోలీసు బృందాలు శుక్రవారం రాత్రి ఆకస్మికంగా 30 ప్రాంతాల్లో తనిఖీలు చేశాయి. 10 మందిని పోలీసలుఉ అదుపులోకి తీసుకున్నారు. బెట్టింగ్ యాప్‌లు ఉండటంతో పాటుగా, కొంతమంది సెల్‌ఫోన్‌లలో బెట్టింగ్ ఆడుతున్నట్లు కాల్ హిస్టరీని గుర్తించారు.

రైతులు అధిక ఆదాయం పొందేలా కృషి చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై దృష్టి సారించి ప్రతి రైతుకు ఖర్చు తగ్గించి ఉత్పత్తి పెంచి తదనుగుణంగా అధిక ఆదాయం పొందేలా కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ సమావేశపు హాలులో శుక్రవారం వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. డ్రోన్ వినియోగం ముందు, డ్రోన్ వినియోగం తర్వాత ఎంత పంట దిగుబడి వచ్చిందో వ్యవసాయ అధికారులు సమగ్రంగా పరిశీలన చేసి నివేదికలు రూపొందించాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, గ్రామస్థాయిలో సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. సేంద్రియ ఉత్పత్తులను పెంచడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగాలన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఇంటిగ్రేటెట్ ఫార్మింగ్ విధానంలో ప్రకృతి వ్యవసాయం అవలంబించేలా కార్యచరణ రూపొందించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఉద్యాన పంటల అభివృద్ధికి మంచి అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొటెన్షియల్ ఏరియాను గుర్తించి ఉద్యాన పంటలపై రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లాలో సూక్ష్మ సేద్యం విధానాన్ని మరింత ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని మైక్రో ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పాల ఉత్పత్తి పెంచడానికి ఏమి చర్యలు తీసుకోవాలి, ప్రస్తుత పాడిపశువులపై కుటుంబానికి ఎంత ఆదాయం వస్తోంది తదితర విషయాలను సమగ్రంగా విశ్లేషించి నివేదికను రూపొందించాలని పశుసంవర్ధకశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పండించిన పంటకు సరైన ధర లభించేలా మార్కెట్ సదుపాయాలపై కూడా నివేదికను అందజేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబిరాణి, ఉద్యానవనశాఖ అధికారి గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

దొంగలు కనిపిస్తే వదలొద్దు


మాట్లాడుతున్న రైల్వే సీఐ మౌలా షరీఫ్

- నిరంతర గస్తీ ఏర్పాటు : రైల్వే సీఐ
- రైళ్లలో దోపిడీలపై అప్రమత్తమైన పోలీసులు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేసవి రావడంతో రైళ్లలో దోపిడీ ముఠాలు దొంగతనాలకు పాల్పడుతున్నాయని, దొంగల కదలికలు ఉంటే వదలొద్దని ఆదేశాలు జారీ చేశామని ఒంగోలు రైల్వే సీఐ ఎస్‌కె.మౌలా షరీఫ్ తెలిపారు. రాష్ట్రంలో వరుసగా నెల్లూరు, కర్నూలు, బోగోలు, గుంతకల్లు ప్రాంతాల్లో రైళ్లలో దోపిడీ ముఠాలు స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో రైళ్లలో ప్రయాణికులకు భద్రత పెంచామని పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రైల్వే సర్కిల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రైళ్లలో ప్రయాణికులు తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా పెట్టుకోవాలని ఆయన అన్నారు. 2023 ఆగస్టు నెలలో తెట్టు సమీపంలో దోపిడీ ముఠాలు చోరీ పాల్పడేందుకు రైళ్లను నిలిపివేశారని అన్నారు. ఇలాంటి నిర్మానుష్య ప్రదేశాలలో మోటర్ బైక్‌పై ఆయుధాలతో పోలీసు సిబ్బంది గస్తీ తిరుగుతున్నట్లు తెలిపారు. రైల్వేస్టేషన్‌లలో ప్రయాణికులను అప్రమత్తం చేస్తున్నామని అన్నారు. దొంగలు రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లో టిక్కెట్ లేకుండా ప్రయాణం చేస్తున్నారని అన్నారు. ఫేక్ చిరునామాతో ఎక్స్‌ట్రా ఫేర్ టిక్కెట్ తీసుకుంటున్నారని టిక్కెట్ కలెక్టర్లు అలాంటి వారిని గుర్తించాలని అన్నారు. రైల్వే గేట్లు వద్ద పెట్రోలింగ్ చేస్తున్నారని తెలిపారు. నిత్యం రైళ్లలో గస్తీ పెంచామని తెలిపారు. అదనపు బలగాల కోసం ఎస్పీని కోరామని వివరించారు.

క్యాన్సర్ సర్వేను వేగవంతం చేయాలి

● డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న క్యాన్సర్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఎన్‌సీడీ సర్వేను రోజుకు 30 గృహాలను సందర్శించి చేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో చాంబర్‌లో శుక్రవారం ఒంగోలు నగరం, ఒంగోలు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాన్సర్ సర్వేలో గుర్తించిన అనుమానితులను ప్రివెంట్ అంకాలజీ యూనిట్‌కు పంపాలన్నారు. తక్కువ శాతం సర్వే జరిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ ఆధారిత హాజరును క్రమం తప్పకుండా వేయాలని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల సమస్యలను తెలుసుకొని వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జింక్‌మాత్రలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ అన్సారియాకు సత్కారం



కలెక్టర్ అన్సారియాను సత్కరిస్తున్న అధికారులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): బంగారుబాల్యం కార్యక్రమాలతో జాతీయ స్థాయి స్కోచ్ అవార్డు అందుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియాను పలు శాఖల అధికారులు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 25వ తేదీ వరకు ఏడో విడత పోషణ్ పక్వాడా కార్యక్రమం ఉన్నందున పిల్లల్లో పోషకాహార లోపాలను గుర్తించాలన్నారు, ఆధార్‌కార్డులు లేని చిన్నారులను గుర్తించి వారికి ఆయా కార్డులు వచ్చేవిధంగా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హీనాసుజన్, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీడీలు లక్ష్మానాయక్, వరలక్ష్మి, అర్చన, డీఈవో కిరణ్‌కుమార్, డీపీవో వెంకటనాయుడు, జడ్పీ సీఈవో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసూర్య విద్యానికేతన్‌లో యూత్ పార్లమెంట్



యూత్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నవరప్పాడు 2వలైనులోని శ్రీసూర్య విద్యానికేతన్ లో 7,8,9 తరగతి విద్యార్థులకు నిర్వహించిన యూత్ పార్లమెంట్ ఉత్సాహంగా సాగింది. విద్యార్థుల మధ్య ప్రతిపక్ష, అధికార పక్ష తీరును ప్రదర్శించారు. అలాగే స్పీకర్ బాధ్యతలను తెలియజేస్తూ చక్కగా తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రధానమంత్రిగా 9వ తరగతి విద్యార్థి జయకుమార్, హోమ్ మంత్రిగా పావనిలాస్య, ప్రతిపక్ష నేతగా మిథున్‌చక్రవర్తి మాట్లాడిన విధానం అందరినీ ఆకట్టుకుంది. తల్లిదండ్రులు పార్లమెంట్ సమావేశం తీరును చూసి అభినందించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీపతి ప్రకాశం, కార్పొరేటర్ చింతపల్లి గోపి, స్కూలు కరస్పాండెంట్ రామాల వెంకట రామిరెడ్డి, ప్రిన్సిపాల్ బీఎస్ఆర్.శాస్త్రి, అడ్మిన్ మాదాల సిద్ధి లింగయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనులకు కూలీలు వచ్చేలా చూడాలి

సంతనూతలపాడు, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు కూలీలు వచ్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు కోరారు. శుక్రవారం సంతనూతలపాడులోని తన కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పని ప్రదేశాల్లో కూలీలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజుకు రూ.300 కూలి అందేలా కొలతల ప్రకారం పని జరగాలన్నారు. గ్రామాల్లో ఫారంపాండ్స్ మంజూరైన వాటికి వెంటనే పనులు మొదలుపెట్టి పురోగతిలోకి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో వాసంతి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తిరునాళ్లను ప్రశాంతంగా జరుపుకోవాలి



ప్రభల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ

చీమకుర్తి, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా రామతీర్థం తిరునాళ్లను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావులు కోరారు. శుక్రవారం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ప్రభల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నవారు తగు సూచనలు చేశారు. అసభ్య నృత్యాలకు తావివ్వకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. పోలీసుల సూచనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామస్థులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్ ఎదురు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఎస్‌ఐ శ్రీకాంత్, స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం

చీమకుర్తి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకం చేపట్టిన రీసర్వేతో భూసమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. రెండోవిడత రీసర్వేలో భాగంగా ఎంపికైన నిప్పట్లపాడు గ్రామంలో గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని జరిపారు. కార్యక్రమంలో డీటీ అరుణ, చంద్రశేఖర్, వంశీ పాల్గొన్నారు.

భూసార పరీక్షలను చేయించుకోవాలి



మాట్లాడుతున్న మోహనరెడ్డి

కొత్తపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి రైతూ తమ పొలానికి భూసార పరీక్ష చేయించుకోవాలని ఏవో మోహనరెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపట్నం రైతు సేవా కేంద్రంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు పంటల సాగులో నష్టపోకుండా ఉండాలంటే ముందుగా భూసార పరీక్షలు చేయించుకుని లోపాలను తెలుసుకోవాలన్నారు. సూక్ష్మపోషకాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు.

చీమకుర్తి మండల అభివృద్ధికి కృషి

త్వరలోనే మండల నిధులతో సమస్యలను పరిష్కరిస్తాం ● ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ● బండ్లమూడి పీహెచ్‌సీలో నూతన బ్లాక్ ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని బండ్లమూడి పీహెచ్‌సీలో రూ.50లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, బ్లాక్ యూనిట్ వల్ల రోగులకు ఒనగూరే ప్రయోజనాలను గురించి డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు వివరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలపరిషత్ ఖాతాలో ఉన్న రూ.20కోట్లు, ఆర్ఎల్‌పురం పంచాయతీ పరిధిలో ఉన్న రూ.20కోట్లు, డీఎంఎఫ్ నిధులతో మండలంలో అభివృద్ధి పనుల నిర్వహణకు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఆర్‌అండ్‌బీ నిధుల నియోజకవర్గానికి రూ.6కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన జనరేటర్‌ని ఏర్పాటు చేస్తామన్నారు. త్రీఫేస్ కరెంట్ సరఫరాలో ఇబ్బందులను రైతులు బీఎన్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ బ్రహ్మయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, వేల్పుల శ్రీనివాసరావు, యడ్లపల్లి రామబ్రహ్మం, రంపతోటి అంకారావు, వనిపెంట శ్రీనివాసరెడ్డి, కటకంశెట్టి సుబ్బారావు, రమణారెడ్డి, పాలగిరి జ్యోతి, దేవరపల్లి వెంకటలక్ష్మి, ఏసోబు, పొదిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చీమకుర్తి మహిళకు మద్దిపాడు ఏఎంసీ కిరీటం

చైర్‌పర్సన్‌గా మన్నం రాజేశ్వరిని ఖరారు చేసిన అధిష్ఠానం ● సీనియర్ నాయకుడు మన్నం ప్రసాద్ సేవలకు గుర్తింపు



మన్నం ప్రసాద్, రాజేశ్వరి దంపతులను సత్కరిస్తున్న నాయకులు

చీమకుర్తి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి) : గత కొంతకాలంగా రాజకీయవర్గాల్లో ఉత్కంఠ రేపుతున్న మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి చీమకుర్తికే దక్కింది. పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, పార్టీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మన్నం ప్రసాద్ సతీమణి మన్నం రాజేశ్వరిని మద్దిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేస్తూ అధిష్ఠానం శుక్రవారం ప్రకటించింది. గతంలో టీడీపీ మండల అధ్యక్షులుగా రెండుసార్లు, ఉమ్మడి ప్రకాశం జిల్లా జిల్లా కార్యదర్శిగా మన్నం ప్రసాద్ పార్టీకి అందించిన విశేష సేవలను గుర్తించిన అధిష్ఠానం చైర్మన్ పదవి మహిళకు రిజర్వ్ కావటంతో ప్రసాద్ సతీమణి రాజేశ్వరిని ఎంపిక చేసింది. ఆమె ఎంపికపై కసరత్తులో భాగంగా రకరకాల సమీకరణాలను పరిగణలోకి తీసుకొని చివరగా గత రెండురోజులుగా ఏఎంసీ పరిధిలోని టీడీపీ ముఖ్యనాయకుల నుంచి టెలిఫోనిక్ సర్వే ద్వారా అభిప్రాయాలను తీసుకొని వచ్చిన ఫలితాలు మేరకు ఖరారు చేసినట్లు తెలుస్తున్నది. మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ గిరి ఇప్పటివరకు ఎక్కువసార్లు చీమకుర్తికే దక్కటం విశేషం. తాజాగా ఎంపికైన రాజేశ్వరి పుట్టిల్లు కూడా చీమకుర్తి మండలం కూనంనేనివారిపాలెం కావటం విశేషం. కాగా ఏఎంసీ చైర్మన్ ఎంపిక విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు పట్టణంలోని తూర్పుబజారులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద మన్నం ప్రసాద్, రాజేశ్వరీ దంపతులను ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌గా ఎంపికైన మన్నం రాజేశ్వరి, ప్రసాద్‌లు మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అధిష్ఠానం తమపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఏఎంసీ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు. రాజేశ్వరిని అభినందించిన వారిలో టీడీపీ పట్టణ, మండల నాయకులు గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, పూనాటి వెంకట్రావు, అవనిగడ్డ శేషారావు, ముప్పూరి చలమయ్య, వేల్పుల శ్రీనివాసరావు, శిద్దా సుధాకర్, మన్నం నాగరాజు, గొల్లపూడి వెంకట్రావు, యడ్లపల్లి రామబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య, కొత్రపు రాఘవరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, కందిమళ్ల గంగాధరరావు, నర్రా నాగరాజు ఉన్నారు.

ప్రభుత్వం, క్రైస్తవుల మధ్య

విద్వేషాలు సృష్టించే వారిని తరిమికొట్టాలి

● టీడీపీ మండలాధ్యక్షుడు మనోజ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతిని అడ్డుపెట్టుకొని కొందరు వ్యక్తులు ప్రభుత్వం, క్రైస్తవుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారని, అలాంటి వారిని తరిమికొట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం క్రైస్తవ సంఘ కాపరులకు గౌరవవేతనం నిధులు విడుదల చేయగా ఉప్పుగుండూరు గ్రామంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో మండల పాస్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కృతజ్ఞత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ క్రైస్తవుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. గత ఎనిమిది నెలలుగా పాస్టర్‌ల గౌరవవేతనం నిలిచిపోగా దానిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం చంద్రబాబు నాయుడు నిధులు విడుదల చేయడం క్రైస్తవుల పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పాస్టర్స్ యూనియన్ అభివృద్ధి, చర్చిల నిర్మాణాలకు దోహదపడుతున్నారని చెప్పారు. పాస్టర్స్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ మృతిని అడ్డుపెట్టుకొని కొందరు స్వార్థపరులు క్రైస్తవులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వారిని తరిమికొట్టాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం సంఘకాపరులకు చేయూత ఇస్తుందన్నారు. అనంతరం యూనియన్ నాయకులు మనోజ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాటిబండ్ల దానియేలు, ఎరిచర్ల డేవిడ్, గడ్డం ఇస్రాయేలు, పారి దావీదు, తెలగపూడి సుధాకర్, నంబూరి భాస్కరరావు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమ మనుగడను కాపాడాలి

● ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ల తీర్మానం



సమావేశంలో పాల్గొన్న ఫ్యాక్టరీ ఓనర్లు

చీమకుర్తి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ పరిశ్రమ మనుగడను కాపాడే చర్యలను ప్రభుత్వం తీసుకోవాలని గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ల నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. రామతీర్థం వద్ద ఉన్న వీటీసీలో బూదవాడ, చీమకుర్తి, ఆర్ఎల్‌పురం, వేలూరు ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ల నాయకులు శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కుదేలవుతున్న గ్రానైట్ ఫ్యాక్టరీలను ఎలా కాపాడుకోవాలనే విషయంపై చర్చించారు. కార్పొరేట్ శక్తులు బడా ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తుండటంతో స్థానిక ఫ్యాక్టరీలు మూతపడే దిశకు చేరుకుంటున్నాయని, ముడిరాయినిచ్చే క్వారీల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుండగా కటింగ్ ఫ్యాక్టరీలు మాత్రం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుండటం పరిశ్రమ మనుగడను దెబ్బతీస్తుందని సభ్యులు అభిప్రాయపడ్డారు. అందుకే కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫ్యాక్టరీలకు అధికారులు అనుమతులు మంజూరు చేయవద్దని సమావేశంలో తీర్మానించారు. ఫ్యాక్టరీ ఓనర్లు అందరూ శ్లాబ్‌సిస్టంలో చేరి ప్రభుత్వానికి సహకరించాలని తీర్మానించారు. ఏపీ మిడ్‌వెస్ట్‌లో జరుగుతున్న అక్రమ వ్యాపారాలు వలన చిన్న ఫ్యాక్టరీల మనుగడకు ప్రమాదకరంగా ఉందని సమావేశంలో పాల్గొన్న కొంతమంది ఓనర్లు వాపోయారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు యర్రగుంట్ల శ్రీనివాసరావు, కాట్రగడ్డ రమణయ్య, లగడపాటి శ్రీనివాసరావు, నూకల సురేంద్ర పాల్గొన్నారు.

కార్మికుల వయోపరిమితిని పెంచాలి

● సీఐటీయూ నగర కార్యదర్శి మహేష్



మస్టర్ పాయింట్ల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పాలక సంస్థలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని సీఐటీయూ నగర కార్యదర్శి టి.మహేష్ డిమాండ్ చేశారు. నగరంలోని ఐదు మస్టర్ పాయింట్ల వద్ద శుక్రవారం ఉదయం కార్మికులు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ పారిశుధ్య, ఇంజనీరింగ్, వివిధ విభాగాల్లో గత 20 ఏళ్ల నుంచి కార్మికులు పనిచేస్తున్నారని, గత ఏడాది సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం ఆప్కాస్‌లో ఉన్న కార్మికులను కూడా 62 ఏళ్ల వయస్సు పరిమితి అనంతరం రిటైర్డ్ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూడా కార్మికుల సమ్మె శిబిరాలకు వచ్చి మద్దతు పలికిందని గుర్తు చేశారు. కానీ టీడీపీ అధికారంలోకి వచ్చాక అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. కార్మికుల రిటైర్డ్ వయస్సు పరిమితి 60 ఏళ్ళు మాత్రమేనని సర్క్యులర్ జారీ చేయడం తగదని, ప్రభుత్వం దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్మికుల యూనియన్ బాధ్యులు కె.సామ్రాజ్యం, జి.నరసింహ, ఎం.బాబు, ఆర్.శ్రీనివాసరావు, కె.మోహనరావు పాల్గొన్నారు.

పేస్‌లో ముగిసిన అవగాహన సదస్సు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో జెడ్ స్కేలార్ టెక్ క్యాంప్‌పై మూడు రోజుల పాటు నిర్వహించిన అవగాహన సదస్సు శుక్రవారంతో ముగిసింది. కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులకు ఈ వర్క్‌షాపును నిర్వహించారు. హైదరాబాద్ జడ్‌స్కేలార్ లీడ్ ట్రైనర్ సాయివెంకట్ ఉద్యోగాల సాధనలో జడ్ స్కేలార్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ వీరాంజనేయులు, సుబ్బారావు, సీఎస్ఈ విభాగాధిపతి ఎస్.గిరిబాబు, రాజ్‌కిరణ్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు బింగినపల్లిలో మెగా వైద్య శిబిరం



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న చైర్మన్ బాలాజీ

సింగరాయకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బింగినపల్లిలో గ్రామ అభ్యుదయ కమిటీ, ఒంగోలు కిమ్స్, విజయవాడ అనిలా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. శుక్రవారం ఆయన తన స్వగ్రామమైన బింగినపల్లిలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మధరావు, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్ హాజరవుతారని తెలిపారు. అన్ని విభాగాల వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు, చుట్టు పక్కల గ్రామాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్సు, కారు ఢీ

మద్దిపాడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బస్సు, కారు ఢీకొన్న సంఘటన శుక్రవారం మద్దిపాడు ప్రధాన కూడలి వద్ద జరిగింది. అద్దంకి నుంచి ఒంగోలు వెళుతున్న ఆర్టీసీ బస్సుకు ఒక్కసారిగా కారు అడ్డురావడంతో ఢీకొన్నాయి. ఈ సమయంలో ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును పక్కకు తిప్పటంతో ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు.

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సృజన్‌కుమార్

మద్దిపాడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఓటర్ కార్డుకు ఆధార్ నెంబర్‌ను తప్పనిసరిగా అనుసంధానించాలని తహసీల్దార్ సృజన్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం మద్దిపాడు మండల కార్యాలయంలో బీఎల్‌వోలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ కార్డులో పేరు తప్పు ఉన్న వారికి సరిదిద్దాలని చెప్పారు. నూతన ఓటర్ల నమోదు, తొలగింపు వంటి వాటిపై ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని తెలిపారు. ఒకే కుటుంబ సభ్యులు ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీటీ అజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ రమణయ్య పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టం సవరణపై నిరసన

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం హక్కులను హరించే విధంగా వక్ఫ్ సవరణ చట్టాన్ని తెచ్చారంటూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ఇస్లాంపేట, గాంధీనగర్‌లో నిరసన కార్యక్రమాలు, కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తంబి శ్రీనివాసులు, ఎండీ.యాసిన్, టి.మహేష్, జిలాని, బాషా, ఎస్‌కే.పీరు, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో సీహెచ్‌సీని ఏర్పాటు చేయాలి



డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు అధికంగా నివసిస్తున్న అతి పెద్ద మేజర్ గ్రామ పంచాయతీ ఉప్పుగుండూరు గ్రామంలో ప్రభుత్వ వైద్యసేవలు అందేలా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను నిర్మించాలని టీడీపీ నాయకులు కోరారు. ఈమేరకు ఒంగోలులో డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లును శుక్రవారం వారు కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు కనగాల శ్రీను, బెల్లం శ్రీను, మిండాల శ్రీనివాసరావు, రిటైర్డ్ హెల్త్ సూపర్‌వైజర్ కేఎల్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీఐ శ్రీకాంత్‌బాబు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు సూచించారు. నాగులుప్పలపాడు సచివాలయంలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న వారిని కుటుంబ సభ్యులు ప్రేమగా ఆదరించాలన్నారు. ఎవరినైనా ఇబ్బందులకు గురి చేస్తే సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం శక్తి యాప్‌పై మహిళా పోలీసులు, గ్రామంలోని మహిళలకు అవగాహన కల్పించారు. శక్తి యాప్‌ను మహిళలు తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడు చేసుకోవడం ద్వారా ఆపద సమయాల్లో రక్షణగా నిలుస్తుందని వివరించారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ పరమేశ్వరి, మాధురి, సౌజన్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



ఎంఈవో రవిని సన్మానిస్తున్న సాయిబాబా

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మద్దిరాలపాడు ఎస్సీకాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం హెచ్‌ఎం ఉమ్మనేని రామారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ సీనియర్ నాయకుడు గుమ్మడి సాయిబాబా మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్యను లభిస్తుందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. స్కూలు అభివృద్ధికి ఎల్లవేళలా తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ.రమణయ్యలను సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ కిషోర్ పాల్గొన్నారు.

ఒంగోలు రైల్వే ఎస్‌ఐగా మధుసూదనరావు

ఒంగోలు క్రైం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు రైల్వే ఎస్‌ఐగా కె.మధుసూదనరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం జిల్లా పోలీసు కార్యాలయంలో పీసీఆర్‌లో పనిచేస్తున్న ఆయన ఒంగోలు రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందాయి. అక్కడ ఎస్‌ఐ పనిచేస్తున్న టి.అరుణకుమారి గుంటూరు రేంజి కార్యాలయంలో రిపోర్టు చేయాలంటూ ఉత్తర్వులో పేర్కొన్నారు. దీంతో బాధ్యతలు తీసుకున్న మధుసూదనరావు సీఐ మౌలాషరీఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ముంచిన అకాల వర్షం

పశ్చిమాన ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వాన



• గాలివానకు నేలకొరిగిన అరటి, మొక్కజొన్న, శనగ పంటలు • కొమరోలులో పిడుగుపాటుకు గేదెలు మృతి • కూలిన విద్యుత్ స్తంభాలు • పొంగిన వాగులు - ఆగిన రాకపోకలు


ఇడమకల్లులో పిడుగుపాటుకు మృతిచెందిన గేదెలు

పిడుగులతో బీభత్సం

కొమరోలు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారంరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి ఒక పక్క పంటలు దెబ్బతినగా, మరో పక్క జీవాలు మృతి చెందాయి. అకాల వర్షానికి జొన్న, పొగాకు, అరటి తోటలు దెబ్బతిన్నాయి. గతంలో శనగ, అరటి, జొన్న పంటలకు బీమా చేసినా ఇప్పటి వరకు రాలేదని, నిన్న జరిగిన నష్టాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని కొమరోలు మండల రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కోరారు. భారీ పిడుగులతో కూడిన వర్షానికి ఇడమకల్లు గ్రామంలో మల్లెపోగు యాకోబుకు చెందిన రెండు గేదెలు మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ. లక్ష ఉంటుందని బాధితుడు తెలిపారు. బాదినేనిపల్లిలో వేమారెడ్డి వెంకటరెడ్డి ఇంటికి దగ్గర పిడుగు పడటంతో శ్లాబు నెర్రెలిచ్చింది.

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొత్తపల్లి, బోయలపల్లి, గురిజేపల్లి, అమానిగుడిపాడుతో పాటు పలు గ్రామాలలో భారి వర్షం కురిసింది. బొప్పాయి, మిరప పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పంటలు దెబ్బ తినడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వెంకట సుబ్బయ్య, వెంకట రెడ్డి, శ్రీనివాస్‌లతో పాటు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కుంటనుంచి అమానిగుడిపాడు గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న ఒద్దులవాగు, గుడిపాడు నుంచి గుర్రపుశాల వెళ్లే దారిలోని రాళ్లవాగు, బోయలపల్లి నుంచి గురిజేపల్లి వెళ్లే రహదారిలోని కాశివరపు వాగులు 10 అడుగుల మేర పొంగిపొర్లడంతో అర్ధరాత్రి వరకు ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయినట్లు ప్రజలు తెలిపారు. గురిజేపల్లి, ఎర్రగొండపాలెం, బోయలపల్లి, అమానిగుడిపాడు గ్రామాలలో వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు నెలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆయా గ్రామాలలో విద్యుత్ నిలిచిపోవడంతో కొన్ని గంటలపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దెబ్బతిన్న పంటలను ఉద్యానవనశాఖ అధికారులు, సిబ్బంది పరిశీలించి రైతుల పేర్లను నమోదు చేసుకున్నట్లు ఉద్యానవనశాఖ అధికారి ఆదిరెడ్డి తెలిపారు.


గండిని పూడుస్తున్న గ్రామస్థులు

పోతంపల్లి చెరువుకు గండి.. తాపీగా వచ్చిన అధికారులు

పెద్దారవీడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారంరాత్రి ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం భారీగా కురిసింది.తోకపల్లి, పోతంపల్లి గ్రామాలలో భారీ వర్షం కురిసింది. కళ్లాల్లో మిరపకాయలు ఆరబోసిన రైతులు కొంతమేర వాటిని తడవకుండా పట్టలు కప్పుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. పోతంపల్లి చెరువు భారీగా వర్షపునీరు చేరడంతో గండి పడింది. ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించినా స్పందించలేదని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో పెద్దలు సొంత ఖర్చులతో ఎక్స్‌కవేటర్ సహాయంతో గండిని పూడ్చి చెరువు కట్టను పటిష్ట పరిచారు. చివరకు ఇరిగేషన్ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం గ్రామస్థులు పూడ్చిన గండిని పరిశీలించారు.

446 ఎకరాల్లో నేలకొరిగిన మొక్కజొన్న

రూ.2కోట్లకు పైగా నష్టం

బేస్తవారపేట, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం రాత్రి వీచిన గాలులకు, అకాల వర్షానికి వందల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. చెరుకుపల్లె, గంటాపురం, పి.వి.పురం, అక్కపల్లె, జెన్నివారిపల్లె, పూసలపాడు, మోక్షగుండం గ్రామాల్లో సూమారు 446 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరగటంతో సుమారు రూ.2కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు. సోమవారపేటలో 15 ఎకరాల్లో అరటి చెట్లు విరిగిపోవడంతో గెలలు కిందపడ్డాయి. వ్యవసాయ సిబ్బంది దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. త్వరలో నష్ట అంచనాలు వేస్తామన్నారు. మరో వారంలో చేతికి అందుతున్నదనుకున్న మొక్కజొన్న పంట నేలపాలు కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మొక్కజొన్న, అరటి రైతులకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.


జెన్నివారిపల్లెలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభం


కొమరోలులో గాలివానకు నేలకొరిగిన అరటి తోటలు

6న బీజేపీ ఆవిర్భావ వేడుకలు

గిద్దలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈనెల 6వ తేదీన నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆపార్టీ అసెంబ్లీ కన్వీనర్ మంచాల బ్రహ్మేశ్వర ప్రసాద్, కోకన్వీనర్ గుమ్మా రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిగ్రామాల్లో పార్టీ జెండాను ఎగురవేయాలని వివరించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టండి

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలు పెరిగిననందున తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ కిరణ్‌గౌడ్ చెప్పారు. ఎర్రగొండపాలెం మండల సర్వసభ్య సమావేశంలో శుక్రవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ పనులు కల్పించాలని సూచనలు చేశారు. అకాల వర్షానికి దెబ్బతిన్న పండ్లతోటలకు నష్టపరిహారం కోసం రైతుల జాబితా ప్రభుత్వానికి పంపించాలన్నారు.

ఎంపీడీవో, వైస్‌ఎంపీపీ వాగ్వివాదం

సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసులు, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు శేషు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. గత సమావేశంలో తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని ఉపాధ్యక్షులు అడగడంతో ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో మీరు అడిగిన ప్రశ్నలకు ఇపుడు సమాధానం ఎలా చెప్పుతారని అనడంతో ఇద్దరి వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎంపీపీ జోక్యంతో వాగ్వివాదం సద్దుమణిగింది. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు విజయబాస్కర్, హెచ్‌వో ఆదిరెడ్డి, ఏవో శేషారెడ్డి, ఏపీవో శైలజ, డాక్టరు కోటానాయక్, పంచాయతీ రాజ్ డీఈ వెంకటేశ్వరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జట్సన్‌పాల్ పాల్గొన్నారు.

ప్రేమ వివాహమే యమపాశమైంది!

ఎనిమిదినెలల క్రితం ఒకే ఊరుకు చెందిన యువతీయువకులు ప్రేమవివాహం
రాజంపేటలో కాపురం
ఇటీవల తరచూ గొడవలు
భర్తపై యాసిడ్ దాడి.. ఆ తర్వాత మృతి
స్వగ్రామం బాదినేనిపల్లిలో విషాదం


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

కొమరోలు, ఎప్రెల్4(ఆంధ్రజ్యోతి) : ప్రేమ వివాహమే ఓ కుటుంబాన్ని తీవ్రశోకానికి గురిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కొమరోలు మండలం బాదినేనిపల్లికి చెందిన వర్రా నాగార్జున(26), అదే గ్రామానికి చెందిన ఎర్రిబోయిన ప్రసన్నలు గతఏడాది ఆగస్టులో ప్రేమించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయారు. వీరు కడప జిల్లా రాజంపేటలో నివాసం ఉంటూ నాగార్జున ఒక రెస్టారెంటులో వంట మాస్టర్‌గా చేరాడు. ఆరునెలల అనంతరం ఇరువురి మధ్య అనుమానాలు పెరిగాయి. ఒకటి, రెండుసార్లు గొడవలు పడి పోలీసుల వరకు వెళ్లారు. గత నెల 23వ తేదీ రాత్రి నాగార్జున మద్యం సేవించి ఇంటికి వచ్చాక భార్య కూల్‌డ్రింక్‌లో మత్తు మందుకలిపి ఇవ్వగా వెంటనే నిద్రలోకి జారుకున్నాడు. అనంతరం భార్య తరఫున కొందరు వచ్చి నాగార్జునపై యాసిడ్ పోసి వెళ్లారు. ఒళ్లంతా మంటలు వేయడంతో నాగార్జునకు మెలకువ వచ్చి కేకలు వేస్తూ తన స్నేహితులకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే స్నేహితులు అతనిని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు, ఆ తర్వాత తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా నాగార్జున తండ్రి నాగిశెట్టి, తల్లి లక్ష్మీదేవిలు సమాచారం తెలుసుకుని తిరుపతి వెళ్లారు. జరిగిన విషయం తెలుసుకుని వారు కన్నీటి పర్యంతమయ్యారు. చికిత్స అనంతరం 10 రోజుల కిందట నాగార్జున స్వగ్రామమైన బాదినేనిపల్లికు వచ్చాడు. రెండురోజుల కిందట ఆరోగ్యం బాగా లేక కర్నూలు వైద్యశాలకు తరలించగా మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని బాదినేనిపల్లి గ్రామానికి తీసుకురాగా గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ విషయమై రాజంపేట సీఐ కులాయప్పను వివరణ కోరగా కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు.


నాగార్జున(ఫైల్)

ఉపాధి పనుల్లో అవకతవకలపై చర్యలు తప్పవు

తర్లుపాడు, ఏప్రిల్ 4 ఆంధ్రజ్యోతి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎన్‌ఆర్‌జీఎస్ పీడీ జోసఫ్ కుమార్ హెచ్చరించారు. మండలంలో 2023-24 సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీలు పూర్తయ్యాక స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 594 పనులకు రూ.6,63,42,826 కోట్లు ఖర్చు చేశారు. కలుజువ్వలపాడులో మొక్కలు నాటకుండానే బిల్లులు చేసినట్లు గుర్తించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో చేసిన పనులకు కొలతలలో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. చెన్నారెడ్డిపల్లెలో ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్‌కు సంబంధించి రూ.5,13,945 విలువైన పనులకు రికార్డులు లేనట్లు గుర్తించారు. మీర్జపేటలో వర్క్ ఐడీ లేకుండా రూ.1.80లక్షల వేతనాలు చెల్లించినట్లు తేల్చారు. కూలీల సంతకాలు లేకుండా మీర్జపేట, కలుజువ్వలపాడు, చెన్నారెడ్డిపల్లె, కేతగుడిపిలో వేతనాలు ఇచ్చినట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఎస్‌ఆర్‌పీ సీఆర్‌ఎన్ మూర్తి, విజిలెన్స్ అధికారి ప్రసాద్, ఇన్‌ఛార్జ్ ఏపీడీ సుందర్‌కుమార్, ఏపీవోలు బులెన్‌రావు, నాగార్జున, ఈసీ పెద్దన్న, పంచాయతీ రాజ్ ఏఈ మహంకాలయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌జీఎస్ పీడీ జోసఫ్ కుమార్

ట్రాక్టర్, మోటార్ సైకిల్ ఢీ.. ఇద్దరికి గాయాలు

బేస్తవారపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనపల్లె లోయలోని పిటికాయగుళ్ల సమీపంలో ట్రాక్టర్ మోటార్ సైకిల్ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పిటికాయగుళ్ల నుంచి ట్రాక్టర్ కోనపల్లె వైపు వెళుతుండగా.. ఎదురుగా మోటార్ సైకిల్‌పై బార్లకుంట గ్రామానికి చెందిన చిత్తారి తిరుమల నాయుడు, వెంగలనేని రమణలు వస్తూ ట్రాక్టర్‌కు ఢీకొట్టారు. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కంభం ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం మార్కాపురం తరలించారు.


గాయపడిన క్షత్రగాత్రులు

ప్రతి ఒక్కరికీ చదువు నేర్పిద్దాం

కొమరోలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరికీ చదువునేర్పించి నిరక్షరాస్యులు లేని సమాజానికి కృషిచేద్దామని యూనియన్ బ్యాంకు మేనేజర్ షేక్ అబ్దుల్‌ఫరూక్ చెప్పారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో లిటరసీ ఇండియా ట్రస్టు (ఎల్‌ఐటీ) సహకారంతో రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిరక్షరాస్యులకు అవసరమైన మెటీరియల్‌ను శుక్రవారం వలంటీర్లకు అందచేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బ్లెఫింగ్‌టన్, ఫాదర్ బీటీజాన్ పాల్గొన్నారు.


మెటీరియల్‌ను అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ అబ్దుల్

ప్రశ్నించటం ద్వారానే కొత్త విషయాలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 4 ఆంధ్రజ్యోతి : విద్యార్థులలో ప్రశ్నించటం ద్వారానే కొత్త విషయాలు నేర్చుకుంటారని సాయిబాలాజీ పాఠశాల ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్‌వలి చెప్పారు. స్థానిక సాయి బాలాజీ పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసుకుని ఆరో తరగతిలో ప్రవేశించబోతున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ఇన్‌చార్జి సుభాషిణి, ఉపాధ్యాయురాలు జయప్రద, మేరీ, కౌసర్, లక్ష్మీప్రియ పాల్గొన్నారు.

ఆక్రమణలో ఉన్న వక్ఫ్ భూముల పరిశీలన


దస్త్రాలు పరిశీలిస్తున్న డిప్యూటి కలెక్టర్ పార్థసారథి

పొదిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ముస్లిం వక్ఫ్‌బోర్డ్ పరిధిలో ఉన్న ఆక్రమిత స్థలాలు, పొలాలను డిప్యూటీ కలెక్టర్ పార్థసారథి శుక్రవారం పరిశీలించారు. పొదిలి-కాటూరివారిపాలెం మధ్య ఉన్న వక్ఫ్‌బోర్డ్ స్థలాలు, పొలాలు పెద్ద మొత్తంలో ఆక్రమణలకు గురయ్యాయని కమిటీ పెద్దలు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ కలెక్టర్ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దస్త్రాలను పరిశీలించి త్వరలో రెవెన్యూ, మున్సిపాలిటి, పోలీస్, వక్ఫ్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆక్రమణల్లో 322 ఎకరాల భూమి, స్థలాలు ఉన్నాయని, కొన్నిట్లో నిర్మాణాలు జరిగాయని తెలుస్తోందన్నారు. సుమారు 51 మందికి 54-1 నోటీసులు ఇచ్చామని, 15 రోజుల్లోగా సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ షాజీదా, వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్‌భాష పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కంభం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తురిమెళ్ల అటవీశాఖ డీడీ పి.టి.నిషాకుమారి చెప్పారు. ఎఫ్‌ఆర్‌వో మధుప్రియాంక ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ సర్పంచ్ వీరమ్మ చేతుల మీదుగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. సిబ్బంది రంగారెడ్డి, బాలాజీనాయక్, మాల్యాద్రి, రాజేష్, అబ్దుల్‌గఫార్, మురళి, ఇమ్రాన్, సుభాని, కళ్యాణి పాల్గొన్నారు.

సీతారామస్వామి నూతన శిలావిగ్రహ ప్రతిష్ఠ

కంభం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చిన్నకంభం గ్రామంలో శుక్రవారం సీతారామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎస్సై నరసింహారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త జలపాటి తులసిప్రసాద్, టీడీపీ యువనాయకుడు జలపాటి వెంకటేష్ పాల్గొన్నారు.


పూజల్లో ఎస్సై

కృష్ణావతారంలో స్వామి వారు

గిద్దలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బద్వేల్ రోడ్డులోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో వసంత నవరాత్రుల మహోత్సవం వైభవంగా జరుగుతోంది. అందులో భాగంగా శుక్రవారం స్వామి కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలకు పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు మోటపోతుల రాంభూపాల్‌రావు బహుమతులు అందచేశారు. ఆయా పూజా కార్యక్రమాలలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు చీతిరాల నాగార్జునరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు రాచపూటి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి శివపురం వెంకటరామయ్య, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


కృష్ణావతారంలో సీతారాముడు

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 4 ఆంధ్రజ్యోతి : మార్కాపురం పట్టణంలోని రామాంజనేయ నగర్‌లో శ్రీమత్ గణపతి సహిత, సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రుని నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితులు రంగావఝల రామశర్మ, ఓరుగంటి సీతారామశర్మ ఆధ్వర్యంలో పలు పూజలు చేశారు. అనంతరం సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, అన్నా రాంబాబు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ ఇమ్మడి కాశీనాథ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, టీడీపీ నాయకులు మల్లికార్జునరావు, కందుల రోహిత్ రెడ్డి, కొప్పుల శ్రీనివాసులు, హరి, సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ధ్వజ స్తంభ ప్రతిష్ఠలో భక్తులు


ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

ముఖాముఖి

అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు

ఎల్.కృష్ణమూర్తి, ఎంపీడీవో, దర్శి



ప్రశ్న: మండలంలో ఏమి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి ?

జవాబు: ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా 2025-26 సంవత్సరానికి ఏడు లక్షల ఇరవై వేల పనిదినాలు కల్పించాలని ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఆమేరకు అన్ని గ్రామాల్లో పనులు నిర్వహిస్తున్నాం. రోజుకు సగటు వేతనం రూ.307 ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో రూ.300 ఉండేది. వేసవిలో పశువుల తాగునీటి అవసరాల కోసం 32 నీటి తొట్టెల నిర్మిస్తున్నాం. ఒక్కో తొట్టెని రూ.33,200తో నిర్మిస్తున్నాం.

ప్ర: ప్రభుత్వ సర్వేలు ఎలా జరుగుతున్నాయి ?

జ: మండలంలో చేపట్టిన సర్వేలు 95 శాతం పూర్తయ్యాయి. పీ-4, చైల్డ్ ఆధార్, వర్క్ ఫ్రం హోం, మిస్సింగ్ సిటిజన్ సర్వేలు దాదాపు పూర్తి కావచ్చాయి. త్వరలో పూర్తిచేసి నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పిస్తాం.

ప్ర: సబ్సిడీ రుణాల పంపిణీ ప్రక్రియ ఏ దశలో ఉంది ?

జ: సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ దాదాపు పూర్తయింది. మండలంలో బీసీలకు 22 యూనిట్లు, కాపులకు పది యూనిట్లు, ఈబీసీలకు 12 యూనిట్లకు 50శాతం సబ్సిడీతో రుణాలు అందజేస్తున్నాం.

ప్ర: మహిళలకు ఏ పథకాలు అమలు చేస్తున్నారు ?

జ: మహిళల అభ్యున్నతి కోసం కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. కుట్టు మిషన్ల కోసం 78 దరఖాస్తులు వచ్చాయి. అందులో 25 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు సరఫరా చేస్తాం. ఈ పథకం ద్వారా స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు మహిళలకు ఎంతో ఉపయోగపడుతుంది.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి

పామూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మోటివేటర్ బి.సైరసకుమార్ అన్నారు. పిల్లలను పెంచడం ఎలా? అది ఒక కళ అనే అంశంపై శుక్రవారం స్థానిక సెయింట్ మార్క్స్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు ప్రవర్తిస్తారు, వారిని ఎలా పెంచాలి, సెల్ భూతం నుండి ఎలా కాపాడాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.జయకుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉల్లగల్లులో ఎన్ఎస్ఎస్ శిబిరం

ముండ్లమూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని ఉల్లగల్లు గ్రామంలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేశారు. శుక్రవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శుక్రవారం గ్రామంలోని కెనరా బ్యాంక్ రోడ్డు, సిమెంట్ రోడ్డును శుభ్రం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, డాక్టర్ పి.మోహనరావు, హెచ్ఎంలు ఎస్.ఆదాం, సుబ్బారావు, వెటర్నరీ ఆఫీసర్ కె.కోటిలింగం, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు బాల్యం ఆరోగ్యంగా సాగాలి

కనిగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బంగారు బాల్యం ఆరోగ్యంగా సాగాలని గుడ్‌హెల్ప్ సంస్థ డైరెక్టర్ రమేష్‌బాబు అన్నారు. మండలంలోని ఏరువారిపల్లి హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం బంగారు బాల్యం, మిషన్‌శక్తి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వాటర్ బెల్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దమ్ము వెంకటయ్య, హెచ్ఎం ముంతాజ్‌బేగం, మహిళా పోలీస్ వి.సుస్మిత, ఏఎన్ఎం శ్రావణి, అనూష పాల్గొన్నారు.

'చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలి'

పామూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టసవరణ బిల్లును వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జుమ్మా మసీదు వద్ద నమాజ్ అనంతరం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌస్‌బాషా, అల్లాభక్ష్, షేక్ మస్తాన్, ఇస్మాయిల్, కె.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో మోస్తరు వర్షం

ముండ్లమూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో మోస్తరు వర్షం కురిసింది. ముండ్లమూరు, పసుపుగల్లు, వేంపాడు, సింగనపాలెం, తమ్మలూరు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో పది నిమిషాలపాటు మోస్తరు వర్షం కురిసింది. గత వారం రోజుల నుంచి విపరీతమైన ఎండలు కాస్తున్నాయి. ఒక్కసారిగా ఆకాశం మేఘావృత మై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- సమస్యలపై ఏకరువు పెట్టిన ప్రజాప్రతినిధులు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశించారు. శుక్రవారం జరిగిన సీఎస్‌పురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ మూడుమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందజేయాలన్నారు. ఎంపీటీసీ బి.వెంగయ్య మాట్లాడుతూ మట్టి పోయకుండానే రోడ్డు పనులు చేసినట్లు రూ.80 లక్షలు ఎంపీపీ గ్రాంట్ నుంచి డ్రా చేసుకున్నారని ఆరోపించారు. గుంతచెన్నంపల్లిలో రెండు బోర్లను ఊడతీశారని సర్పంచ్ పేర్కొన్నారు. ఎంపీడీవోకు తెలియకుండా బోర్లు ఎందుకు తీసావు, వెంటనే బిగించకపోతే జీతం నుంచి కట్ చేస్తామని బోర్ మెకానిక్‌పై ఉగ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చెర్లోపల్లిలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలల భవనాలను తొలగించలేదని సభ్యులు పేర్కొన్నారు. బడి పిల్లల దగ్గర రాజకీయాలు తగదని ఉగ్ర సూచించారు. ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులు చేపట్టరాదని, అలాచేస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. అధికారులు చేయదగిన పనులే చేయాలన్నారు. రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహరించవద్దని హితవు పలికారు. అసంపూర్తిగా నిలిచిఉన్న అంగన్‌వాడీ భవనాలకు సంబంధించి అంచనాలు తయారుచేసి పంపించాలన్నారు. కందుల కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభించలేదని పలువురు ప్రజానిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఇంకా ఎందుకు ప్రారంభించలేదని, ధర తగ్గితే ఎవరు బాధ్యత వహిస్తారని ఏవో సంపత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేలా అధికారులతో మాట్లాడతానని చెప్పారు. కార్యాలయ సిబ్బంది రంజిత్ తీరుపై సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఉగ్ర అతనిని తీవ్రంగా మందలించారు. డీజీపేటలో ప్రభుత్వ వైద్యశాలకు స్థలం కేటాయించాలని డాక్టర్ మహేష్ కోరారు.

సమావేశంలో వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, డీటీ వెంకటేశ్వర్లు, డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, షీప్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దర్శి, కనిగిరి ఏఎంసీల

చైర్‌పర్సన్‌లుగా నాగవేణి, రమాదేవి



దారం నాగవేణిని అభినందిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): దర్శి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా దారం నాగవేణి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పదిహేను రోజుల క్రితం నియోజకవర్గంలోని కూటమి నాయకులతో చర్చించి ఆమె పేరును ప్రతిపాదించి పంపిన విషయం తెలిసిందే. సీఎం చంద్రబాబు అన్నికోణాల నుంచి పరిశీలించిన అనంతరం ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దారం నాగవేణి కుటుంబం టీడీపీ ఆవిర్భావం నుండి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలుగా పనిచేస్తున్నారు. గతంలో నాగవేణి భర్త దారం సుబ్బారావు టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా పనిచేశారు. గత నగర పంచాయతీ ఎన్నికల్లో నాగవేణి 19వ వార్డులో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ప్రస్తుతం కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు.

టీడీపీలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నందున నియోజకవర్గంలోని నాయకులు ఏకగ్రీవంగా ఆమె పేరును సూచించటంతో ఆమె ఎంపిక సులభతరమైంది. నాగవేణి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన సందర్భంగా ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగవేణి మాట్లాడుతూ తనను ఈ పదవికి ఎంపిక చేసినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, నియోజకవర్గంలోని కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల అభ్యున్నతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

కనిగిరి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా రమాదేవి



యారవ రమాదేవి

కనిగిరి/పామూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా పామూరు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు సతీమణి రమాదేవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పడమటకట్టకిందపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు గత సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే ఉగ్ర గెలుపులో మండలంలో కీలకపాత్ర వహించారు. స్వగ్రామమైన పడమటకట్టకిందపల్లి వైసీపీకి గట్టి పట్టున్న తరుణంలో తన రాజకీయ చతురతను ప్రదర్శించారు. పంచాయతీలో ఏడు వందలకుపైగా టీడీపీకి మెజార్టీ వచ్చేలా యారవ శ్రీనువాసులు కీలక భాగస్వామ్యం వహించి సఫలీకృతులయ్యారు.

తెలుగుదేశం పార్టీలో విశేష సేవలందించిన కుటుంబానికి పార్టీ గుర్తించి అధిష్ఠానం తీసుకున్న ఈ నిర్ణయంతో నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యారవ రమాదేవి ఎమ్మెస్సీ బయోకెమిస్ట్రీలో పట్టా పొందారు. ఆమె భర్త యారవ శ్రీనివాసులుది వ్యవసాయ కుటుంబం. వ్యాపార రంగంలో హైద్రాబాద్‌లో స్థిరపడినప్పటికీ స్వగ్రామం పామూరు మండలం కందులవారిపల్లి గ్రామంలోని ప్రజలు, బంధువులతో మమేకమై ఉన్నారు. పామూరు మండల కేంద్రం లోనూ నివాసం ఏర్పరుచుకుని మండలస్థాయిలో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ 20 ఏళ్ళుగా విశేష సేవలందిస్తున్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ఎంపికైన రమాదేవి ప్రముఖ పారిశ్రామిక వేత్త కోటపాటి జనార్దన్ సతీమణికి స్వయాన చెల్లెలు కావటంతో అటు వ్యాపార వర్గాల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఈసందర్భంగా రమాదేవి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తన ఎంపికకు సహకారం అందించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తమను గుర్తించి పదవిని ఇవ్వటం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తూ పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు.

కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దు!

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర హెచ్చరిక
- ప్రజాదర్బార్‌లో 101 అర్జీలు



ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న అర్జీదారు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశించారు. శుక్రవారం సీఎస్‌పురం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలపై అర్జీలను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును కుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సమస్యను పరిష్కరించడానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. వీఆర్వోలు అందుబాటులో ఉండి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ముడుపులు తీసుకోవడం మాని ప్రజలకు సేవ చేయడం నేర్చుకోవాలన్నారు. ప్రజాదర్బార్‌లో 101 దరఖాస్తులను ఎమ్మెల్యే స్వీకరించారు. వీటిలో 83 రెవెన్యూ సమస్యల మీదనే వచ్చాయని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, ఇంటి స్థలాల కోసం కూడా అర్జీలు ఇచ్చారు.

కార్యక్రమంలో డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, నాగిశెట్టి చిన్నమాలకొండయ్య, చెరుకుపల్లి వెంకటరెడ్డి, బొబ్బూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ టౌన్‌గా దర్శిని అభివృద్ధి చేస్తాం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శిలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న నారపుశెట్టి పిచ్చయ్య, పాపారావు తదితరులు

దర్శి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): దర్శి నగర పంచాయతీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దర్శి పట్టణంలోని పుచ్చలమిట్టలో రూ.1.50 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దర్శి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. గత వైసీపీ పాలకుల అసమర్థతతో నిలిచిన ప్రాజెక్టుల నిర్మాణాలను ప్రారంభించినట్టు చెప్పారు. దర్శిలో టీటీడీ కల్యాణ మండపం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అన్నా క్యాంటీన్ నిర్మాణానికి నిధులు విడుదల చేసినట్టు చెప్పారు. త్వరలో అమృత పథకం ద్వారా ఇంటింటికి కొళాయి నిర్మాణం పనులు చేపడుతున్నట్టు తెలిపారు. దర్శి పట్టణంలో సుందరీకరణలో మొక్కలు నాటుతున్నట్టు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

మంచినీటి చలివేంద్రాలు ప్రారంభం

నగర పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాలను డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రారంభించారు. దర్శి-అద్దంకి రోడ్డులో ఒక చలివేంద్రం, దర్శి- పొదిలి రోడ్డులో మరో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఇబ్బంది పడకుండా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సాగర్ జలాలను ఇప్పటికే మంచినీటి చెరువులకు నింపినట్టు చెప్పారు. దర్శి పట్టణానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం ఈ చలివేంద్రాలను ప్రారంభించామన్నారు. మరికొన్ని చలివేంద్రాలను త్వరలో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజక వర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, కౌన్సిలర్ వీసీ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, సంగా తిరుపతి రావు, నారపుశెట్టి మధు, కనకం శ్రీనివాసరావు, గుర్రం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ముండ్లమూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని పసుపుగల్లులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారుల బారినపడి నష్టపోకుండా ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తుందని చెప్పారు. కందులు క్వింటా రూ.7550 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, రైతుల పొలాల్లో నీటి కుంటలు మంజూరుచేసినట్టు చెప్పారు. అనంతరం డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులను మాజీ సర్పంచ్ ఇందూరి పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, దారం సుబ్బారావు, మాజీ జడ్పీటీసీలు వరగాని పౌలు, కొక్కెర నాగరాజు, సుంకర రాఘవరెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పొందుగుల శ్రీనివాసరెడ్డి, డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు కాటూరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వఉంచిన బాణసంచా స్వాధీనం

కనిగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన బాణసంచాను ఎస్ఐ టి.శ్రీరాం శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసి పట్టుకున్నారు. ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు పట్టణంలోని నగరికంటి బసవయ్య సెంటర్ వద్ద మహాలక్ష్మమ్మచెట్టు వీధిలోని ఫ్యాన్సీ షాపులో రూ.30 వేలు విలువ చేసే క్రాకర్స్ టపాసులను గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆసంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గంటెనపల్లి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ముండ్లమూరులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన వీఆర్ఏల సంఘం సమావేశానికి మండల అధ్యక్షుడు వరగాని ఏసు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ తెలంగాణ తరహాలో పేస్కేల్ అమలు చేయాలని, రాత్రి డ్యూటీలు వీఆర్ఏలకు వేయవద్దన్నారు. నామినీలుగా పని చేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలన్నారు. అర్హత కలిగిన వారికి వీఆర్వో, అటెండర్, వాచ్‌మన్, డ్రైవర్లు, రికార్డు అసిస్టెంట్‌లు, ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. తరతరాలుగా వెట్టిచాకిరి చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బోడపాటి హనుమంతరావు పాల్గొన్నారు.

అనంతరం వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడిగా వరగాని ఏసు, ప్రధాన కార్యదర్శి పోట్లూరి జ్యోతి, కోశాధికారిగా కుమ్మెత నాగార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడిగా షేక్ మహబూబ్ బాషా, సహాయ కార్యదర్శిగా తప్పెట కోటయ్యతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

లోకేశ్‌ను కలిసిన టీడీపీ నాయకులు

ముండ్లమూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యశాఖ మంత్రి నారా లోకేశ్‌ను శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావుతో పాటు సర్పంచ్ కూరపాటి నారాయణ స్వామి, మారెళ్ళ మాజీ ఎంపీటీసీ సుంకర రాఘవరెడ్డి, మక్కెనవారిపాలెం మాజీ ఎంపీటీసీ జంపాని శ్రీనివాసరావు కలిశారు. ఈసందర్భంగా లోకేశ్ దర్శి నియోజక వర్గంలో జరిగిన పాదయాత్ర విశేషాలను గుర్తు చేసుకున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బాగా పని చేస్తున్నారని, ఆమెకు మరింత అండగా నిలిచి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నియోజక వర్గ అభివృద్ధికి త్వరలో నిధులు విడుదల చేస్తామని లోకేశ్ తెలిపారు. ఈసందర్భంగా లోకేశ్‌ను నాయకులు సన్మానించారు.

జాతీయస్థాయి స్పోర్ట్స్ మీట్‌కు వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయి క్రీడల్లో ఎంపికైన విద్యార్థులతో కళాశాల యజమాన్యం

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో రాణించిన కదిరి బాబురావు కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికయ్యారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో మే 2 నుంచి 5వ వరకు జరిగే జాతీయస్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తరుపున ఆడేందుకు కె.యమున, మునయ్య, సుదేవు ఎంపికయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ కదిరి పార్థసారధి, డీన్ డాక్టర్ వీరన్నగౌడ్, కేవీఎస్ఎల్ ప్లస్ కళాశాల చైర్మన్ ఇరగని చలపతిరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుస్మిత, బండారు రవీంద్రబాబు, డి.మాలకొండయ్య క్రీడాకారులను అభినందించారు.

ఏపీవోలు బాధ్యతల స్వీకరణ

దొనకొండ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం దొనకొండ మండల నూతన ఏపీవోగా అంకం కల్యాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. దర్శి మండలంలో పనిచేస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దొనకొండకు బదిలీపై వచ్చారు. గత పదకొండేళ్ల దొనకొండ మండల ఏపీవోగా పనిచేస్తున్న టి.దేవయ్య కురిచేడు మండలానికి బదిలీపై వెళ్లారు. మండలంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల నిర్వహణలో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తానని నూతన ఏపీవో కల్యాణి వివరించారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు మండల ఏపీవోగా కె.వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న బి.మురళి దర్శికి బదిలీ అయ్యారు. హనుమంతునిపాడు మండలం నుంచి తాళ్లూరుకు బదిలీపై వచ్చిన వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఏపీవో మాట్లాడుతూ మండలంలోని ఉపాధి కూలీలందరికి పనులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పీసీపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 7 నుంచి అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయశంకర్ తెలిపారు. ఇందులో భాగంగా కళాశాల అధ్యాపకులు మండలంలో ఈఏడాది పది పూర్తయిన విద్యార్థులను కలిసి ఇంటర్ విద్య కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అభ్యర్థిస్తున్నారు. ఈ కళాశాలలో ఎంపీసీ, సీఈసీకి సంబంధించిన ఇంగ్లీషు మీడియం గ్రూపులు ఉన్నాయని తెలిపారు. పీసీపల్లి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుకునే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈఅవకాశాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అధ్యాపకులు కోరుతున్నారు.

ఆధార్ తిప్పలు

- కురిచేడుకు దూరంగా కేంద్రం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


కురిచేడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కురిచేడులో ఆధార్ కేంద్రం లేక మండలప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి పది కి.మీ. దూరంలోని ఆవులమందలో మాత్రమే ఈ కేంద్రం ఉంది. అవసరమైన వారు అక్కడికి వెళ్ళలేక పొరుగునే ఉన్న పల్నాడు జిల్లా వినుకొండకు వెళుతున్నారు. కురిచేడులో గతంలో ఉన్న ఆధార్ కేంద్రం తీసివేశారు. మరలా ఇక్కడ కేంద్రం ప్రారంభించాలని ఎన్ని సార్లు ప్రజలు కోరినా ఫలితం లేదు.

కురిచేడు మండలంలోని 15 పంచాయతీలకుగాను గతంలో కురిచేడు, ఆవులమంద, కల్లూరు, పడమర వీరాయపాలెం పంచాయతీలలో ఆధార్ కేంద్రాలు ఉండేవి. కాలక్రమేణ డిజిటల్ అసిస్టెంట్లు బదిలీపై వెళ్ళడంతో కురిచేడు, కల్లూరు, పడమర వీరాయపాలెం పంచాయతీలలో ఆధార్ కేంద్రాలు మూతపడ్డాయి. ఆవులమందలో మాత్రమే పనిచేస్తున్నది. ప్రస్తుతం ఆధార్ తీసుకుని పది సంవత్సరాలు దాటిన వారు అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో అప్‌డేట్ కోసం పరుగులు పెడుతున్నారు. పాఠశాలల్లో ఆపర్ ఐడీ కోసం ఆధార్‌లో మార్పులు అవసరం కావడంతో ఎక్కువ మంది విద్యార్థులు ఆధార్ కేంద్రానికి పరుగులు తీస్తున్నారు. కురిచేడులో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ఆవులమందకు వెళ్లాల్సి వస్తుంది. మండలంలోని మారుమూల గ్రామాలకు ఇది దూరంగా ఉంది. బస్ సౌకర్యం కూడా లేకపోవడంతో ఆటోలు మాట్లాడుకుని వెళ్ళడం ఖర్చుతో కూడుకున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆవులమంద గ్రామానికి వెళ్ళడం కష్టంగా ఉండటంతో ఎక్కువ మంది పక్కనే ఉన్న పల్నాడు జిల్లా వినుకొండకు వెళుతున్నారు. తమ ఇబ్బందులను గమనించి కురిచేడులో ఆధార్ కేంద్రాన్ని పునఃప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్ కార్యదర్శుల నియామకం

ముండ్లమూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.సురేష్‌రెడ్డిని భీమవరం పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. అలాగే, పూరిమెట్ల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బి.వేణును, నాయుడుపాలెం ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం ఎంపీడీవో ఆర్.జనార్దన్ ఉత్తర్వులు పంపారు. వెంటనే ఆయా పంచాయతీల్లో బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




పెదరావూరు లేఅవుట్‌లో ఆగిపోయిన ఇళ్లు



విత్తన భారం రూ. 2.91 కోట్లు

- పెరిగిన పత్తి విత్తనాల ధర
- ప్రోత్సాహం కరువు.. పడిపోతున్న సాగు
- సాగును బతికించుకోవాలంటున్న శాస్త్రవేత్తలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పత్తి సాగు నానాటికీ భారమవుతోంది.. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరవవుతోంది.. రైతుల్లోనూ ఆసక్తి తగ్గుతోంది.. ఈ పరిస్థితుల్లో పత్తి కనుమరుగవుతోందా.. అంటే పరిస్థితులు అవునంటున్నాయి. ఏటేటా దారుణంగా పడిపోతున్న పత్తి సాగుపై శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రోత్సాహకాలను అందించి అయినా పత్తి సాగును బతికించుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. గత మూడేళ్లలో లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగు తగ్గిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో పత్తి సాగుకు ప్రోత్సాహం మాట పక్కన పెడితే విత్తన ధరలు పెంచుకునేందుకు కంపెనీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఖరీఫ్‌లో పత్తి సాగుకు రైతులపై విత్తన భారం పడనున్నది.

పత్తి విత్తన ప్యాకెట్ ధరను రూ.864 నుంచి రూ.901కి పెరగనున్నది. పత్తి సాధారణ విస్తీర్ణం 3.94 లక్షలు ఎకరాలు కాగా ఎకరాకు 475 గ్రాముల రెండు ప్యాకెట్ల విత్తనాలు అవసరం. ప్యాకెట్‌కు రూ.37 చొప్పున రెండింటికి 74 ధర పెరిగింది. ఈ ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల రైతులపై దాదాపు రూ.2.91 కోట్లు భారం పడనున్నది. పత్తి సాగులో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉండగా రెండో స్థానం పల్నాడు జిల్లా ఉంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 2022లో 3,42,710 ఎకరాల్లో పత్తి సాగు కాగా గత ఖరీఫ్‌లో 2,22,613 ఎకరాల్లో మాత్రమే సాగైంది. దాదాపు 1.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు తగ్గినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఎరువులు, విత్తన ధరలు పెరుగుతున్న విధంగా పత్తి మద్దతు ధర పెరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు ఖర్చులతో పాటు కూలి భారీగా పెరిగి రైతులపై ఆర్థిక భారం పడుతోంది. ఇదే సమయంలో గులాబి రంగు పురుగు వల్ల దిగుబడులు తగ్గుతున్నాయి. పత్తికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర కూడా రైతులకు గిట్టుబాటు కావడంలేదు. దిగుబడులు పడిపోవడంతో పాటు మార్కెట్ ధరలు పతనమవుతుండటంతో పత్తి రైతులు నష్టాలను మూటకట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పత్తి సాగుకు రైతులు దూరమవుతున్నారు. పత్తికి ప్రత్యామ్నాయంగా రైతులు మొక్కజొన్న, పొగాకు పంటలను సాగు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పత్తి సాగుకు ప్రోత్సాహకాలు అందించక మరోసారి విత్తన భారం మోపడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేలుకోకుంటే సంక్షోభం..

పత్తి సాగుకు ప్రోత్సాహకాలు అందించాలని.. బీటీ 2 పత్తిపై గులాబి రంగు సోకుతున్నదని, కొత్త రకం పత్తి విత్తనాలను ఉత్పత్తి చేయాలని, ఇందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పత్తి సాగును బతికించుకోకపోతే భవిష్యత్‌లో వస్త్రాలపై ప్రభావం పడుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఏటేటా సాగు తగ్గడం వల్ల పత్తి ఆధారిత పరిశ్రమలు కూడా నష్టాల బాట పడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు పత్తి సాగును ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టాలని లేకుంటే పత్తి సాగుతో పాటు ఆ రంగం కూడా సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

కోట్లు కొట్టేసినా.. కేసులతో సరి

మంత్రి ఆదేశించినా.. చర్యలు లేవు

మా డబ్బు పోయింది.. ఇల్లూ సమకూరలేదు.. అధికారులు పట్టించుకోవడం లేదు.. అంటూ పలువురు లబ్ధిదారులు మంత్రి మనోహర్ ఎదుట మొరపెట్టుకున్నారు. ఈ దోపిడీ విషయం తెలుసుకున్న మంత్రి వెంటనే కాంట్రాక్టర్లపై చర్యలకు ఆదేశించారు. అయినా ఇంతవరకు లబ్ధిదారులకు డబ్బూ రాలేదు.. వైసీపీ ముసుగులోకి కాంట్రాక్టర్లపై చర్య లూ లేవు. ఇప్పటికీ లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

ఇంటి కల నెరవేరలేదు.. అప్పులకు వడ్డీలు కట్టుకుంటూ.. పేదలు ఇబ్బందులు పడుతున్నారు. వారి నుంచి రూ.కోట్లు కొట్టేసిన తిమింగలాలు ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పేరిట గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో లబ్ధిదారుల నుంచి రూ.వేలల్లో దోచేశారు. ఇల్లు వస్తోందనే ఆశతో పేదలు అప్పులు చేసి మరీ నగదు తెచ్చి సంబంధిత కాంట్రాక్టర్‌కు అందజేశారు. అధికారులే లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి మరీ కాంట్రాక్టర్ల ముసుగేసుకున్న వైసీపీ తిమింగలాలకు అడ్వాన్స్‌ల రూపంలో రూ.కోట్లు కట్టబెట్టారు. అయితే వారు ఇళ్ల నిర్మాణాలు చేయక పోయినా.. అప్పట్లో అధికారులు పట్టించుకోలేదు. ప్రభుత్వం మారింది ఇప్పటికైనా తమ ఇబ్బందులు తొలుగుతాయని లబ్ధిదారులు ఆశించగా అధికారులు కేసులతో సరిపెట్టారు. నెలలు గడుస్తున్నా రూ.కోట్లు కొట్టేసిన వారిపై కనీస చర్యలు లేకపోవడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం నగదు రికవరీ చేసి ఇవ్వాలని వేడుకుంటున్నా పట్టించుకునే వారే లేరు.

- నెలలు గడుస్తున్నా పోలీసుల దాగుడుమూతలు
- వైసీపీ హయాంలో అడ్వాన్స్‌ల పేరుతో నిలువు దోపిడీ
- డబ్బు పోయి.. ఇళ్ల నిర్మాణం జరగక లబ్ధిదారుల లబోదిబో
- కాంట్రాక్టర్ల ముసుగులో పేదలను దోచేసిన వైసీపీ తిమింగలాలు

తెనాలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని జగనన్న కాలనీల్లోని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు వైసీపీ ముసుగులో పలువురు నేతలు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారు. వీరికి అధికారులు సహకరించారు. దీంతో వాటాలేసుకుని మరీ లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన సొమ్ములతో పాటు ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను మింగేశారు. నిర్మాణాలకు ప్రభుత్వం అందించిన సిమెంట్, ఇనుము, ఇసుకనూ అమ్మేసుకున్నారు. ఇంటి నిర్మాణం కోసం కేంద్రం ఇస్తున్న నిధులు సరిపోకపోవడం, రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇవ్వకపోవడంతో పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. అదే సమయంలో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలపై ఒత్తిడి పెంచింది. ఈ క్రమంలో రూ.35 వేల నుంచి రూ.50 వేల చొప్పున చెల్లిస్తే ఇల్లు పటిష్ఠంగా నిర్మించి ఇప్పిస్తామని అధికారులు లబ్ధిదారులకు ఎర వేసి ఆ మేరకు నగదు వసూలు చేశారు. మరికొందరికి డ్వాక్రా కింద రుణాలు ఇప్పించి మంజూరైన మొత్తాన్ని లబ్ధిదారుల చేతికి ఇవ్వకుండా హౌసింగ్, మెప్మా అధికారులే నేరుగా కాంట్రాక్టర్లకు అప్పగించేశారు. ఇలా ఒక్క తెనాలి ప్రాంతం లోనే లబ్ధిదారుల నుంచి రూ.8.7 కోట్లు వసూలు చేశారు. ఇందులో కేవలం రూ.3.5 కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చేశారని, మిగిలిన రూ.5.2 కోట్లు జాయింట్ ఖాతాలో ఉండాల్సి ఉంటే, దానిలోనూ కొంత మొత్తం పక్కదారి పట్టిందని అప్పట్లో వార్తలు గుప్పుమన్నాయి. అయినా అధికారులు మాత్రం వాటి లెక్కలు వెల్లడించడం కానీ, దానిపై స్పందించడంకానీ లేదు. ఈ పరిస్థితుల్లో మూడు నెలల క్రితం కొందరు లబ్ధిదారులు తెనాలిలో ఐదుగురు కాంట్రాక్టర్లపై కేసులు పెట్టారు. అయినా పోలీసులు ఇప్పటికీ ఒక్కరిపై కూడా చర్య తీసుకోలేదు. తాజాగా మంత్రి జగనన్న కాలనీల్లో దోపిడీపైనా సీరియస్ అయినట్లు సమాచారం. పైగా వారు పెట్టిన కేసుల వల్ల ఫలితం ఉండదని, కాంట్రాక్టర్లను అరెస్టు చేసి కోర్టుకు పెట్టినా కేసులు నిలబడవంటూ పోలీసులే నేతలకు, లబ్ధిదారులకు చెప్పి తప్పించుకుంటున్న పరిస్థితి.

అధికారులపై అనుమానాలు..

అడ్వాన్సుల పేరుతో నగదు తీసుకున్న వైసీపీ ముసుగులోని కాంట్రాక్టర్లు కొన్ని చోట్ల తూతూ మంత్రంగా.. మరికొన్ని చోట్ల పునాదులతో ఇళ్ల నిర్మాణాలను సరిపెట్టారు. అయినా అప్పట్లో అధికారులు పట్టించు కోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో చివరకు కొందరు పోలీసులనూ ఆశ్రయించారు. వారు కేసులు పెట్టడంతో సరిపెట్టారు. వైసీపీ సర్కారు ఉన్నప్పుడు అధికారులు ఆ తిమింగలాలపై చర్యలకు భయపడ్డారంటే ఓకే. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఇంకా మీనమేషాలు లెక్కపెడుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టర్లకు డబ్బు పంచిన హౌసింగ్, మెప్మా అధికారులకూ వాటేలేమైనా అందాయా అన్నఅనుమానాలు కూడా పలువురు వ్యక్తం చేస్తున్నారు.

అప్పనంగా దోచేసిన పేదల సొమ్ము

పొన్నూరు, బాపట్ల, మంగళగిరి, తాడేపల్లి, రేపల్లె మున్సిపాలిటీల పరిధిలోనూ రూ.7.5 కోట్ల వరకు వసూలయ్యాయని, వీటిలోనూ రూ.2 కోట్ల మేర కాంట్రాక్టర్ల ముసుగులో పక్కకు వెళ్లాయని అప్పట్లో తేలింది. అధికారులు ఏ లెక్కల ప్రకారం కాంట్రాక్టర్లకు (మిగతా 8వ పేజీలో)



- లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలతోపాటు నూతన వస్త్రాలు అందజేస్తున్న మంత్రి నారా లోకేశ్


పట్టువస్త్రాలు, ఇంటి పట్టాతో వృద్ధ దంపతుల ఆనందం

పేదలకు పట్టాభిషేకం

- మన ఇల్లు-మన లోకేశ్‌తో పేదింటికి పండుగ
- రూ.వేయి కోట్ల భూములపై శాశ్వత హక్కులు
- తొలిరోజు 546 మందికి నూతన వస్త్రాలతో పట్టాల పంపిణీ
- హామీలను అమలు చేసి మంగళగిరి రుణం తీర్చుకుంటానన్న మంత్రి లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు.. ఎవరు వచ్చి ఇల్లు కూల్చేస్తారోననే ఆందోళన అవసరం లేదు. ఆక్రమించారు.. ఇక ఖాళీ చేయండి అని బెదిరిస్తారన్న భయం వీడారు. ఏళ్లుగా నివాసం ఉంటున్నా భయంభయంగా ఇంతకాలం ఉన్న వారు లోకేశ్ 'పట్టా'భిషేకంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మన ఇల్లు-మన లోకేశ్ నినాదంతో పేదలకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని మంగళగిరి డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలిరోజు 546 మందికి శాశ్వత నివేశనపట్టాలను నూతన వస్త్రాలతో కలిసి అందజేశారు. ఎర్రబాలేనికి చెందిన 248 కుటుంబాలకు, నీరుకొండలో 99 కుటుంబాలకు, మంగళగిరి రత్నాలచెరువులో 199 మందికి నివేశనపట్టాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.వేయి కోట్ల విలువైన ఆస్తులపై పేదలకు శాశ్వత హక్కును కల్పించేలా నివేశన పట్టాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 2019 ఎన్నికల్లో సమయం చాలా తక్కువ కావడంతో ప్రజలతో పూర్తిగా మమేకం కాలేకపోయానన్నారు. అందుకే నేనేంటో మంగళగిరి ప్రజలకు తెలియలేదని అందువల్లే 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయానన్నారు. ఆ ఓటమి బాధ కలిగించినా తనలో కసి పెంచిందని, కష్టపడి ప్రజల మదిని (మిగతా 8వ పేజీలో)


గొట్టిపాటి పూర్ణకుమారి మత్తి అనురాధ రాములు భాయ్ ఝాన్సీరాణి మొండితోక రాణి

నామినేటెడ్ జాతర

- మూడు జిల్లాలు.. పది మందికి పదవులు
- రెండో విడతలో మార్కెట్ కమిటీలకు చైర్మన్ల ప్రకటన


వెంకట్ యాదవ్


మురళీ కృష్ణ యాదవ్


జనార్దనరావు


వెంకట్రావు


రమేష్

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 4: నామినేటెడ్ పదవుల రెండో జాబితాను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. మార్కెట్‌యార్డు పదవులను త్వరలో భర్తీ చేస్తామని ఉగాది పర్వదినానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అన్నట్టుగానే శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 38 మార్కెట్ యార్డులకు చైర్మన్లను ప్రకటించారు. ఇందులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి పది యార్డులు ఉన్నాయి. మూడు జిల్లాలకు కలిపి పది మందిని పదవులు వరించాయి. బాపట్ల జిల్లాలో తొలి విడతలో మార్చి 28న రెండు కమిటీలకు పదవులను ప్రకటించగా శుక్రవారం ఆరు కమిటీల పదవులను భర్తీ చేసింది. దీంతో ఈ జిల్లాలో మొత్తం కమిటీలకు చైర్మన్ల నియామకం ముగిసింది. ఇక పల్నాడు జిల్లాలో తాజాగా వినుకొండ, ఈపూరు, రొంపిచర్ల మార్కెట్ యార్డులకు, గుంటూరు జిల్లా పరిధిలో దుగ్గిరాల యార్డు పదవులను భర్తీ చేశారు. ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి నామి నేటెడ్ ప్రాతిపదికన భర్తీ చేసే ఏఎంసీ చైర్మన్ల నియామకం కోసం కూటమి పార్టీల ద్వితీయశ్రేణి నేతాగణం ఎదురుచూస్తూ వస్తోంది. ఆశావహులు ఎక్కువగా ఉండడంతో కసరత్తు కోసం ఎక్కువ సమయం తీసుకోవాల్సి రావడంతో జాప్యం జరుగుతూ వచ్చింది. ఈ పరిస్థితుల్లో రిజర్వేషన్లు, సామాజిక వర్గాలు, పార్టీ విధేయత ప్రాతిపదికగా ఇప్పటికి రెండు విడతలుగా మార్కెట్ యార్డుల చైర్మన్లను ప్రభుత్వం ప్రకటించింది. యార్డు చైర్మన్ పదవులను దక్కించుకున్న నేతలకు నాయకులు, కార్యకర్తలు (మిగతా 8వ పేజీలో)

కొటేసిన కరెంట్

- విద్యుత్ మరమ్మతుల్లో అపశృతి
- విద్యుత్‌శాఖ ఉద్యోగులు ఇద్దరు మృతి
- ఆ కుటుంబాలకు అండగా ఉంటామన్న మంత్రి

కొల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పునరుద్ధరణకు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఇద్దరు ఉద్యోగులు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని ఈపూరు గ్రామంలో చోటు చేసుకుంది. విద్యుత్ ఏఈ కె.సుధాకరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున గాలులతో కూడిన వర్షానికి ఈపూరులోని ఓ డొంకలో తాటిచెట్టు విద్యుత్ తీగలపై పడింది. దీంతో ఈపూరులంక సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయి లంక గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఏఈ సిబ్బందితో తెల్లవారుజామున ఈపూరు చేరుకుని తీగలపై పడిన తాటిచెట్టును యంత్ర సహాయంతో తొలగింపజేశారు. అనంతరం ఆరుగురు సి బ్బందితో తీగలను స్తంభాలకు అమర్చుతున్నారు. ఆ సమ యంలో ఓ తీగలో విద్యుత్ ప్రసరించింది. విద్యుత్ ప్రసరణను గుర్తించిన నలుగురు అప్రమత్తమై దూకేశారు. అయితే దోనేపూడి లైన్‌మన్ పోతార్లంక లీలాదుర్గాశంకర్(40), చిలుమూరు జూనియర్ లైన్‌మన్ ఆకుల మహేష్(37) విద్యుదాఘాతానికి గురై స్తంభాలపై నుంచి కిందపడిపోయారు. ఏఈ, సిబ్బంది వారిని తొలుత కొల్లూరుకు ఆ తర్వాత తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్ప టికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాద ఘటనపై ఏఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పంచనామా, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు.


తీగలపై పడిన తాటిచెట్టు

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం..

లైన్‌మన్ శంకర్‌కు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. సచివాలయ ఉద్యోగిగా విద్యుత్ శాఖలో చేరిన మహేష్ సేవలు అందిస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నా రు. విధి నిర్వహణలో సిబ్బంది మృతి చెందడంపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి చెందారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని,వారిని అన్ని విధాలా ఆదుకుంటామని ప్రకటించారు. ఘటనపై విచారణకు మంత్రి ఆదేశించారు. ఎల్‌సీ తీసుకునే విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తే ఊపేక్షించబోమని మంత్రి స్పష్టం చేశారు. టీడీపీ నేత మైనేని మురళీ కృష్ణ ప్రమాద సమాచారాన్ని ఎమ్మెల్యే ఆనందబాబుకు ఇచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఉద్యోగులు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని సత్వరం అందిస్తామన్నారు.


లీలాదుర్గా శంకర్


మహేష్

ఇంకొల్లులో భారీ చోరీ

55 లక్షల నగదు, 13 సవర్ల బంగారం అపహరణ

ఇంకొల్లు(పర్చూరు), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇంకొల్లులో గురువారం అర్ధరాత్రి ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. 55 లక్షల నగదు, 13 సవర్ల బంగారు అభరణాలను దొంగలు అపహరించారు. కిటికీ పగల కొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు చోరీకి పాల్పడ్డారని బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వై.రమణయ్య, ఎస్‌ఐ సురేష్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాపట్ల నుంచి వచ్చి క్యూస్‌టీం వేలిముద్ర నమూనాలను సేకరించింది.


ఇంటిలో పరిశీలిస్తున్న సీఐ రమణయ్య, ఎస్‌ఐ సురేష్, సిబ్బంది



వేమవరం వద్ద గ్రానైట్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో మంత్రి రవికుమార్

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చేయూత

బల్లికురవ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు చేయూత నిస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేమవరం గ్రామంలో టీడీపీ బల్లికురవ మండల నాయకులు మలినేని గోవిందరావుకు చెందిన హరి బాలాజీ గ్రానైట్ ఫ్యాక్టరీని మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి పోయాయని, నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక రోజు రోజుకు పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తున్నాయని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కూడా పెరిగాయని తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి అనుమతులు వెంటనే ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, పోగుల శేఖర్, అమరనేని కాశీ విశ్వనాథం, గొట్టిపాటి మారుతి, శంకర్, ఆళ్ల చంద్రమౌళి, దేవినేని శివయ్య, లేమాటి హనుమంతు రావు, గొట్టిపాటి ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

నూతన వ్యూహాలతో ముందుకుసాగాలి

● కుప్పం నియోజకవర్గ ముఖ్య నేతలతో ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : నూతన వ్యూహాలతో ముందుకు సాగడం, పార్టీ భవిష్యత్తు ప్రణాళికలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం మంగళగిరిలో కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ముఖ్య కార్యకర్తల సెమినార్‌లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో నవ్యాంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. కార్యకర్తలు, నాయకుల సమన్వయ కృషి వల్ల పార్టీ విజయపథంలో ముందుకు సాగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబును అందించిన ఘనత కుప్పం నియోజకవర్గ ప్రజలదేనన్నారు. రోజుకు 20 గంటలు పనిచేసే ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కడేనని ఈసందర్భంగా ఏలూరి కొనియాడారు.



కొల్లావారిపాలెంలో ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

ఎత్తిపోతల పథకాల పరిశీలన

కొల్లావారిపాలెం(పర్చూరు), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు ఆరుతడులు అందించటమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టిసారించారు. అందులో భాగంగా విశ్రాంత ఇంజనీరింగ్ అధికారుల నేతృత్వంలో ఎత్తిపోతల పథకాలను పరిశీలించే విధంగా కార్యాచరణ రూపొందించారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కొల్లావారిపాలెం వెంకట రమణ ఎత్తిపోతల పథకాన్ని స్థానిక నాయకులు కొల్లా చంద్రం, రైతులతో కలసి పరిశీలించారు. మరమ్మతులకు కావలసిన ప్రతిపాదనలను తయారు చేసి ఎమ్మెల్యే ఏలూరికి అందజేయన్నుట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

న్యాయవాద గుమస్తాల సంఘం నూతన కార్యవర్గం

అద్దంకి, ఏప్రిల్4(ఆంధ్ర జ్యోతి): అద్దంకి కోర్టు న్యాయవాద గుమస్తాల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంకణాల ప్రియతమ్, ఉపాధ్యక్షుడిగా విప్పర్ల శ్రీనివాసరావు, సెక్రటరీగా ఉసురుపాటి అనిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. న్యాయవాది పంచాగ్నుల రమేష్ తదితరులు హాజరయ్యారు.



శ్రీనివాసరావు



అనిల్



ప్రియతమ్



కోచ్ సురేష్‌కు అవార్డును అందిస్తున్న ట్రాఫిక్ ఎస్సై పవన్‌కుమార్

స్టేట్ క్యాడెట్‌లో చీరాల వాసుల ప్రతిభ

చీరాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీ 5వ స్టేట్ క్యాడెట్ సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో చీరాలకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. తెనాలిలో 2,3 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో లియో క్రిష్ కాంస్యం, దివ్య, శాన్వి రజతపతకం, కాష్‌రెడ్డి బంగారు, వెండి , వైభవ్, రాహుల్ రజిత , భాస్కర్ బంగారు, షేక్ బాజీ బంగారు, మహేష్‌బాబు బంగారు పతకం, సుభాని రజిత పతకాలు సాధించారు. శుక్రవారం స్థానిక ట్రాఫిక్ ఎస్సై పవన్‌కుమార్ క్రీడాకారులను, కోచ్ మల్లెల సురేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

వివాదాల సుడిలో ఆటోనగర్ స్థలం

సాల్వేషన్ ఆర్మీకి చెందినదిగా రికార్డులు

ఏడేళ్ల కిత్రం ఆటోనగర్‌కు కేటాయింపు

అప్పుడే ఆ స్థలాలు తమవంటూ గిరిజనుల ఆందోళన

కోర్టులో ఆ భూముల వివాదం

గుంటూరు జిల్లా వాసులు కొనుగోలు చేసి నిర్మాణాలు

విచారణ చేస్తున్నామంటున్న రెవెన్యూ అధికారులు

చీరాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరుపాలెం వద్ద ఆటోనగర్‌కు కేటాయించిన 34 ఎకరాల భూమి పలు వివాదాలలో చిక్కుకొని ఉంది. నేటికీ ఆభూమి ప్రభుత్వ రికార్డుల్లో సాల్వేషన్ ఆర్మీకు చెందినట్లుగా ఉంది. చీరాల పట్టణంలో వేల సంఖ్యలో ఉన్న ఆటో మొబైల్ కార్మికులకు అప్పటి ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఏపీఐఐసీకి ఖాళీగా ఉన్న స్థలాన్ని అప్పగించి అభివృద్ధికి ప్రణాళిక చేశారు. అయితే ప్రారంభం రోజే పలువురు గిరిజనులు ఆభూమి తమదంటూ ఆందోళన చేశారు. కానీ అధికారులు పట్టించుకోకుండా నేలను చదును చేసి రహదారులు నిర్మించారు. అనంతరం వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆటోనగర్‌లో పూర్తి స్థాయిలో రహదారుల పనులు, విద్యుత్ స్తంభాలు వేయించారు. కానీ మిగతా పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

కోర్టును ఆశ్రయించిన గిరిజనులు

2000 సంవత్సరంలోనే స్టూవర్టుపురంకు చెందిన గిరిజనులు ఆ భూమి తమదంటూ కోర్టును ఆశ్రయించారు. సుమారు 1970లో బ్రిటీషు వారు దొంగతనాలకు పాల్పడుతున్న వారిలో సత్ప్రవర్తన కలిగించేక్రమంలో పునరావసం క్రింద స్టూవర్టుపురంలో నివేశన స్థలాలు, ఉపాధి క్రమంలో సాగు చేసుకుని జీవించమని ఆటో నగర్‌లోని 34 ఎకరాల భూమిని అప్పగించినట్లు వారు చెప్పారు. అయితే వాటి పర్యవేక్షణ సాల్వేషన్ ఆర్మీ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించడంతో రికార్డుల్లో సాల్వేషన్ ఆర్మీ భూములుగా ఉన్నట్లు చెబుతున్నారు.





గుంటూరుకు చెందిన వ్యక్తి కొనుగోలు చేసి చేపట్టిన నిర్మాణాలు (ఇన్‌సెట్లో) స్థలంలో అమర్చిన విద్యుత్ మీటరు

స్థలాల్లో ఇప్పటికే కొన్ని అమ్మకాలు

అయితే అటుఇటు కాకుండా నిలిచిపోయిన ఆటో నగర్ స్థలాల్లో కొన్ని ఇప్పటికే ఏపీఐఐసీ అమ్మకాలు చేసినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే ఇటీవల గుంటూరు, మంగళగిరికి చెందిన కొందరు వ్యక్తులు భూమి పూజ చేసుకుని, విద్యుత్ మీటర్‌లు సైతం అమర్చుకుని కట్టుబడి ప్రారంభించారు. అయితే స్టూవర్టుపురంకు చెందిన కొందరు వ్యక్తులు నిర్మాణాలను అడ్డగించారు. భూములు తమవంటూ నిలదీశారు. దీంతో వారు నిర్మాణాలు నిలిపివేశారు. ఈక్రమంలో ఇప్పటికే రెవెన్యూ అధికారులు రెండు సార్లు స్థలాలపై చర్చలు నిర్వహించారు. మరి కొద్ది రోజుల్లో దీనిపై సరైన నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

విచారణ చేస్తున్నాం

- గోపీకృష్ణ, తహసీల్దార్ చీరాల మండలం



భూమిలో ప్రస్తుతం ఏపీఐఐసీ వారు ఉన్నారు. రికార్డుల్లో సాల్వేషన్ ఆర్మీ వారు ఉన్నారు. భూమి వివాదం కోర్టులో ఉంది. దీనిపై విచారణ చేస్తున్నాం. అనంతరం నివేదిక తయారు చేసి ఉన్నతాధికారుల ద్వారా సమస్యను పరిష్కరిస్తాం

పేదలకు పట్టాభిషేకం

(5వ పేజీ తరువాయి)

గెలుచుకోవాలనుకున్నానన్నారు. ఏ సంఖ్యతో ఓడిపోయానో దానిపక్కన ఇంకో సున్నా ఉండేలా గెలవాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేసి అంతకుమించి సాధించానన్నారు. మొత్తం 26 రకాల సంక్షేమ కార్యక్రమాలతో నియోజకవర్గ ప్రజలకు గత ఐదేళ్ల నిరంతరాయంగా సేవలు అందించడంతో నన్ను గొప్పగా ఆశీర్వదించారన్నారు. రెండున్నర దశాబ్దాల కలగా మిగిలిపోయిన శాశ్వత ఇంటిపట్టాలను అందించాలని ఎన్నికల ప్రచారంలో ప్రజలు కోరారన్నారు. మూడు విడతలుగా ఇంటిపట్టాలను అందిస్తానని నాడు మాటిచ్చానని ఆ ప్రకారం మొదటి విడతగా మూడు వేల మందికిపైగా పట్టాలను పంపిణీ చేయిస్తున్నట్లు తెలిపారు. అటవీ, దేవదాయ, రైల్వే భూముల విషయంలో చిక్కుముడులున్నాయని, కొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. మంత్రివర్గ ఆమోదం తీసుకుని మరీ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. అవినీతికి తావు లేకుండా ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఓ యజ్ఞంగా చేపట్టామన్నారు. గత ఎన్నికల సందర్భంలో కుప్పం కన్నా మంగళగిరి వెనుకబడి ఉందని చంద్రబాబు హెచ్చరించగా కుప్పం కన్నా మంగళగిరిలో తనకు ఒక్క ఓటైనా ఎక్కువ వస్తుందని ఆనాడు చెప్పానన్నారు. అయితే అప్పట్లో అందరూ ఎగతాళి చేశారని, భారీ మెజారిటీతో తనను చంద్రబాబు అభినందించారని చెప్పారు.

మెజార్టీ బలంతోనే..

నాకు ఎంత ఎక్కువ మెజారిటీ ఇస్తే అంత బలమొస్తుందని ఆనాడే చెప్పానని, మంగళగిరికి వంద పడకల ఆస్పత్రి కావాలని కేబినేట్‌లో అడిగితే ఎవరూ కాదనలేకపోయారన్నారు. లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి నిధులు అడిగినా ఎవ్వరూ కాదనలేదన్నారు. భూగర్భ డ్రెయినేజి, భూగర్భ గ్యాస్, భూగర్భ పైప్‌లైన్లు చివరకు భూగర్భ కరెంట్ పనులు వచ్చే రెండు నెలల్లో ప్రారంభిస్తామని లోకేశ్ తెలిపారు. వంద పడకల ఆస్పత్రికి 13న శంకుస్థాపన చేస్తామన్నారు. మంగళగిరిలో పార్కులు, చెరువుల అభివృద్ధితోపాటు కల్యాణమండపాలు, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు, చేనేత పార్కు, చేనేత క్లస్టర్లకు సంబంధించి నేనిచ్చిన ప్రతీ హామీలను ఆచరణలో చేసి చూపిస్తానని తెలిపారు.

రూ.కోట్లు కొట్టేసినా..కేసులతో సరి

(5వ పేజీ తరువాయి)

నగదు ఇచ్చారో కూడా అంతుబట్టని విషయం. ఒక్క ఉదాహరణ చూస్తే, పేదల సొమ్ము ఎంత అప్పనంగా దోచిపెట్టారనేది అర్థమవుతుంది. తెనాలిలో పెదరావూరు, శిరిపురం లేఔట్లలో ఇళ్లు నిర్మిస్తున్న ఓ కాంట్రాక్టర్‌కు ఒకేసారి రూ.55 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించేశారు. అయితే ఆయనకు అప్పగించిన రెండింటిలో ఒక బ్లాక్ కింద లబ్ధిదారులు రూ.25 లక్షలు, రెండో బ్లాక్ కింద రూ.18 లక్షలు చెల్లించారు. కాంట్రాక్టర్‌కు లెక్కాపత్రం లేకుండా రూ.55 లక్షలు ముందస్తుగా ఇచ్చేశారు. కానీ అతను ఇళ్ల నిర్మాణమే చేయలేదు. లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన సొమ్ముతో పాటు అదనంగా ఇచ్చిన నగదును ఇంతవరకు రికవరీ చేయలేదు. ఇదే తరహాలో మరో ఐదుగురు కాంట్రాక్టర్ల పరిస్థితి ఉన్నా అధికారులు చర్యలు సున్నానే. ఈ ఒక్క పట్టణ పరిధిలోనే రూ.3.5 కోట్లు కాంట్రాక్టర్‌లకు అప్పనంగా ఇచ్చేశారు. వీరిలో కొందరు పనులు చేస్తే, మరికొందరు అసలు పత్తాలేకుండా పోయిన పరిస్థితి ఉంది.

రాక్రీట్ సంస్థ దోపిడీపై చర్యలు లేనట్టేనా

గుంటూరు నగరం, పేరేచర్ల వంటి మరికొన్ని లేఔట్లలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బంధువులకు చెందినదిగా చెప్పుకొచ్చిన రాక్రీట్ అనే సంస్థకు 5,452 ఇళ్ల నిర్మాణాన్ని వైసీపీ సర్కారు అప్పగించింది. అయితే ఇళ్ల నిర్మాణాలు చేయకపోవడంతో అప్పటి గుంటూరు కలెక్టరు హెచ్చరించడంతో పాటు డబ్బు తిరిగి చెల్లించకుంటే కటకటాల వనక్కు నెడతామని హెచ్చరించారు. అంటే పేదల ఇళ్ల పేరిట ఆ సంస్థ దోపిడీ ఏమేర ఉందనేది అర్థమవుతుంది. వైసీపీ హయాంలోనే కలెక్టర్ సీరియస్ అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక చర్యలు లేకపోవడం విస్తు కలిగిస్తుందని లబ్ధిదారులు అంటున్నారు. ఒక్కో లబ్ధిదారు నుంచి రూ.50 వేలు, రూ.60 వేలు, రూ.70 వేలు వంతున 4,321 ఇళ్లకు రూ.26.4 కోట్లను ఆ సంస్థ చేతిలోపెట్టారు. అయితే ఆ సంస్థ కేవలం 1131 ఇళ్ల మాత్రమే నిర్మించగా, మరో వెయ్యి వరకు వివిధ దశల్లో ఉన్నాయి. ఎక్కువ శాతం పునాదుల దశలోనే ఆగిపోయాయి. అయినా రూ.26.4 కోట్లలో ఎంత రికవరీ చెయ్యాలనే లెక్కలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఇదే తరహాలో చాలా మండల కేంద్రాల్లోనూ స్థానిక వైసీపీ నేతలకు కాంట్రాక్టర్ ముసుగు కప్పి అప్పట్లో జనం సొమ్ము దోచిపెట్టారు.


వచ్చే విద్యాసంవత్సరం నుంచి తల్లికి వందనం అమలు

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఏప్రిల్4(ఆంధ్ర జ్యోతి): వచ్చే విద్యాసంవత్సరం నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని, ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మందికి 15 వేల రూపాయలు చొప్పున అందిస్తామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల 8,9 తరగతులు చదువుతున్న సుమారు 225 మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేయగా, 6,7 తరగతులు చదువుతున్న 309 మందికి అసిస్ట్ సహకారంతో శుక్రవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు, చదివిన పాఠశాలకు పేరు తీసుకు రావాలని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని హైస్కూళ్లలో చదువుతున్న అందరు విద్యార్థినులకు విడతల వారీగా సైకిళ్లు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం మంత్రి విద్యార్థినులతో మాట్లాడారు. ఆయనతో కరచాలనం చేసేందుకు విద్యార్థినులు ఉత్సాహం చూపారు. మంత్రి పాఠశాల ప్రాంగణానికి వచ్చినప్పుడు విద్యార్థినులందరూ సైకిల్ బెల్స్ మోగించి కేరింతలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జడ్పీ సీఈవో చిరంజీవి, అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్ వైష్ణవి, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఎంఈవో -2 సుధాకరరావు, హెచ్‌ఎం కటకం శ్రీనివాసరావు, 11,12 వార్డుల కౌన్సిలర్‌లు రంగిశెట్టి సుభాషిణి లహరి, అత్తులూరి రమేష్ పాల్గొన్నారు.



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్



సూర్యాస్తమయం సువర్ణమయం

సూర్యాస్తమయం సమయంలో ఆకాశం ఒక్కసారిగా బంగారు వర్ణంలోకి మారింది. శుక్రవారం చీకటి పడే సమయంలో 7 గంటలకు ఆకాశం ఒక్క సారిగా సువర్ణం సంతరించుకుంది. అద్దంకి పట్టణానికి సమీపంలో గుండ్లకమ్మ నది వద్ద ఈ దృశ్యం కనువిందు చేసింది.

- ఆంధ్రజ్యోతి, అద్దంకి

నామినేటెడ్ జాతర

(5వ పేజీ తరువాయి)

అభినందనలు తెలిపారు.

వరించిన పదవులు

బాపట్ల జిల్లా పరిధిలోని వేమూరు ఏఎంసీ చైర్మన్ పదవి అమృతలూరుకు చెందిన మాజీ ఎంపీపీ గొట్టిపాటి జయవెంకటపూర్ణకుమారిని వరించింది. రేపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మత్తి అనురాధ(జనసేన)కు దక్కింది. కూచినపూడి ఏఎంసీ చైర్మన్ పదవి నిజాంపట్నం మండల టీడీపీ అధ్యక్షుడైన ఓగిబోయిన వెంకటయాదవ్(బీసీ)ను వరించింది. పర్చూరు ఏఎంసీ గుంజి వెంకట్రావు(బీసీ), చీరాల మార్కెట్ కమిటీ చైర్మన్ కౌతారపు జనార్దన్‌రావు(బీసీ), అద్దంకి నియోజకవర్గ పరిధిలోని సంతమాగులూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి తేలప్రోలు రమేష్‌లను వరించింది.

- ప్రపంచంలోనే పసుపునకు ప్రసిద్ధి చెందిన దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్నం ఝాన్సీరాణి నియమితులయ్యారు. టీడీపీలో వివిధ హోదాల్లో కొనసాగిన ఝాన్సీ సేవలను గుర్తించిన అధిష్ఠానం యార్డుచైర్మన్‌గా అవకాశం కల్పించింది.

- పల్నాడు జిల్లా పరిధిలోని రొంపిచర్ల మార్కెట్ యార్డు చైర్మన్‌గా కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన మొండితోక రాణి నియమితులయ్యారు. ఈపూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జరపల రాములుభాయ్‌ను వరించింది. వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని నూజెండ్ల మండలం తలార్లపల్లి గ్రామానికి చెందిన మీసాల మురళీకృష్ణయాదవ్‌ను వరించింది.

బాల్య వివాహాలు చట్టారీత్యా నేరం

చినగంజాం, ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహంలోని శుక్రవారం బాల్య వివాహాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే బాలికలకు వివాహం చేయాలని సర్పంచ్ సూచించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అంజయ్య, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎన్.మీనాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.విజయలక్ష్మి, సుజాత, వెంకటసుబ్బమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి పండుగకు ఏర్పాట్లు

మార్టూరు, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని రామాలయాల వద్ద భక్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.అందుకు సంబంధించి దేవాలయాల వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించడానికి కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాల పనులు చేస్తున్నారు.ముఖ్యంగా వేసవి కావడంతో స్వామి వారి కల్యాణం లో దంపతులు పీటలపై కూర్చునేందుకు అనువుగా శుక్రవారం తాటాకు పందిళ్లను ఏర్పాటుచేశారు. ఏటా దాదాపుగా 25 మంది దంపతులు స్వామి వారి కల్యాణంలో పీటలపై కూర్చోవడం రాజుగారిపాలెం లో ఆనవాయితీ గా ఉండటం విశేషం



సీతారాముల కల్యాణం కోసం వేసిన చలువ పందిరి

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శిగా వీర సుందరాచారి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం అద్దంకిలోని విజయలక్ష్మి హాల్ సమీపంలోని అడితీల వద్ద శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆళ్లగడ్డ సుందరాచారి , గౌరవ సలహాదారుడుగా గొల్లపాటి శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షుడిగా కొండమూది రమేష్, కార్యదర్శిగా గుండెమెడ వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొండపర్తి రాజశేఖర్, నాయకులు పొన్నపల్లి మల్లికార్జున, బొప్పుడి వీరప్పయ్యచారి, ఎం. వీ రాస్వామి తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

120 మందికి ఉచిత కంటి పరీక్షలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గీతామందిర్ ఆవరణంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో డాక్టర్ పూర్ణిమ బృందం 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.వారిలో 50 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరికి వినుకొండ డాక్టర్ దస్తగిరికి చెందిన వెన్నెల నేత్రాలయంలో ఉచితంగా శుక్లం ఆపరేషన్ చేస్తామని తెలిపారు. అందులో భాగంగా పది మందిని ఆపరేషన్ కోసం వైద్యశాలకు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

షద్రక్‌బాబుకు నంది పురస్కారం

పంగులూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సీకేఎస్ ఫౌండేషన్ డైరెక్టర్, పంగులూరు వృద్ధుల ఆశ్రమ నిర్వాహకులు చందవరపు షద్రక్‌బాబుకు నందిపురస్కారం లభించింది. సామాజిక సేవాకార్యక్రమాలకు గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపికయిన షద్రక్‌బాబు శుక్రవారం రాజమండ్రిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ద్వారా ఈ పురస్కారం అందుకున్నారు. షద్రక్‌బాబును పలువురు అభినందించారు.



మంత్రి కందుల దుర్గేష్ నుంచి సత్కారం అందుకుంటున్న షద్రక్‌బాబు

సాధారణ ప్రసవంతో సంపూర్ణ ఆరోగ్యం

చీరాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు సాధారణ కాన్పుకు సహకరించి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఏరియా హాస్పిటల్ గైనిక్ వైద్యులు డాక్టర్ షణ్ముఖశ్రీ, డాక్టర్ లక్ష్మి అన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి ఆధ్వర్యంలో శుక్రవారం సాధారణ కాన్పుల ద్వారా ఆరోగ్యం అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు సూచించిన సమయం వరకు కాన్పుకు వైద్యం పొందుతూ వేచి ఉండటం వలన ఆనందంగా జీవిస్తారని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, మహిళలు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే రీ సర్వే

చినగంజాం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.ప్రభాకరరావు అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రైతులకు రీ సర్వేపై జరిగిన అవగాహన గ్రామసభలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు రీ సర్వేకి సహకరించాలని అన్నారు. సర్వే చేసే రోజు రైతలకు తెలియజేస్తామని, ఆ రోజు రైతులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. ఏమైనా తప్పులు ఉంటే తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, గ్రామ రెవెన్యూ అధికారులు, వీఆర్‌వోలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు

విలువలతో కూడిన విద్యను అందించాలి

మేదరమెట్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతోకూడిన విద్యను అందించాలని యర్రబాలెం సర్పంచ్ బలుమూరి నాగరాజు అన్నారు. శుక్రవారం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో క్రమశిక్షణ, సేవా భావం నేర్పించాలన్నారు. ప్రభుత్వం నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నందున అందరూ సద్వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విద్యా ర్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రాధానోపాధ్యాయులు మన్నెం శ్రీనివాసరావు, రిటైర్డ్ హెచ్‌ఎం లక్ష్మణరావు, పాఠశాల ఉపాధ్యాయిని సిహెచ్ శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్తికాని టిడ్కో ఇళ్ల నిర్మాణం

బ్యాంక్‌ల నుంచి రుణం చెల్లించమని ఒత్తిడి
లబ్ధిదారుల లబోదిబో
మంత్రి రవికుమార్‌కు ఫిర్యాదు

అద్దంకి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి):టిడ్కో ఇళ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు... కేటాయింపు జరగలేదు... అయితే బ్యాంక్ నుంచి తీసుకున్న రుణం చెల్లించాలని ఒత్తిడి చేస్తుండటంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. అద్దంకి పట్టణంలోని సుమారు 863 మందికి శింగరకొండ సమీపంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమయ్యింది. అత్యధిక శాతం పనులు పూర్తయినప్పటికి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా గాలికి వదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నప్పటికీ ఇంకా పనులు ప్రారంభం కాలేదు. దీంతో గత ఐదారు సంవత్సరాలుగా లబ్ధిదారులు అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు.


అద్దంకి సమీపంలో ఇంకా పూర్తి కాని టిడ్కో ఇళ్లు

ఇళ్ల నిర్మాణ సమయంలో లబ్ధిదారులకు బ్యాంక్ రుణం మంజూరు చేయించారు. ఇళ్ల అద్దె చెల్లించే బదులు బ్యాంక్ రుణం నెల వారీ కిస్తీలు చెల్లిస్తే సరిపోతుందని అధికారులు చెప్పటంతో సంతోషించారు. అయితే ఇంకా టిడ్కో ఇళ్ల పూర్తి కాకపోవటం తో లబ్ధిదారులకు కేటాయింపు జరగలేదు. కానీ బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలు చెల్లించాలని వారిపై ఒత్తిడి పెరిగింది. మహిళలను అని కూడా చూడకుండా బ్యాంక్ అధికారులు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని పలువురు లబ్ధిదారులు శుక్రవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకు వచ్చారు. ఒక వైపు ఇంటి అద్దె చెల్లించుకుంటూ, టిడ్కో ఇంటి రుణం ఎలా చెల్లించాలని మంత్రి ఎదుట కొమ్మినేని అన్నపూర్ణ అనే మహిళ వాపోయింది.

రుణాల చెల్లింపు వాయిదా వేయాలి



టిడ్కో ఇంటికి బ్యాంక్ నుంచి రుణం ఇప్పించారు. ఇళ్లు పూర్తయి నివాసం ఉంటే అద్దె ఇంటిలో అద్దె చెల్లించే బదులు బ్యాంక్‌లో రుణం నెలవారీ చెల్లించుకునే వీలుంటుంది. అలా కాకుండా అద్దె ఇంటిలో ఉంటూ అద్దెతో పాటు టిడ్కో ఇంటి రుణం చెల్లించమంటే ఎక్కడ నుంచి తెచ్చి చెల్లించాలి. బ్యాంక్ అధికారులు ఫోన్ చేసి మహిళ అని కూడా చూడకుండా ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు బ్యాంక్ రుణం చెల్లింపు వాయిదా వేయాలి.

- కొమ్మినేని అన్నపూర్ణ, 4 వ వార్డు, అద్దంకి

అవీ..ఇవీ


రీ సర్వేపై నిర్వహించిన గ్రామసభలో సూచనలిస్తున్న తహసీల్దార్ సింగారావు

నేటి నుంచి గ్రామాలలో రీ సర్వే

పంగులూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని బూదవాడ, కొండమూరు గ్రామాలలో శనివారం నుంచి రీ సర్వే ప్రక్రియ ప్రారంభించనున్నట్లు మండల తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. రీ సర్వే జరుగనున్న కొండమూరు, బూదవాడ గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ నెల 5వ తేదీ నుంచి రెండు గ్రామాలలో ప్రభుత్వ భూములకు సంబంధించిన రీ సర్వే నిర్వహిస్తామన్నారు. 20వ తేదీ నుంచి పట్టాభూములకు సంబంధించిన రీ సర్వే ప్రారంభం అవుతుందని తెలిపారు. రైతుల భూ హక్కు పత్రాలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. రీ సర్వే ప్రక్రియ పూర్తి చేసేందుకు నియమించిన రెవెన్యూ అధికారుల బృందాలకు రైతులు తమ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్వేత, మండల సర్వేయర్ సురేష్, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.


విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జీఎస్ఆర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు

విద్యార్థులకు చేతిరాత పోటీలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని 1వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక కాకానిపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో జీఎస్ఆర్ హ్యాండ్ రైటింగ్ అండ్ స్పోకెన్ ఇంగ్లీష్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం చేతిరాత పోటీలు నిర్వహించారు. 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులకు తరగతుల వారీగా బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జి. రమేష్, అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, సందిరెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


వీర్ల గంగమ్మ దేవాలయాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేస్తున్న సీఐ వెంకట్రావు

వీర్లగంగమ్మ తిరునాళ్లకు ప్రత్యేక బందోబస్తు

బల్లికురవ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రసిద్ధ వీర్ల గంగమ్మ తల్లి దేవాలయ వార్షిక తిరునాళ్ల ఈ నెల 12 జరగనుంది. తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సంతమాగులూరు సర్కిల్ సీఐ వెంకట్రావు తెలిపారు. శుక్రవారం వీర్ల గంగమ్మ దేవాలయాన్ని, దేవాలయం నలు వైపులా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ ప్రభలకు ఎక్కడ అనుమతులు ఇవ్వాలి, వాహనాల పార్కింగ్ ఎక్కడ ఏర్పాటు చేయాలని అని పూర్తిగా పరిశీలన చేస్తున్నామని తెలిపారు. పోలీసు సిబ్బంది ఎంత మంది అవసరమో ఉన్నతాధికార్లకు తెలియజేస్తామని సీఐ తెలిపారు. ఈ పరిశీలనలో ఎస్ఐ జీవీ చౌదరి పాల్గొన్నారు.


మార్టూరులో పెద్ద అండర్‌పాస్ వద్ద పూర్తయిన పబ్లిక్ టాయ్‌లెట్లు

మార్టూరు సెంటర్లో పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణం

మార్టూరు, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మార్టూరు సెంటర్లో పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణం పూర్తయ్యింది.కొన్ని సంవత్సరాల నుంచి పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణం చేపట్టాలని పలుసార్లు అధికారుల దృష్టికి వివిధ సంఘాల వారు వినతి పత్రాలు రూపంలో తీసుకువెళ్లారు. కాని నిర్మాణంపై అధికారులు దృష్టిపెట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావు పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణం చేపట్టాలని గ్రామ పంచాయతీ అధికారులకు సూచనలు చేశారు. దాంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈవో తన్నీరు శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో పెద్ద అండర్‌పాస్ వద్ద పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేయించారు. పురుషులకు,మహిళలకు వేర్వేరుగా నిర్మాణం చేశారు. త్వరలో వాటిని ప్రారంభిస్తారని, శుభ్రత కోసం గ్రామ పంచాయతీ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

సంతమాగులూరు, చీరాల, పర్చూరు
ఏఎంసీ చైర్మన్ల నియామకం

బాపట్ల జిల్లా పరిధిలోని మూడు ఏఎంసీలకు టీడీపీ ప్రభుత్వం చైర్మన్లను ప్రకటించింది. సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్‌గా సంతమాగులూరు మండలం కుందుర్తికి చెందిన తేలప్రోలు రమేష్, చీరాల ఏఎంసీ చైర్మన్‌గా స్థానిక బీసీ నేత కౌతవరపు జనార్దనరావు, పర్చూరు ఏఎంసీ చైర్మన్‌గా ఇంకొల్లు మాజీ జడ్పీటీసీ సభ్యుడు గుంజి వెంకట్రావును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్‌గా రమేష్


తేలప్రోలు రమేష్

సంతమాగులూరు(అద్దంకి), ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తేలప్రోలు రమేష్‌ను నియమించారు. సంతమాగులూరు మండలం కుందుర్తికి చెందిన తేలప్రోలు రమేష్ ప్రస్తుతం టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా, క్లస్టర్ ఇన్‌చార్జిగా ఉన్నారు. గొట్టిపాటి రవికుమార్ అనుచరుడు గా కొనసాగుతున్న రమేష్ మండలంలో టీడీపీ పటిష్టతకు కృషి చేస్తున్నారు. మండలంలో ముఖ్య నాయకులలో ఒకరిగా నిలిచారు. గతంలో సంతమాగులూరు మార్కెట్ కమిటీ పరిధిలో సంతమాగులూరు, బల్లికురవ, మార్టూరు, యద్దనపూడి మండలాలు ఉండగా కార్యాలయం మాత్రం మార్టూరులో ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గాల పరిధి ప్రామాణికంగా తీసుకోవటంతో మార్టూరు, యద్దనపూడి పర్చూరు పరిధిలోకి చేరాయి. సంతమాగులూరు, బల్లికురవ మండలాలను కలిపి సంతమాగులూరు మార్కెట్ కమిటీగా ఏర్పాటు చేసి కార్యాలయాన్ని సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో తొలుత ఎస్సీ మహిళ, ఆ తరువాతబీసీ మహిళకు రిజర్వు అయ్యింది. ప్రస్తుతం జనరల్‌కు కేటాయించటంతో టీడీపీలో చురుకైన నాయకుడుగా ఉన్న తేలప్రోలు రమేష్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సిపార్సు మేరకు నియమించారు.

రైతుల సంక్షేమానికి కృషి
-తేలప్రోలు రమేష్

పూర్తి వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా బల్లికురవ, సంతమాగులూరు మండలాలలో రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని నూతనంగా సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన తేలప్రోలు రమేష్ అన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించేందుకు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో అవసరమైన విధంగా ఏర్పాటు చేయాలన్నారు. తన నియామకానికి కృషి చేసిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.



పర్చూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుంజి వెంకట్రావు

పర్చూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇంకొల్లు మండల మాజీ జడ్పీటీసీ సభ్యులు గుంజి వెంకట్రావును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఇంకొల్లు మండలం పావులూరు గ్రామానికి చెందిన గుంజి వెంకట్రావు, రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధిగా ఉన్నారు. అయితే పర్చూరు ఏఎంసీ చైర్మన్ పదవి నియామక విషయంలో తొలినుంచి కొంత ఉత్కంఠ నెలకొంది. చివరి క్షణం వరకు పదవి తమకే వస్తుందని యద్దనపూడి, మార్టూరు, పర్చూరుకు చెందిన కొందరు నాయకులు ఎంతో ఆశగా ఎదురు చూశారు. అయితే వివిధ సమీకరణాల నేపథ్యంలో ఇంకొల్లు మండల మాజీ జెడ్పీటీసీ సభ్యులు గుంజి వెంకట్రావు పేరును ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫారసు చేయటంతో పార్టీ అధిష్ఠానం ఆమోదించింది. దీనిపై పలుకోణాల్లో విచారించిన అనంతరం వెంకట్రావును చైర్మన్‌గా ప్రకటించింది.

చీరాల ఏఎంసీ చైర్మన్‌గా కౌతవరపు

● బీసీలకు పెద్ద పీట వేసిన టీడీపీ ప్రభుత్వం


కౌతవరపు జనార్దన్‌రావు

చీరాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏఎంసీ చైర్మన్‌గా టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు కౌతవరపు జనార్దన్‌రావు ఎంపికయ్యారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 10 నెలల్లోనే ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆశీస్సులతో ఆ బాధ్యతలు కౌతవరపు జనార్దనరావుకు అప్పగించింది. గతంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన జంజనం శ్రీనివాసరావు ఆ పదవిని అలంకరించగా, చాలా కాలం తరువాత ఆ పదవి జనార్దనరావుకు అందడంతో కూటమి బీసీలకు పెద్ద పీట వేసినట్లుగా విశ్లేషకులు చెబుతున్నారు. జనార్దన్‌రావు నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ముఖాముఖి

వేసవిలో ఉపాధి పనులకు శ్రీకారం



చీరాల, మార్చి 4 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : ఈ వేసవిలో ఉపాధి కార్మికులకు ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించే పనులకు సంబంధించి అధికారులు ప్రత్యేక ప్రణాళి సిద్ధం చేస్తున్నారు. వేసవి సమస్యలు తలెత్తకుండా, ఉపాధి కల్పిస్తూనే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈక్రమంలోనే పనుల వద్ద ఎండ తాకిడి లేకుండా షామియానా, తాగునీరు, ప్రథమ చికిత్సకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఏపీవో గర్నెపూడి దాసు ఆంధ్రజ్యోతితో ముఖాముఖి నిర్వహించారు.

ప్రశ్న : వేసవికు సంబంధించి చేసిన ప్రణాళిక ఏమిటి ?

జవాబు : ఏప్రిల్ మొదటి త్రైమాసికం సందర్భంగా ఎండల ప్రభావం కచ్చితంగా ఉంటుంది. ఈక్రమంలో పశువులకు నీటి తొట్టెలు, సేద్యపు నీటి కుంటలు, పంట కాలువలను పునరుద్ధరించడం, చెరువులు, కుంటలు సమగ్రంగా అభివృద్ధి పరచడం వంటి చేస్తాం. ఉపాధి కార్మికులకు దినసరి వేతనం రూ.300 కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశాం.

ప్రశ్న : నియోజకవర్గంలో ఎంత మేరకు పనులకు అంచనా వేశారు ?

జవాబు : వేటపాలెంలో ఇప్పటికే 2.22 లక్షల పనులకు అంచనా వేశాము. అందుకు సుమారు రూ.6.66 కోట్లు, చీరాల 2.30లక్షలు పనులు గుర్తించగా రూ. 7.50 కోట్లకు అంచనాలను సిద్ధం చేసి అధికారులకు పంపుతున్నాం.

ప్రశ్న : గతంతో పోలిస్తే నిర్వహణలో ఏమైనా మార్పులు జరిగాయా ?

జవాబు : గతంకంటే ఇప్పుడు కొన్ని సాంకేతిక పరమైన ఆధునీకరణ జరిగింది. మస్టర్‌లకు ఎన్ఎంఎంఎస్ యాప్‌ను అందుబాటులో ఉంచాము. కార్మికులు 6-9 గంటల మధ్యలోనే మస్టర్ వేయాలి.

ప్రశ్న : మినీ గోకులాలు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి ?

జవాబు : వేటపాలెంకు 43 మంజూరు కాగా 17 వివిధ దశల్లో ఉన్నాయి. చీరాల పరిధిలో 26 మంజూరు కాగా 7 పెండింగ్‌లో ఉన్నాయి.


చీరాల ప్రభుత్వ వైద్యశాలలో అపస్మారక స్థితిలో ఉన్న షేక్ తార

భార్యపై కత్తితో దాడి

● పోలీసుల అదుపులో భర్త

చీరాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : భార్యపై చెట్లు నరికే కత్తితో దాడికి పాల్పడ్డాడు భర్త. ఈఘటన శుక్రవారం ఈపూరుపాలెం పంచాయతీ రజకబజార్‌లో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్, తార ఇరువురు దంపతులు. వీరికి ఇద్దరు సంతానం. మస్తాన్ వడ్లు కాటాపని చేస్తుంటాడు. ఈక్రమంలో మద్యానికి బానిసగా మారిన మస్తాన్ భార్య తారను అనుమానించి గొడవ పడ్డాడు. ఇంట్లోనే ఆమెను నిర్బంధించి ఇంటిలో గడియ పెట్టి కత్తితో శరీరంపై నాలుగు చోట్ల క్రూరంగా నరికాడు. దీంతో భయాందోళన చెందిన బాధితురాలు భర్త నుంచి తప్పించుకుని బయటకు పరుగుదీసి రోడ్డుపై కుప్ప కూలింది. దీంతో స్థానికులు అక్కడికి చేరుకుని సమాచారాన్ని ఈపూరుపాలెం పోలీసులకు అందజేశారు. వెంటనే భర్తను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాధితురాలు తార ప్రస్తుతం చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతోంది.

టిప్పర్‌లు ఢీ కొని విరిగిన విద్యుత్ స్తంభాలు

నాలుగు రోజులుగా నిలిచిన సరఫరా
ఎండుతున్న పంటలు
మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకు వచ్చిన రైతులు
నష్టం వసూలుతో పాటు కేసు నమోదు చేయాలని ఆదేశం

అద్దంకి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణానికి గ్రావెల్ తరలించే టిప్పర్‌లు ఢీ కొని విద్యుత్ స్తంభాలు విరిగి పోవటంతో 4రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి పంటలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కొటికలపూడి మీదుగా విజయవాడ-బెంగళూరు హైవే నిర్మాణానికి టిప్పర్‌లు గ్రావెల్ తరలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టిప్పర్ ఢీ కొని నాలుగు రోజుల క్రితం విద్యుత్ స్తంభాలు విరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్ కూడా పడిపోయింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గతంలో కూడా ఇదే విధంగా విద్యుత్ స్తంభాలు విరిగాయని సర్పంచ్ పూనాటి విక్రమ్ ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన మంత్రి రవికుమార్ అక్కడే ఉన్న విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, సీఐ సుబ్బరాజులతో అక్కడికక్కడే రవికుమార్ మాట్లాడారు. వెంటనే సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయటంతో పాటు వాళ్ల నుంచే నష్టం వసూలు చేసి విద్యుత్‌శాఖకు జమచేయించాలన్నారు.


కొటికలపూడి పొలాల్లో విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు, పడి పోయిన ట్రాన్స్‌ఫార్మర్

మోటార్‌బైక్ ఢీ కొని మహిళ మృతి


కోటేశ్వరమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

అద్దంకి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): గేదెలను ఇంటికి తోలుకొని వెళ్తున్న మహిళను మోటార్‌బైక్ ఢీ కొనటంతో మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు అద్దంకి మండలంలోని కొటికలపూడి పంచాయతీ పరిధి వేణుగోపాలపురం కు చెందిన మోరబోయిన కోటేశ్వరమ్మ(54) శుక్రవారం సాయంత్రం చీకటి పడే సమయంలో పొలం నుంచి గేదెలను తోలుకొని పార్వతీపురం వైపు నుంచి ఇంటికి వెళ్తుండగా తాళ్లూరు మండలం రజానగరంకు చెందిన మురళీకృష్ణ మోటార్‌బైక్‌పై వెళ్తూ వెనుక నుంచి ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన కోటేశ్వరమ్మ, మోటార్ వాహనచోదకుడు మురళీకృష్ణ లను 108 వాహనం లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వచ్చారు. వైద్యులు పరీక్షించి కోటేశ్వరమ్మ మృతి చెందినట్లు తెలిపారు. కోటేశ్వరమ్మకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్సై ఖాదర్‌బాషా మృతదేహాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేశారు.

సుధాకరబాబుకు పీహెచ్‌డీ


చీరాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జాన్‌పేటకు చెందిన డాక్టర్ చెల్లి సుధాకరబాబు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. తమిళనాడులోని భారత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చికు కెమిస్ట్రీలో వినూత్న ఆవిష్కరణ నిర్వహించి సమర్పించారు. ఈక్రమంలో శుక్రవారం 45వ స్నాతకోత్సవం సందర్భంగా ఆయనకు పట్టా అందజేశారు. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అర్హులకు నివేశన స్థలాలు కేటాయించాలి

మండల పరిధిలోని అర్హులైన నిరుపేదలకు నివేశన స్థలాలు కేటాయించాలని సీపీఎం నాయకులు ఎన్. బాబురావు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పరెడ్డి, లక్ష్మి, శ్రావణి, రవణమ్మ, బుల్లియ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలి

బల్లికురవ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచేలా సిబ్బంది పనిచేయాలని ఎంపీడీవో కె. కుసుమకుమారి సూచించారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. గురువారం ఆంధ్రజ్యోతిలో మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం మందు బాబులకు అడ్డాగా ఉందని ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో స్పందించారు. ఈసందర్భంగా బల్లికురవ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతూ చెత్త రిక్షాను వెంటనే ఏర్పాటు చేయాలని, కార్యాలయాలలో ఉన్న చెత్తను వెంటనే తొలగించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం చేపడుతున్న పలు రకాల సర్వేలపై ఎంపీడీవో సమీక్ష నిర్వహించారు. ఈవోపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ల స్లాట్‌బుకింగ్ ప్రారంభం

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన స్లాట్ బుకింగ్ ప్రక్రియ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభమైంది. రిజిస్ట్రేషన్లు చేసుకునే వారు వారు కోరుకున్న సమయానికి స్లాట్ బుకింగ్ చేసుకుని దస్తావేజులను సాక్షులను, అమ్మకం, కొనుగోలుదారులను తీసుకొని వచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. తొలుత కొంతఇబ్బంది కలిగినా ఆ తరువాత రిజిస్ట్రేషన్ల జరిగిపోయాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారి చైతన్య స్లాట్ బుకింగ్ సమాయాన్ని, దస్తావేజులను పరిశీలించారు. అనంతరం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సింహాద్రి వాటికి రిజిస్ట్రేషన్లు చేశారు.

ఆరోగ్యశ్రీకి బకాయిల

జబ్బు!

- జిల్లాలో 30 ఆసుపత్రులకు రూ.150 కోట్లపైనే..
- సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి

- బిల్లుల విడుదల కోసం ఎదురుచూపులు
- 7వ తేదీ నుంచి సేవలు ఆపేస్తాం : ఆశాలు



నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యసేవ పథకం (ఆరోగ్యశ్రీ)లో అనారోగ్య పరిస్థితులు నెలకొంటున్నాయి. మూడేళ్లగా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నిధుల మంజూరులో తీవ్ర జాప్యం చేస్తోంది. ఇదిగో... వచ్చే నెలలో పూర్తిస్థాయిలో బకాయిలు మంజూరు చేస్తామంటూ చెబుతూనే ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద రాష్ట్రంలోని నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.2200 కోట్ల బకాయిలు పెట్టింది. కూటమి ప్రభుత్వం కూడా దాన్ని మరో రూ.1300 కోట్లకు చేర్చి రూ.3,500 కోట్లకు చేర్చింది. ఇక జిల్లాలో పరిస్థితికి వస్తే రూ.150 కోట్లకుపైగా బకాయిలు ఉన్నాయి. అయితే కేవలం 8 శాతం నిధులు మాత్రమే విడుదల చేస్తుండటంతో నెట్‌వర్క్ ఆసుపత్రులలోని వైద్యులు, ఉద్యోగులకు కూడా వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

పూర్తిస్థాయిలో చెల్లింపులు ఏవీ?

జిల్లాలో 30 నెట్‌వర్క్ ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటికి కొన్ని ఆసుపత్రులకు రూ. 20 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. అలాగే జీజీహెచ్‌కి కూడా బకాయిలు చెల్లించాల్సి ఉంది. మొత్తంగా జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ. 150 కోట్లకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ బకాయిలు పేరుకుపోతున్నాయంటూ నెట్‌వర్క్ ఆసుపత్రి నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదీలోపు బకాయిలు చెల్లించాలని, లేదంటే ఆరోగ్యశ్రీ సేవలు ఆపేస్తామంటూ ఏపీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్(ఆశా) హెచ్చరిస్తున్నది.

నిర్వహణ భారమై అవస్థలు

ఎన్టీఆర్ వైద్య సేవల నుంచి వచ్చే ఆదాయంతోనే ఎక్కువగా నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆధారపడుతున్నాయి. ఒక్కో ఆసుపత్రిలో 20 మందికి పైగా వైద్య నిపుణులతో పాటు 200 మందిగా పైగా సిబ్బంది పనిచేస్తున్నారు. 3254 వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అయితే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించక పోవటంతో వైద్యులు, సిబ్బందికి నెలవారి వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుంది.

బకాయిలు చెల్లించకుంటే కష్టమే



కూటమి ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించటం లేదు. ఏదో కొద్ది మొత్తంలో మొక్కుబడిగా ఇస్తున్నారేకాని పూర్తిస్థాయిలో చెల్లింపులు లేవు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే రూ.150 కోట్లకుపైగా బకాయిలు ఉన్నాయి. ఇలా అయితే వైద్యులు, సిబ్బందికి జీతాలు ఎలా ఇవ్వాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 7న సమ్మెకు వెళ్తాం.

- డాక్టర్ నారాయణరావు, ఆశాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు



బుచ్చిలో జలమయమైన చెన్నూరు రోడ్డు

'ఫ్రై'డేలో కూల్!

- జిల్లావ్యాప్తంగా అక్కడక్కడా వర్షం
- చల్లబడిన వాతావరణం

నెల్లూరు (హరనాథపురం)/ అనంతసాగరం/ వెంకటాచలం/ బుచ్చిరెడ్డిపాళెం/ఆత్మకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎండవేడిమితో అల్లాడుతున్న జిల్లాప్రజానీకాన్ని శుక్రవారం కురిసిన అకాలవర్షం సేదతీర్చింది. జిల్లావ్యాప్తంగా అక్కడక్కడా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి, చల్లనిగాలులు వీచాయి. నెల్లూరు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం అర్ధగంటపాటు వర్షం కురిసింది. ముత్తుకూరురోడ్డు, హరనాథపురం, మినీబైపాస్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీళ్లు నిలిచాయి. కాగా, డిసెంబరు 23వ తారీఖున చివరిసారిగా జిల్లాలో వర్షం కురిసింది. తర్వాత నుంచి ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడు వాన కురవడంతో ప్రజానీకానికి ఉపశమనం కలిగినట్టు అయ్యింది. అనంతసాగరంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్న క్రమంలో వర్షం కురవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. కొందరు పట్టలతో కుప్పగా పోసుకున్న ధాన్యాన్ని భద్రపరుచుకుంటున్నారు. మండలకేంద్రమైన వెంకటాచలంతోపాటు కసుమూరు, పాలిచెర్లపాడు, కురిచెర్లపాడు, ఇస్లాంపేట, చవటపాళెం, కందలపాడు తదితర గ్రామాల్లో వర్షపు జల్లులు కురిశాయి. బుచ్చిరెడ్డిపాళెంలో మధ్యాహ్నం గంటపాటు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆత్మకూరులో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతో అవస్థలు పడిన ప్రజలకు ఆ తర్వాత ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో ఉపశమనం కలిగింది.



కలుగోళ్ల శాంభవి ఆలయంలో గోడ మీద అంటించిన నోటీస్ వద్ద దేవదాయ శాఖ ఈవోలు

కావలిలో ఆ మూడు ఆలయాలు

దేవదాయ శాఖ పరిధిలోకి..

కావలి, (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని ప్రధానమైన కలుగోళ్లశాంభవి, విష్ణాలయం, పాతూరు శివాలయాలను దేవదాయశాఖ స్వాధీన పరుచుకున్నట్లు బిట్రగంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ఈవో రాధాకృష్ణ తెలిపారు. కోవూరు ఈవో కృష్ణప్రసాద్, విడవలూరు ఈవో యానాదయ్య, అల్లూరు ఈవో చిట్టిబాబులతో కలిసి రాధాకృష్ణ శుక్రవారం ఈ మూడు ఆలయాలను కావలి ఒకటోపట్టణ ఎస్ఐ జలీల్ సహకారంతో తనిఖీలు చేశారు. ఆలయ ధర్మకర్త అందుబాటులో లేకపోవటంతో పూజారులతో మాట్లాడారు. దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ఆలయాలను ఎండోమెంట్ పరిధిలోకి తీసుకుంటున్నట్లు వారికి తెలిపారు. ఈ మేరకు ఆయా ఆలయాల గోడల మీద నోటీస్ బోర్డును అంతికించారు. అలాగే హుండీలకు సీలు వేశారు. ఈ ఆలయాలకు ఇన్‌చార్జిగా బిట్రగుంట ఈవోకు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఎంతోకాలంగా ఆ ఆలయాలను దేవదాయశాఖ స్వాధీనం చేసుకోవాలని కొందరు భక్తులు చేస్తుండిన పోరాటం ఫలించింది.



సీఎం ప్రారంభించి 50 రోజులు పూర్తయినా కందుకూరులో కార్యకలాపాలు ప్రారంభించుకోని ఎంఆర్ఎఫ్ సెంటర్

చెత్త సమస్య..

మళ్లీ మొదటికి!

- సీఎంతో ప్రారంభం.. ఇప్పుడు చేతులెత్తేశారు!
- కందుకూరులో ఎంఆర్ఎఫ్ సెంటర్ వెనక్కు
- ఇక్కడి చెత్తను గుంటూరుకు తరలిస్తారట
- ఇది సాధ్యమయ్యే పనేనా!?
- డంపింగ్‌యార్డు స్థలంలో సుందరపార్కు కలేనా!?

కందుకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) :స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ అధికారుల అనాలోచితం, అత్యుత్సాహం ఇప్పుడు సమస్యగా మారింది. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా కందుకూరులో ప్రారంభించిన మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) సెంటర్ మూణ్నాళ్ల ముచ్చటే అయింది. ఎంతో ఆర్భాటంగా కందుకూరులో ఈ సెంటర్ కోసం కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి ఆగమేఘాలమీద పనులు పూర్తిచేసి ఫిబ్రవరి 15న సీఎంతో ప్రారంభింపజేశారు. మార్చి 1 నుంచి కందుకూరులో డంపింగ్‌యార్డుకు ఒక్క పీచు చెత్త కూడా పోదని మొత్తం చెత్తను ఎంఆర్ఎఫ్ సెంటర్‌కు తెచ్చి ప్రాసెస్ చేయనున్నట్లు ప్రకటించారు. ఇక స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ అయితే, కందుకూరులో అనకొండలా పెరిగిపోయిన చెత్తను పరిశీలించి మూడునెలల్లోగా చెత్త మొత్తాన్ని ప్రాసెస్‌చేసి ఈ ప్రాంతాన్ని సుందరపార్కుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించేశారు. అయితే, కందుకూరులో ఎంఆర్ఎఫ్ సెంటర్ అర్ధశతదినోత్సవం పూర్తి చేసుకుందే కానీ తన కార్యకలాపాలు మాత్రం ప్రారంభించలేదు. ఇందుకుగల కారణాలను ఆరా తీయగా కందుకూరులో ఎంఆర్ఎఫ్ సెంటర్ వర్కవుట్ కాదన్న అంచనాతో ఆ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు కందుకూరులోని చెత్తను ప్రతిరోజు గుంటూరులో తాము ఏర్పాటుచేయబోయే అత్యాధునిక ఎంఆర్ఎఫ్ సెంటర్‌కు తరలించి ఇక్కడ ప్రాసెస్ చేసేలా అనుమతించాలని మున్సిపల్ పరిపాలనా శాఖకు ప్రతిపాదించగా అధికారులు ఓకే చెప్పేశారు. 30 టన్నుల చెత్తను ప్రతిరోజు రవాణా చేయగలిగే కంప్రెస్డ్ ట్రక్కును కందుకూరుకు మంజూరు చేస్తామని, ప్రతిరోజు కందుకూరులోని చెత్తను గుంటూరుకు తరలిస్తారని స్థానిక ప్రజాప్రతినిధికి చెప్పగా ఆయన ఓకే చెప్పినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావే స్వయంగా విలేకరుల సమావేశంలో ప్రకటించారు కూడా. అయితే ఏ పట్టణంలో చెత్తను ఆ పట్టణంలోనే ప్రాసెస్ చేయలేక డంపింగ్‌యార్డులు నిండిపోయి దర్శనమిస్తున్న తరుణంలో కందుకూరులోని చెత్తను గుంటూరు తీసుకెళ్తారా!? అందునా ప్రతిరోజు చెత్తను తీసుకెళ్లటం సాధ్యమయ్యేనా అన్న సందేహాలు మున్సిపల్ పారిశుధ్య అధికారులే వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా సాధ్యమయ్యే పనికాదని కేవలం రీసైక్లింగ్‌కు ఉపయోగపడే విలువకలిగిన మెటీరియల్‌ను మాత్రమే ఎంఆర్ఎఫ్ సెంటర్‌కు తీసుకెళ్తారని మిగిలిన చెత్తను ఇక్కడే వదిలేస్తారని వారు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే కందుకూరులో డంపింగ్‌యార్డు సమస్య మళ్లీ మొదటికొచ్చినట్లే. డంపింగ్‌యార్డు ప్రాంతం పార్కుగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్న పట్టణ ప్రజలకు తీవ్ర నిరాశే అవుతుంది.

స్పష్టమైన మార్గదర్శకాలు రాలేదు

మార్చి 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన ఎంఆర్ఎఫ్ సెంటర్ నిర్వాహకులు ఇప్పటికీ ప్రారంభించని మాట వాస్తవం. వారు వస్తారనే మేమూ ఎదురుచూస్తున్నాం. అయితే ఈ సెంటర్‌ను ఇక్కడి నుంచి తీసుకెళ్లనున్నట్లు కానీ కంప్రెస్డ్ వాహనంలో కందుకూరులోని చెత్తను గుంటూరుకు తరలిస్తారని కానీ మాకు అధికారికంగా సమాచారం రాలేదు. ఒకవేళ అలా తరలించాలని నిర్ణయిస్తే కందుకూరులో ప్రతిరోజు 25 టన్నుల చెత్త మాత్రమే వస్తున్నందున మొత్తం చెత్తను తీసుకెళ్తారని భావిస్తున్నాం.

- అనూష, మున్సిపల్ కమిషనర్

దోపిడీ సొమ్మును

కక్కిస్తాం!

- అంతేకాదు.. భోక్తలపై క్రిమినల్ కేసులూ పెడతాం
- వచ్చే మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- వైసీపీ పాలనలో దోపిడీకి గురైన 'హౌసింగ్'
- అధికారుల సమీక్షలో మంత్రి పార్థసారథి



పొదలకూరు : చిట్టేపల్లి తిప్ప వద్ద నాసిరకంగా ఉన్న పునాదులను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, పక్కన ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : 'గత వైసీపీ పాలనలో పేదల ఇళ్లపేరుతో దిగమింగిన వారిందరితో ప్రజాసొమ్మును కక్కిస్తాం. అంతేకాదు.. భోక్తలపై క్రిమినల్ కేసులూ నమోదుచేస్తాం' అని రాష్ట్ర రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయన ముందుగా టీపీగూడూరు మండలం వరిగొండలోని గిరిజన గృహాలను, పొదలకూరు మండలం చిట్టేపల్లి తిప్ప వద్ద జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి గృహ నిర్మాణ శాఖ అధికారులతో మంత్రి పార్థసారధి సమీక్షించారు. వైసీపీ నాయకులు, కాంట్రాక్టర్లు కొన్నిచోట్ల ఇళ్లు నిర్మించకనే బిల్లులు తీసేసుకుని తినేశారని మండిపడ్డారు. అమాయకులైన ఎస్సీ, ఎస్టీలను వైసీపీ నాయకులు, కాంట్రాక్టర్లు మోసం చేసి వారి చేత వేలిముద్రలు, సంతకాలు పెట్టించుకుని కనీసం బేస్‌మట్టాలు కూడా వేయకుండానే బిల్లులు వసూలు చేసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు అప్పగించి కోట్లాది రూపాయల నిధులను కొల్లగొట్టారని, వారందరిపై క్రిమినల్ కేసులు పెట్టి దోపిడీ సొమ్మును రికవరీ చేసి లబ్ధిదారులకు అందించాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలకు ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోకపోవడంతో దీనిపై ఆలోచన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.3,500 కోట్ల అదనపు భారాన్ని భరిస్తూ ఎస్టీలకు రూ.75 వేల నుంచి రూ.లక్ష, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు అదనంగా ఇస్తున్నారని, దీంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునే అవకాశం కలిగిందన్నారు. జిల్లాలో ఆగిపోయిన గృహాలన్నీ వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లను థర్డ్‌పార్టీతో పరిశీలించి అవి నివాసానికి అనువుగా ఉంటే కొనసాగించాలని, లేనిపక్షంలో వాటిని కూల్చి పాత కాంట్రాక్టర్లు దిగమింగిన సొమ్మును వసూలు చేసి నూతన నిర్మాణాలను చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేస్తున్న గృహాల్లో ఎక్కువగా నెల్లూరు జిల్లాకు కేటాయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. జిల్లాలోని అన్నీ కాలనీల లేఅవుట్లకు జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరు, విద్యుత్ సౌకర్యాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, పక్కన మరో మంత్రి ఆనం, హౌసింగ్ ఎండీ రాజబాబు, కలెక్టర్ ఆనంద్

పెంచిన సొమ్ము వివరాలు తెలపడం లేదు : ఎమ్మెల్యేలు


పేదల ఇళ్ల నిర్మాణాలకు సీఎం చంద్రబాబు పెంచిన అదనపు సొమ్ము వివరాలను తమకు తెలియకనే నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు అధికారులు మంజూరు చేస్తున్నారని కోవూరు, ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలు మంత్రి పార్థసారథి దృష్టికి తెచ్చారు. దీంతో అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేస్తూ అదనపు సొమ్మును చెక్కు రూపంలో స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి అందించాలని ఆదేశించారు.

లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకోవాలి : ఆనం

దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ హౌసింగ్‌లో అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిగిందని, ఇప్పుడు చర్యలు చేపట్టాల్సి వస్తే 75 శాతం మంది అధికారులు, ఉద్యోగులపై వేటు పడుతుందన్నారు. ఇంతమందిపై వేటువేయడం ఇబ్బందికరమని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకొంటుందన్నారు. కాంట్రాక్టర్లు కాకుండా లబ్ధిదారుల ద్వారానే ఇళ్లు నిర్మించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకాధికారిని నియమించి ఎమ్మెల్యేలతో కలిసి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ కాలనీ లేఅవుట్ల స్థలాల పేరుతో ఒక తట్ట మట్టి తీయకుండానే గత ప్రభుత్వంలో భారీ దోపిడీ చేశారని ఆరోపించారు. బాధ్యులైన కాంట్రాక్టర్లందరిపై కఠిన చర్యలు తీసుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ కావలిలో ఐదు గ్రామాలను నుడా పరిధిలోకి చేర్చి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు సొమ్మును అందించాలని కోరారు. ఈ సమీక్షలో కలెక్టర్ ఆనంద్, హౌసింగ్ ఎండీ పి.రాజబాబు, పీడీ వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, జడ్పీ సీఈవో విద్యారమ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కాకాణి' ముందస్తు బెయిల్ పిటిషన్‌పై

విచారణ 7కి వాయిదా



అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ వ్యవహారంలో వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌లో శుక్రవారం హైకోర్టులో వాదనలు కొనసాగాయి. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాది ఓ. మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నేర ఘటనలో పాల్గొన్నట్లు పిటిషనర్ పై నిర్దిష్ట ఆరోపణలు లేవన్నారు. సాక్ష్యుల వాంగ్మూలం ఆధారంగా పిటిషనర్ పై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేశారన్నారు. వాంగ్మూలాన్ని పరిశీలిస్తే పిటిషనర్ ఉద్దేశపూర్వకంగా ఎస్సీ, ఎస్టీలను అవమానించినట్లు, వారి ఆస్తులకు నష్టం చేసినట్లు ఎక్కడా చెప్పలేదన్నారు. ఈనేపథ్యంలో కాకాణిపై ఎస్సీ ఎస్టీ చట్టంలోని సెక్షన్లు నమోదు చెల్లుబాటు కాదన్నారు. రాజకీయ కారణాలతో కేసు నమోదు చేశారన్నారు. ఎస్సీఎస్టీ సెక్షన్లు వర్తించవని ప్రాథమికంగా నిర్ధారణకు వస్తే ముందస్తు బెయిల్ మంజూరు చేసే అధికారం హైకోర్టుకు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. అందుకు సంబంధించిన వివరాలను కోర్టు ముందు ఉంచారు. శుక్రవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు వాదనలు ముగియడంతో పోలీసుల తరపున ఏజీ వాదనల కోసం విచారణను ఏప్రిల్ 7కి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పొదలకూరు మండలం వరదాపురంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజాన్ని తవ్వి తరలించారని జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఏడాది ఫిబ్రవరి 16న పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీనేత కాకాణి గోవర్ధన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఇదే కేసును కొట్టివేయాలని కోరుతూ కాకాణి వేసిన క్వాష్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ రెండు వ్యాజ్యాలు శుక్రవారం మరోసారి హైకోర్టులో విచారణకు వచ్చాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	113
స్కిన్ చికెన్	202
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 430



వాహనానికి పెట్రోల్ పడుతున్న ఎమ్మెల్యే సురేష్

ఖాతాదారులకు సౌకర్యాలు కల్పించండి : ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకు యజమానులు ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించడంతోపాటు బంకుల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. కలిగిరి-కొండాపురం రహదారిలో నూతనంగా ఏర్పాటైన పెట్రోల్ బంకును శుక్రవారం కాకర్ల దంపతులు ప్రారంభించారు. కొన్ని వాహనాలకు ఎమ్మెల్యే పెట్రోల్ పట్టారు. కార్యక్రమంలో నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, చీమల తాతయ్య, బాసం నరసింహులునాయుడు, దామా మహేశ్వరరావు, కట్టా వెంకటేశ్వర్లు, కర్నాటి ప్రభాకర్, గన్నమనేని శ్రీనివాసులు, మాదాల శ్రీనివాస్, లెక్కల రాంబాబు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మంచినీటి పథకం నీరు నిలుపుదల

లింగసముద్రం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సుమారు 48 గ్రామాల ప్రజలకు తాగునీటిని అందించే రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నుంచి అధికారులు రెండు రోజుల పాటు నీటిని నిలిపివేశారు. ఈ పథకానికి చెందిన పెంట్రాల, జంగంరెడ్డిపాలెం, బంగారక్కపాలెంలలోని సంపులను సిబ్బంది కడిగి శుభ్రం చేస్తున్నారు. శనివారం ఉదయం ఈ పథకం నుంచి నీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

కావలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఒంగోలు బస్టాండ్ ప్రాంతంలో వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. కావలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నాగరాజు. మండల వ్యవసాయాధికారి లలితలు చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల అధ్యక్షుడు బచ్చు ఏడుకొండలరావు, ఉపాధ్యక్షులు నేరెళ్ల జ్వాలాసుబ్బారావు, సభ్యులు పేరూరు శివప్రసాద్, నాగమోహన్‌రావు, వెల్లంపల్లి మోహన్‌రావు సురే క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో...

అల్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణదారుల ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాదాచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో దుకాణ వ్యాపారులు అంబటి రాజేంద్ర, పాపారావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

కావలిటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవాసంస్థ సభ్యులు కార్యాలయంలో శుక్రవారం వృద్ధులకు చీరలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేబి విశ్రాంత అధ్యాపకురాలు జార్జినా అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుటుంబసభ్యులు కె.సోమరాజు జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

బాలికలకు దుస్తులు..

కావలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు మిండి శ్రీనివాస్, రమాదేవిల కూతురు జ్యోతిర్మయ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం తల్లిదండ్రులు లేని 20 మంది బాలికలకు దుస్తులు పంపిణీ చేశారు. అలాగే శ్రీనివాస సౌజన్యంతో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళకలు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాధవి మాట్లాడారు. శిక్షణపొందిన మహిళలతో బాలికలకు దుస్తులు కుట్టించి ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీవీపీ అంజనీ కుమారి, నాగరాజు సింగ్, శారద తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

● వ్యవసాయ అధికారి లలిత

కావలి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని మండల వ్యవసాయశాఖ అధికారి లలిత శుక్రవారం తెలిపారు. ఈ విషయంపై స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. మండలంలోని ప్రతిరైతు తప్పనిసరిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధికి విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే పంటలకు నష్ట పరిహారం, రాయితీపై ఎరువులు విత్తనాలు, రైతుభరోసా వంటి అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఈ విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను గత నెలలో ప్రారంభించి 50శాతం లక్ష్యాలకు చేరుకున్నట్లు తెలిపారు. ప్రతి రైతుకు అవగాహన కల్పించి త్వరలో 100 శాతం లక్ష్యాలకు చేరుకుంటామని చెప్పారు.

రీ సర్వేపై అవగాహన అవసరం

బిట్రగుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ రీ సర్వేపై రైతులకు అవగాహన అవసరం అని మండల తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. బోగోలు మండలం అల్లిమడుగు, బిట్రగుంట రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వేపై నిర్వహించిన గ్రామసభలు ఏర్పాటు చేసి అనంతరం స్థానిక రైతులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శ్రీరామ్ గోపాల్, మండల సర్వేరు వెంకటేశ్వర్లు, ఆర్ఐ రామకుమారి, వీఆర్వోలు, విలేజ్ సర్వేర్లు, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నేతలు వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, పద్మారెడ్డి, వెంకారెడ్డి సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

సబ్ కలెక్టరు శ్రీపూజ



కందుకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టాలని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని అమలనాథునిపాలెం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఉన్నత చదువులు చదివి సమాజ హితానికి దోహదపడాలని ఉద్బోధించారు. ఈ సందర్భంగా 20 మంది విద్యార్థులకు ఆధార్ లేదని తెలుసుకున్న ఆమె తక్షణం తగుచర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కే అనూషకు సూచించారు. పాఠశాల తరగతి గదులను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కె సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా కార్ల పార్కింగ్

వాహన రాకపోకలకు ఇబ్బంది

కావలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కో ఆపరేటీవ్ కాలనీ మెయిన్ రోడ్డుకి ఇరువైపుల ఏర్పాటు వాహనాల పార్కింగ్‌తో స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులన్నీ క్రిష్టియన్‌పేటలో ఉన్నాయి. అలాగే కో ఆపరేటీవ్ కాలనీలో మూడు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆ రోడ్డు వెంబడి రొయ్యలమేత దుకాణాలు వెలిశాయి. ఈ రోడ్డు నిత్యం రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అలాంటి రద్దీ రోడ్డులో ట్రంకురోడ్డు నుంచి క్రిష్టియన్‌పేట మొదటి లైను వరకు రోడ్డుకి ఇరువైపులా ట్యాక్సీలు నడుపుకునేవారు వాహనాలను పార్కింగ్ చేయడం తగదు. దీనికి రోడ్డు వెంబడి ఉన్న దుకాణదారులు తమ నాలుగు చక్రాల వాహనాలను రోడ్డు మీద పార్కింగ్ చేస్తారు. కళాశాలు వదిలిన సమయంలో ఆ రోడ్డుపై ఎదురెదురుగా వాహనాలు వస్తే గంటల తరబడి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే రోగులు ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఆ రోడ్డులో వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కోఆపరేటీవ్ కాలనీ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా నిలిపిన కార్లు

తగ్గిన ధరలతో దిగాలు

● ధాన్యం కొనుగోళ్లు లేక రైతులు లబోదిబో
● అన్నదాతను ఆదుకోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
● అల్లాడుతున్న మెట్ట ప్రాంతవాసులు

అసలే మెట్టప్రాంతం. అంతంతమాత్రంగా పండిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు పడుతున్న వేదన వర్ణనాతీతం. మార్చి నెలాఖరులో ప్రైవేటు మిల్లర్లు ధాన్యం కొనుగోళ్లను నిలుపుదల చేశారు.అంతకుముందు 15 రోజుల నుంచి ధరలు పూర్తిగా తగ్గిపోయాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుందామంటే అక్కడ పూర్తిస్థాయిలో కొనుగోళ్లు జరగడంలేదు. దిగుబడి ధాన్యం ఎవరికి, ఎక్కడ అమ్ముకోవాలో తెలియక మెట్టరైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొండాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొండాపురం మండల పరిధిలోని సాయిపేట, భీమవరప్పాడు, కొమ్మి, సత్యవోలు, గానుగపెంట, శెట్టిపాలెం, గుడవ ళ్లూరు, నేకునాంపేట, రేణమాల, మర్రిగుంట, వెళిగండ్ల, తూర్పు ఎర్రబల్లి, గొట్టిగుండాల తదితర గ్రామాల్లో ఈ ఏడాది భారీగానే వరి సాగు చేశారని వ్యవసాయాధికారులు తెలిపారు. ఫిబ్రవరి నుంచి కోతలు మొదలవగా, మొదట్లో మిల్లర్లు 75 కేజీల బస్తాను రూ.1,700 పైగానే కొనుగోలు చేశారు. దీంతో రైతులు మిల్లర్లకే ధాన్యాన్ని అమ్ముకున్నారు. మార్చి నెల సగం వరకు ఈవ్యవహారం సజావుగా సాగింది. ఇటీవలే కొనుగోళ్లు మందగించాయి. ధరలు పూర్తిగా పడిపోయాయి. ఆర్ఎన్ఆర్(షుగర్‌లెస్) రకం ధాన్యం 75 కేజీల బస్తా రూ.1550 నుంచి రూ.1,600 వరకు, కేఎన్ఎం రకం ధాన్యం 75 కేజీల బస్తా రూ.1,550కు కొనుగోలు చేస్తున్నారు. అదీ కూడా రైతులు దళారులను బతిమలాడి అమ్ముకోవాల్సిన దుస్థితి. దీంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు.

● **అరకొరగా సేకరణ**

మండలంలోని సాయిపేట, కొమ్మి, గరిమెనపెంట గ్రామాల్లో వ్యవసాయాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మూడు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 400 మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సూచించిన నాణ్యతా, ప్రమాణాల ప్రకారం ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలంటే పట్టలు, కూలీలు దొరక్కపోవడంతోపాటు ఆరబెట్టుకునేందుకు స్థలం కూడా లేదని రైతులు అంటున్నారు. దీనికితోడు ఆరబెట్టిన ధాన్యాన్ని 40 కేజీల బస్తాల్లో కూలీలతో కాటా వేయించాల్సి ఉంది.షెడ్యూల్ నిర్ణయించిన తరువాత బస్తాలను ప్రభుత్వమే రైతులకు ఇవ్వాల్సి ఉన్నా, ఆశించిన స్థాయిలో గోతాలు ఆయా కేంద్రాల వద్ద లేవు. దీంతో రైతే బస్తాలను కొనుగోలు చేసి కాటా వేయించాల్సి వస్తుంది. బస్తాలను కొనుగోలు చేసిన నగదు ప్రభుత్వం ఇస్తున్నా, మార్కెట్ రేటును చెల్లించలేదని రైతులు అంటున్నారు. ఈవ్యవహారం ఇబ్బందిగా ఉండటంతో అన్నదాతలు దళారులకు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



పొలాల్లోనే ధాన్యం ఆరబెట్టుకుంటున్నరైతులు



లారీకి ధాన్యం లోడు చేస్తున్న కూలీలు

ప్రభుత్వమే ఆదుకోవాలి



తనకున్న పొలంతోపాటు మరి కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని 8 ఎకరాల వరకు సాగుచేశా. గిట్టుబాటు ధర దక్కడంలేదు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో అరకొరగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వమే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

- ఎం. ప్రసాదు, రైతు, సాయిపేట

రైల్వే అండర్‌పాస్ నిర్మాణంపై కదిలిన అధికార యంత్రాంగం

● సుబ్బరాయుడిసత్రం గ్రామస్థులతో చర్చలు

ఉలవపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థుల నిరసనలతో నిలిచిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు పెట్టాలనే ఉద్దేశ్యంతో శుక్రవారం అధికార యంత్రాంగం సుబ్బరాయుడుసత్రం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ సీతారామయ్య, రైల్వే అధికారులు అండర్‌పాస్ బ్రిడ్జి విషయంలో గ్రామస్థులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ప్రయత్నం చేశారు. కాగా, సుబ్బరాయుడు సత్రం గేటుకి కూతవేటు దూరంలో కట్టిన బ్రిడ్జి, చాగొల్లు వద్ద కట్టిన బ్రిడ్జిల పరిస్థితి చూస్తున్నామని, వర్షాకాలంలో కురిసిన నీరు ఇప్పటికీ నిలిచే ఉన్నాయని, అలాంటి అవస్థలు మాకొద్దని గ్రామస్థులు తెగేసి చెప్పారు. వర్షపు నీరు నిలవకుండా సెన్సార్ మోటార్లు ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు నీళ్ల తోడే విధంగా చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. పైఎత్తున పడిన వర్షపు నీరు, వరదలు దిగువన మా గ్రామంలోకి వచ్చే అవకాశం లేకుండా రైలుకట్ట అడ్డంగా ఉందని, అండర్‌పాస్ బ్రిడ్జి కడితే వరద నీళ్లతో గ్రామం, పంట పొలాలు, పండ్ల తోటలు మునిపోతాయని గ్రామస్థులు సబ్‌కలెక్టర్‌కు వివరించారు. కాగా, గ్రామస్థుల అభ్యంతరాలపై స్పందించిన సబ్‌కలెక్టర్ వర్షాలకు చెరువులు, కాలువల వలన గ్రామం వైపు వరద నీరు ప్రవహించే అవకాశాలు ఎంతమేరకు ఉన్నాయో పరిశీలించి నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ ఏఈ సీతారామయ్యను ఆదేశించారు. అన్ని అంశాలు పరిశీలించి అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం అవకాశాలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు సబ్‌కలెక్టర్ తెలిపారు.

క్యాన్సర్ బాధిత బాలుడి చికిత్సకు బెస్ట్ వాకర్స్ రూ.30వేల సాయం

కావలి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పేపర్లవారిపాలెం గ్రామానికి చెందిన 4ఏళ్ల బాలుడు చలంచర్ల అఖిల్ చికిత్సకు చేయూతనందించి మానవత్వం చాటుకున్నారు బెస్ట్ వాకర్స్ సభ్యులు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా బెస్ట్ వాకర్స్ అధ్యక్షుడు టీవీ శేషయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలుడి తండ్రి చేతికి రూ,30వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా శేషయ్య మాట్లాడారు. ప్రతినెలా క్ర మం తప్పకుండా చేసే సేవా కార్య క్రమంలో భాగంగా బాలుడికి తమవంతు సాయం చేశామన్నారు. కార్యక్రమంలో బెస్ట్ వాకర్స్ ఉపా ధ్యక్షులు రమేష్, మందా వెంకటేశ్వర్లు, హరి, సుంకు కృష్ణ, క్లాత్ శీను, హెడ్ కానిస్టేబుల్స్ శ్రీను, కుమార్, బాస్కర్ నాయుడు, ఆర్టీసీ బాష, కోటి తదితరులు పాల్గొన్నారు.



అఖిల్ తండ్రికి నగదు అందిస్తున్న బెస్ట్ వాకర్స్ సభ్యులు

బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక



అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు




కార్యదర్శి పవన్‌కుమార్

కందుకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కందుకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వలేటి శ్రీధర్‌నాయుడు, కార్యదర్శిగా శింగరాజు పవన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది తల్లపనేని గోపాలకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన బార్ అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ రవీంద్రనాథ్, లైబ్రేరియన్‌గా సింహాద్రిలను ఎన్నుకున్నారు. కాగా, రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీధర్‌నాయుడు, ఇతర కార్యవర్గ సభ్యులకు సీనియర్ న్యాయవాదులు కేవీ లక్ష్మీనారాయణ, బెజవాడ కృష్ణయ్యచౌదరి, సన్నెబోయిన శ్రీనివాసులు, బీవీ మురళీకృష్ణ, సీహెచ్ హరికృష్ణ, ప్రసాదరెడ్డి, భాస్కరరావు, తదితరులు అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉలవపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై అంకమ్మ అందించిన వివరాల ప్రకారం.. కరేడు పంచాయతీ పరిధిలోని చైతన్య నగర్‌కు చెందిన సింగోతు శ్రీను (28) తన స్నేహితులతో కలిసి స్థానిక హైస్కూల్ వద్ద గురువారం రాత్రి 8గంటల సమయంలో మాట్లాడుకుంటున్నారు. అనంతరం అక్కడనుంచి కొత్తపల్లెపాలెం గ్రామం వెళ్లేందుకు తన స్నేహితుడి ద్విచక్ర వాహనంపై ఎక్కే క్రమంలో అదే రోడ్డుపై వెళుతున్న ట్రక్‌ఆటో వెనుక నుంచి ఢీకొంది. దీంతో శ్రీను స్పృహ కోల్పోవడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు గుంటూరు కార్పోరేట్ హాస్పిటల్‌కి తరలించగా పరిశీలించిన వైద్యులు చికిత్స అందించారు. ఎంత ప్రయత్నించినప్పటికీ చికిత్సకు స్పందించకపోవడంతో బతకడం కష్టమని చెప్పారు. దీంతో గత్యంతరం లేక శుక్రవారం తెల్లవారుజామున ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చె క్రమంలో ఉలవపాడుకు చేరుకునే సరికి శ్రీను మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటరమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



శ్రీను మృతదేహం

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం

తహసీల్దార్ సీతామహాలక్ష్మి ● పలు మండలాల్లో సర్వే, గ్రామసభలు

లింగసముద్రం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో రైతుల భూముల సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని మొగిలిచెర్ల పంచాయతీ నారసింహాపురం, పెంట్రాల పంచాయతీలోని చీమలపెంటలో భూముల రీసర్వే ప్రారంభించారు. తహసీల్దార్, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన గ్రామ సభల్లో తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేతో ఎలాంటి తప్పొప్పులు జరగవని, రైతులు తమ భూములకు చెందిన పట్టాదారు పాస్ పుస్తకాలు, 1బి అడంగలు పత్రాలను అందజేయాలని, రీసర్వే అధికారులకు రైతులు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎం రమణయ్య, వీఆర్వోలు సర్వేయర్లు పాల్గొన్నారు.



లింగసముద్రం : ర్యాలీలో తహసీల్దార్, అధికారులు

● **సమస్యల పరిష్కారానికే గ్రామసభలు**

గుడ్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. వివిధ రకాల భూసమస్యల పరిష్కారాల కోసం గుడ్లూరు సచివాలయ కేంద్రం - 2 వద్ద రెవెన్యూ అధికారులతో గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలో 15 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు చలమారెడ్డి, తిరుపాలు, వీఆర్ఏ నరసింహం సచివాలయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

● **సమస్యలు లేని రికార్డుల కోసమే..**

అల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సమస్యలు లేకుండా శాశ్వత హక్కు పొందేలా వెబ్‌ల్యాండ్‌లో భూ రికార్డు పొందేందుకే రీసర్వే ప్రక్రియ దోహదపడుతుందని తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని సింగపేటలో రీసర్వే ప్రక్రియను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలో అత్యధిక విస్తీర్ణం కలిగిన అల్లూరు, సింగపేట గ్రామాలకు రీసర్వే చివరి విడతలో చేపడతామన్నారు. తక్కువ విస్తీర్ణాలు కలిగిన గ్రామాల్లో ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఈ ప్రక్రియపై ఏవేని అనుమానాలు ఉంటే స్థానిక వీఆర్వో నెంబరును తీసుకొని వాట్సాప్ నందు లేదా నేరుగా తనను కానీ వీఆర్వోలను కానీ సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు బండి అమర్‌రెడ్డి, అరగల రమణయ్య పాల్గొన్నారు.



అల్లూరు : గ్రామసభలో తహసీల్దారు లక్ష్మీ నారాయణ, నాయకుడు బండి అమర్ రెడ్డి

● **సభలను సద్వినియోగం చేసుకోండి**

కొండాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నోషనల్ ఖాతా నెంబర్ల రెగ్యులరైజేషన్‌పై జరుగుతున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం గుడవళ్లూరు, పార్లపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. గుడవళ్లూరులో-3, పార్లపల్లిలో-7 అర్జీలను నోషనల్ ఖాతా నెంబర్లున్న రైతులు అందించినట్లు చెప్పారు. వీటిని పరిశీలించి సరియైన ఖాతా నెంబరు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, గుడవళ్లూరు సర్పంచు బీ మాచర్ల, వీఆర్వో పోలయ్య పొలినేని రమేష్ పాల్గొన్నారు

రీ సర్వేపై రైతులకు అవగాహన

భూముల రీసర్వే, భూ సమస్యల అంశాలపై తహసీల్దారు కోటేశ్వరరావు గానుగపెంట పంచా యతీ ఆదిమూర్తిపురంలో రైతులకు అవగాహన కల్పించారు. గతంలో జరిగిన రీసర్వేతో ఇబ్బం దులు ఎదుర్కొంటున్న దృష్ట్యా రికార్డుల్లో మా ర్పులు సవరణనకు ఈ కార్యక్రమాన్ని వినియో గించుకోవాలని కోరారు. సర్వే పూర్తయిన అనంతరం రైతులకు కొత్త పాసుపుస్తకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సాగునీటి సంఘ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసరావు, వీఆర్వో మాలకొండయ్య సర్వేయరు మన్మథ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము బ్రాహ్మణ క్రాక
జలదంకి మండలం, నెల్లూరు జిల్లా

ఆర్.ఓ.సి.నెం.04/2025 **టెండరు ప్రకటన** తేది.04-04-2025

SPSR నెల్లూరు జిల్లా జలదంకి మండలము, బ్రాహ్మణక్రాక గ్రామ పంచాయితీ నందు తేది.01.04.2025 నుండి 31.03.2026 వరకు అనగా ఒక్క సంవత్సర కాలమునకు ఈ దిగువ తెలిపిన పనులకు సిబ్బందిని సరఫరా చేయుటకు తేది.16.04.2025 వరకు ఉదయం 10.30 గం.ల నుండి మధ్యాహ్నం 1.00 గం.వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 2.00 గం.లకు హాజరు అయిన టెండర్లదారుల సమక్షంలో తెరువబడును. టెండరు దాఖలు చేయు వారు దిగువ తెలిపిన మొత్తంను టెండరు ధరావత్తుగా చెల్లించి రశీదును టెండరు దరఖాస్తుకు జతపరచి దాఖలు చేయవలెను. ఇతర పూర్తి వివరములకు గ్రామ పంచాయితీ కార్యాలయము పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

వరుస సంఖ్య	వివరములు	సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు మొత్తము
1.	PWS స్కీములకు ఆపరేటర్‌గా చేయుటకు	3 ముగ్గురు	తేది 01.04.2025 నుండి తేది 31.03.2026 వరకు	రూ. 5000.00 అయిదు వేలు రూపాయలు
2.	వీధి విద్యుత్ దీపములు మరమ్మత్తులు చేయుటకు	2 ఇద్దరు	తేది 01.04.2025 నుండి తేది 31.03.2026 వరకు	
3.	వీధి దీపములు నిర్వహణకు హెల్పర్ (నిచ్చేన వేయుట మొదలగు) పని చేయుట పోస్టు 1కి నెలకు రేటు విడివిడిగా చూపబడును.	1 ఒక్కరు	తేది 01.04.2025 నుండి తేది 31.03.2026 వరకు	

నిబంధనలు: 1) పంచాయితీ కార్యదర్శి టెండరు రద్దు చేయుటకు అమలు పరుచుటకు పూర్తి అధికారము కలదు. 2) పంచాయితీ నిధుల సౌలభ్యమును బట్టి జిల్లా పంచాయితి అధికారి అనుమతి పొందిన తదుపరి మాత్రమే బిల్లులను చెల్లించబడును. బిల్లుల జాప్యమునకు ఎటువంటి వడ్డీ చెల్లించబడదు. 3) కాంట్రాక్టు సిబ్బంది గ్రామ పంచాయతీ సిబ్బందిగా పరిగణించను. 4. టెండరు దాఖలు చేయువారు, వారు సూచించిన రేట్ల ప్రకారం కాలపరిమితి వరకు సరఫర చేయు గలవారము అని 100 స్టాంపు పేపరు పైన అగ్రిమెంటు దాఖలు చేయవలెను. అగ్రిమెంటు లేనియెడల టెండరు అంగీకరించబడదు. 5. టెండరు అంగీకరించిన వారి టెండరు ధరావత్తును కలెక్టర్ గారి ఉత్తరాలు వచ్చిన పిదప చెల్లించబడును.

పంచాయితీ కార్యదర్శి
సం/- బ్రాహ్మణక్రాక గ్రామ పంచాయితీ, జలదంకి మండలం, నెల్లూరు జిల్లా



అటవీ విధులకు ఆధునిక వాహనాలు

రేంజర్లకు కొత్త బొలెరో బండ్లు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అటవీ సంరక్షణకు నిరంతరం విధులు నిర్వహిస్తున్న రేంజర్లకు నూతన బొలెరో వాహనాలను జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్‌బాషా అందజేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు వచ్చిన కాంపా నిధుల్లోంచి ఒక్కొక్కటి రూ.10 లక్షల చొప్పున రూ.కోటి వెచ్చించి 10 వాహనాలను కొనుగోలు చేశారు. నెల్లూరు, రాపూరు, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధిలోని అధికారులకు 5 వాహనాలు, కావలి సబ్ డీఎఫ్‌వోకు ఒక వాహనం అందించారు. మిగిలిన నాలుగు వాహనాలు ఇతర జిల్లాల అటవీశాఖ అధికారులకు అందజేశారు. అనేక సంవత్సరాలుగా పాత వాహనాలతో ఇబ్బందులు పడుతున్న రేంజర్లు నూతన వాహనాలు అందడంతో ఆనందం వ్యక్తం చేశారు.

ఇంటర్ మూల్యాంకనం పూర్తి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం శుక్రవారంతో పూర్తయింది. ఈ కార్యక్రమం నగరంలోని స్టౌన్‌హౌస్‌పేటలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి 7వ తేదీన ప్రారంభమైంది. వివిధ జిల్లాలకు చెందిన 3.54లక్షలకు పైగా జవాబు పత్రాలు జిల్లా స్పాట్ కేంద్రానికి చేరుకున్నాయి. ఇంటర్‌బోర్డు అధికారులు కట్టుదిట్టమైన భద్రత నడుమ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని చేపట్టారు. ఈ విధులకు 1200 మంది అధ్యాపకులు, 150 మందికి పైగా ఇతర సిబ్బంది హాజరైనట్లు ఆర్‌ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. పూర్తయిన జవాబు పత్రాల సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా ఇంటర్‌బోర్డుకు పంపించామని, త్వరలోనే అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకుని ఫలితాలు విడుదల చేస్తారన్నారు. నిర్ణీత సమయానికి మూల్యాంకనాన్ని పూర్తి చేసేందుకు సహకరించిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.



రాష్ట్ర టెన్నిస్‌బాల్ క్రికెట్‌కు జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో ఈనెల 5, 6వ తేదీల్లో జరిగే 12వ రాష్ట్ర స్థాయి అండర్-19 టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో పాల్గొనే బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి పీ అజయ్‌కుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడా జట్లకు శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్లకు ఇటీవల ఎంపికలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశామన్నారు. బాలుర విభాగంలో జగన్, తేజ, మిత్ర, ఇర్ఫాన్, మోక్షిత్, అభిలాష్, వంశీ, ధీరజ్, హరిచరణ్, తులసీరామ్, గురుచరణ్, అనిల్, బాలికల విభాగంలో హరిణి, ధనలక్ష్మి, సోని, గిరీషా, హేమ, పురంధరేశ్వరి, ఏంజల్, కమలి, తులసి, శ్రావణి, రిషిత, పవిత్ర, పద్మ, వైష్ణవి ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర విద్యాలయం డైరెక్టర్ ఎంవీ.కుముద, ప్రిన్సిపాల్ ప్రియాజాకబ్, బాలికల టీమ్ మేనేజర్ మమత, లీలాధర్‌రెడ్డి, గౌతమ్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

యథేచ్ఛగా బియ్యం అక్రమాలు

చౌక బియ్యమే... సన్న బియ్యంగా..!!

- కిలో రూ.12కు కొనుగోలు
- పాలిష్ పట్టి సన్నబియ్యంగా మార్పు
- ఆపై కిలో రూ.50 - 55కు విక్రయం
- ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి
- అరకొర దాడులు
- అయినా 3 నెలల్లో రూ.25లక్షల బియ్యం సీజ్

"జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అధికారుల ఉదాసీనతతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. చివరికి కార్డుదారులకు బియ్యం పంపిణీ జరగక ముందే బియ్యాన్ని నల్లబజారుకు తరలించేస్తున్నారు. ఇక, ఎండీయూ వాహనాల వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. లబ్ధిదారుల నుంచి కిలో రూ.12 నుంచి రూ.14 వంతున రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. వాటిని మిల్లర్లకు కిలో రూ.25కు విక్రయిస్తున్నారు. కొందరు మిల్లర్లు ఆ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి మేలైన బియ్యం పేరుతో కిలో రూ.50కి పైబడి ధరకు అమ్మి జేబులు నింపుకుంటున్నారు. ఇంతలా బరితెగిస్తున్న అక్రమార్కులను ప్రజలే పట్టిస్తున్నా, కొందరు అధికారులు కేసులు నమోదు చేయటంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు."



నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో 7.38 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వాటికి 1513 రేషన్ షాపుల నుంచి 438 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతినెలా 13వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. కార్డుదారులకు ఉచితంగా ఇచ్చే ఈ రేషన్ బియ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిలోకు రూ.43 వంతున ఖర్చు చేస్తున్నాయి. అయితే ఈ బియ్యం 50 శాతం కూడా సద్వినియోగం కావడం లేదన్నది బహిరంగ రహస్యం. రూ.కోట్ల విలువైన బియ్యం ప్రతీనెలా పక్కదారి పడుతోంది. చౌక బియ్యం వల్ల నిరుపేదలకు కలిగే లబ్ధికంటే వ్యాపారుల జేబుల్లోకి చేరేదే అధికంగా ఉంటోంది.

● పథకాల కోసమే కార్డులు

జిల్లాలో అధిక శాతం కుటుంబాల వారు సన్నబియ్యం వినియోగిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసమే 60శాతంపైగా కుటుంబాలు రేషన్ కార్డులు కలిగి, బియ్యాన్ని తీసుకుంటున్నట్లు సమాచారం. నెలనెలా బియ్యం తీసుకోకుంటే కార్డు రద్దు అవుతుందనే భయంతో వేలిముద్ర వేసి బియ్యం ఇచ్చే వాహనం వాళ్లకే అమ్మేస్తున్నారు. అంటే కార్డుదారులు కిలో రూ.12 చొప్పున అమ్ముతున్న బియ్యాన్ని తిరిగి వారే రూ.50కుపైగా ధర పెట్టి కొంటున్నారన్నమాట.

కఠిన చర్యలు తీసుకుంటాం



రేషన్ బియ్యం తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యం అక్రమాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో, దీనికి అడ్డుకట్ట వేయడానికి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాం. ఎండీయూ వాహనాల వారు కార్డుదారులకు బియ్యం ఇవ్వకుంటే చర్యలు తప్పవు.

\- ఎన్ విజయకుమార్, డీఎస్వో



మూడు దశల్లో రేషన్ బియ్యం పాలిష్

జిల్లాలోని నెల్లూరు రూరల్, కావలి పరిధిలో సుమారు 36 రైసు మిల్లులున్నాయి. హైవేకి సమీపంలో ఈ మిల్లులు ఉండటంతో కొన్ని మిల్లుల యజమానులు రేషన్ బియ్యం సేకరించి రహస్యంగా మిల్లుల్లో నిల్వ చేసి రీసైక్లింగ్ చేస్తున్నారు. రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకొని, అధికారులతో లాలూచీ పడుతూ పేదల బియ్యానికి పాలిష్ పెడుతున్నారు. చౌక బియ్యానికి మూడు దశల్లో పాలిష్ పట్టి సన్న బియ్యంగా మారుస్తున్నారు. ఆ తర్వాత పలు రకాల బ్రాండ్ల పేరుతో బ్యాగుల్లో నింపి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50, అంతకన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కొందరు మిల్లర్లు అయితే బ్రాండ్ల పేరుతో బ్యాగుల్లో నింపిన రేషన్ బియ్యాన్ని రాత్రిపూట జాక్‌పాట్ లారీల్లో బెంగళూరు, చెన్నైకు తరలిస్తున్నట్లు సమాచారం. అంతేకాదు ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తరచూ దాడుల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా వెలుగు చూస్తున్నా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతోంది. దీని వెనుక నెలవారీ మామూళ్ల మోజులో పోలీసు, రెవెన్యూ యంత్రాంగంసహా ప్రజా ప్రతినిధులు కూడా అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

మూడు నెలల్లో పట్టుకున్నదిలా..

- 2024 డిసెంబరులో కావలిలో 3.09 లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తుండగా అధికారులు సీజ్ చేశారు.
- ఈ ఏడాది జనవరి 6న రూ.45,500 విలువైన 10 క్వింటాళ్ల బియ్యాన్ని నెల్లూరు రూరల్‌లోని ముత్తుకూరు రోడ్డు ప్రాంతంలో ఆటోలో తరలిస్తుండగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పట్టుకుని వాహనంతో సహా సీజ్ చేశారు.
- జనవరి 15న రూ.27,300 విలువైన రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా నెల్లూరు రూరల్ ప్రాంతంలో సీజ్ చేశారు.
- జనవరి 21న కందుకూరులో రూ.12.28 లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు.
- ఫిబ్రవరి 8న కావలిలోని ఒక రేషన్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 4.33 లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించి సీజ్ చేశారు.
- ఫిబ్రవరి 10న బుచ్చిలో అక్రమంగా తరలిస్తున్న రూ.79వేల విలువైన 1750 కేజీల బియ్యాన్ని గుర్తించారు.
- ఫిబ్రవరి 28న కందుకూరులో అక్రమంగా తరలిస్తున్న రూ.21 వేల విలువైన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు.
- మార్చి 10న సంగంలోని ఒక రేషన్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 1.88 లక్షల విలువైన బియ్యాన్ని, 14వేల విలువైన కందిపప్పును, రూ.7499 విలువైన చక్కెర ప్యాకెట్లను సంగం ఆర్ఐ సీజ్ చేశారు.
- మార్చి 19న సైదాపురంలోని రేషన్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 1.20 లక్షల విలువైన బియ్యాన్ని సీజ్ చేశారు.
- మార్చి 19న కలువాయిలో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రూ.22వేల విలువైన రేషన్ బియ్యాన్ని కలువాయి డీటీ పట్టుకున్నారు. అధికారులు అరకొర దాడులు చేస్తుంటేనే సుమారు మూడు నెలల్లో రమారమి రూ.25 లక్షల విలువైన బియ్యం పట్టుబడితే ఇక పూర్తి స్థాయిలో దృష్టిసారిస్తే ఇంకెంతగా రేషన్ బియ్యం అక్రమాలు బయటపడతాయో ఆలోచించాలి. పైగా అక్రమాలపై 6ఏ కేసులను మాత్రమే నమోదు చేస్తుండటంతో మాఫియాకు భయం లేకుండా పోతోంది.

ఆమంచర్ల అటవీ భూముల్లో ఉమ్మడి సర్వే



అటవీ అధికారులతో మాట్లాడుతున్న నెల్లూరు ఆర్డీవో అనూష

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లోని ఆమంచర్ల అటవీ భూముల్లో నెల్లూరు అటవీ రేంజర్ మాల్యాద్రి, నెల్లూరు ఆర్డీవో అనూష ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి సర్వే చేపట్టారు. 2016లో రిజర్వు ఫారెస్ట్‌కు చెందిన 480 ఎకరాలు, పక్కనే ఉన్న 82 ఎకరాలు కలిపి 562 ఎకరాల భూమిని అప్పటి రెవెన్యూ అధికారులు రూ.49.40 కోట్లకు ఏపీఐఐసీకి విక్రయించారు. అందులో ఏపీఐఐసీ వారు 2019లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండగా అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఈ భూమి రిజర్వు ఫారెస్ట్ అని, ఇందులో ఎలాంటి కట్టడాలు చేపట్టకూడదని చెప్పడంతో వివాదం ఏర్పడింది. అప్పటి నుంచి వందలసార్లు సర్వేలు జరిగాయి. కానీ సమస్య కొలిక్కిరాలేదు. తాజాగా అటవీ, రెవెన్యూ అధికారులు ఉమ్మడి సర్వే చేపట్టారు. అటవీ భూమిని ఏపీఐఐసీకి అప్పగిస్తే ఇందుకు బదులుగా అదే విస్తీర్ణం రెవెన్యూ భూమి అటవీశాఖకు అప్పగించాల్సి ఉంటుంది. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే ఈ వివాదానికి ముగింపు పలుకనున్నట్లు తెలుస్తోంది.

క్రీడల్లో సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ఆరు వారాలు సర్టిఫికెట్ కోర్సుల్లో చేరి శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే.యతిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాటియాలాలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్(ఎన్ఎస్ఎన్ఐఎస్)లో 2025 విద్యా సంవత్సరానికి మే 6 నుంచి జూలై 2వ తేదీ వరకు నిర్వహించే ఆరువారాల సర్టిఫికెట్ కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించి క్రీడల్లో ప్రావీణ్యం కలిగి 2025 ఏప్రిల్ 14 నాటికి 20 నుంచి 40 ఏళ్ల లోపు వయసు కలిగి వారు దరఖాస్తుకు అర్హులని తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, జూడో, కబడ్డీ, ఖోఖో, రోల్‌బాల్, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, తైక్వాండో, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, ఉషు, యోగా క్రీడాంశాల్లో ప్రతిభ కలిగిన వారికి ఆయా అంశాల్లో శిక్షణ అందిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.6wcc.nsni.in పోర్టల్ ద్వారా ఈనెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.



20 కిలోల గంజాయి స్వాధీనం

నెల్లూరు(క్రైం),ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):విశాఖపట్నం నుంచి మధురైకి ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న 20కిలోల 200గ్రాముల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు పట్టుకుని ముగ్గురు నిందితుల ను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్ విలేకర్లకు వెల్లడించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పీ.జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం తనిఖీలు చేపట్టారన్నారు. ఆర్టీసీ బస్సులో అనుమానాస్పదంగా ఉన్న సుందర్‌పాండి, సేతాజీ, కుమార్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి లగేజీ బ్యాగులు తనిఖీ చేశారన్నారు. అందులో మూడు ప్యాకెట్లలో 20కేజీల 200 గ్రాముల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారన్నారు. వారిని విచారించగా దీనిని విశాఖపట్నంలో హనుమాన్ అనే వ్యక్తి నుంచి రూ.90వేలకు కొనుగోలు చేసి మూడు బ్యాగుల్లో మధురైకి తరలిస్తున్నట్లు తెలిపారన్నారు. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకో వడంతో పాటు ముగ్గురు నిందితులను ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు ఎస్‌డీ కాలేషావలి, సీహెచ్ పూర్ణకుమార్, సిబ్బంది శ్రీనివాసులు, రమణయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకుకు మద్దతు ధర ఇవ్వాలి

కలిగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన నాణ్యమైన పొగాకుకు మద్దతు ధర అందించాలని పొగాకు రీజనల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు పొగాకు కొనుగోలు కంపెనీ ప్రతినిధులకు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన రైతులతో పొగాకు ధరల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

హైరిస్క్ గర్భిణులకు

ముందుగా చికిత్స చేయండి

డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హైరిస్క్ గర్భిణులను ముందుగా గుర్తించి వారికి సంపూర్ణంగా వైద్య చికిత్సలు అందేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. జనవరిలో జరిగిన ఒక తల్లి, ఆరు శిశు మరణాలపై శుక్రవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. గర్భిణులకు అన్నీ రకాల పరీక్షలు తప్పనిసరిగా చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ఆరోగ్య పర్యవేక్షకులకు పూర్తి బాధ్యత అప్పగించాలని ఆదేశించారు. పురిటి బిడ్డలకు తల్లిపాలే పట్టేలా, సకాలంలో రోగనిరోధక టీకాలు వేయించేలా అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యకరమైన ప్రారంభాలు - ఆశాజనకమైన భవిష్యత్తు అన్న నినాదంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ శేషారత్నం, జీజీహెచ్ గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ గీతాలక్ష్మి, జనరల్ మెడికల్ ప్రొఫెసర్ డాక్టర్ బెన్‌హర్, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమా మహేశ్వరి, డాక్టర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

ఉపాధికి పంచ ప్రాధాన్యాలు!

- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ
- వేసవిలో ఉపయోగకరమైన పనులకు శ్రీకారం
- పశువుల దాహం తీర్చే నీటి తొట్టెలపై ప్రత్యేక శ్రద్ధ

ఉదయగిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వేసవిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఐదు ప్రాధాన్యాలతో పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు సూచనలు చేసింది. అందులో ప్రధానంగా పశువుల నీటి తొట్టెలు, చెరువుల పునరుద్ధరణ, పంట కుంటలు, సగటు వేతనం, పంట కాలువల పునరుద్ధరణ నిర్మాణం చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది.

● పశువుల నీటి తొట్టెలు

వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని పశువుల తాగునీటికి ఇబ్బంది లేకుండా నీటితొట్ల నిర్మాణం చేపట్టనున్నారు. జిల్లాలో 963 నీటి తొట్టెల నిర్మాణం లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు 693 తొట్ల పనులకు రూ.2.22 కోట్ల రూపాయలతో పరి పాలన ఆమోదం లభించింది.

● చెరువుల పునరుద్ధరణ

గ్రామానికి, రోడ్లకు సమీపంలో ఉన్న చెరువులను గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి మండలంలో ఐదు ఎకరాల్లోపు ఉండే రెండు చెరువులను గుర్తించి అందంగా తయారు చేయనున్నారు. జిల్లాలో 272 చెరువుల్లో రూ.23.90 కోట్లతో పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యం పెంచి చెరువుకట్టలను బలోపేతం చేయనున్నారు.

● పంటకుంటల తవ్వకం

ప్రతి రైతు పొలంలో సేద్యపు నీటికుంటలను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ఈ పంట కుంటలు ఎంతగానో ఉపయోగపడతాయి. పంట కుంటలో నీటిని నిల్వ చేసుకుంటే భూగర్భజలాలు పెరగడంతో పాటు పశువులకు వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. జిల్లాలో రూ.47.25 కోట్లతో 7,500 పంట కుంటలు తవ్వించాలన్నదే లక్ష్యం.

● పంట కాలువల పునరుద్ధరణ



దుత్తలూరు మండలం వెంకటంపేటలో నీటితొట్టి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కలెక్టర్(ఫైల్)

సాగునీటి కాలువల్లో పూడికతీత చేపట్టి రాబోయే పంట సమయానికి ఆయకట్టు చివరి పొలం వరకు సాగునీరు అందేలా ప్రతి కాలువను పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 8,737 కిలోమీటర్ల పొడవున కాలువల్లో రూ.81.25 కోట్ల నిధులతో పూడిక తీసి పునరుద్ధరించనున్నారు.

● సగటు వేతనం

ఉపాధి హామీ కూలీలకు 60 లక్షల పనిదినాలు లక్ష్యంగా సగటు దినసరి వేతనం రూ.307 పొందేలా పనులు చూపనున్నారు. కనీసం నాలుగు గంటలు పని ప్రదేశంలో ఉండాలని నిర్దేశించారు. ఇందుకు కూలీలకు, మేట్లకు కనీస అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధి హామీ అధికారులపై ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ ఆనంద్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ గంగాభవానీ ఇప్పటికే ఆయా పనులకు సంబంధించి గ్రామాల్లో భూమి పూజ చేశారు. ఉపాధి పథకం కింద గ్రామాల్లో అందరికీ ఉపయోగకరమైన పనులు చేపట్టడంపై పల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీవాల దాహార్తి తీర్చే తొట్టెలు

● ఆత్మకూరుకు 161 మంజూరు

ఆత్మకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం నీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 136 పంచాయతీల్లో 161 నీటి తొట్టెలు నిర్మించనున్నారు. పశువులు గుంపులుగా రాకపోకలు సాగించే మార్గాల్లో వీటిని నిర్మించాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి హామీ పథకం కింద 2 మీటర్లు వెడల్పు, 5 మీటర్లు పొడవు, 60 సెంటీమీటర్లు ఎత్తున ఒక్కో తొట్టి నిర్మించేందుకు రూ. 33,220 వెచ్చించనున్నారు. ఏప్రిల్ 15లోగా వీటిని అందుబాటులోకి తెచ్చేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గతంలో నిర్మించిన వాటిలో శిథిలస్థితికి చేరిన నీటితొట్టెలకు మరమ్మతులు కూడా చేయించనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● పంచాయతీకి ఒకటి...

పశువుల నీటి తొట్టెలను సగటున పంచాయతీకి ఒకటి చొప్పున మంజూరు చేశారు. కొన్ని పంచాయతీల్లో పశువుల సంఖ్యను బట్టి మరొకటి అదనంగా మంజూరు చేశారు. ఈ క్రమంలో ఆత్మకూరు మండలానికి 24, మర్రిపాడుకు 40, ఏఎస్‌పేటకు 22, చేజర్లకు 30, సంగంకు 20, అనంతసాగరానికి 25 నీటితొట్టెలు మంజూరయ్యాయి. నీటి వసతి ఉన్న చోట వీటిని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టరు మర్రిపాడు మండలంలోని డీసీపల్లిలో నీటితొట్టె నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం విదితమే. ఒక్కో నీటితొట్టెను 5200 లీటర్ల నీటితో నింపుతారు. గేదెలకు రోజుకు 40 లీటర్లు, ఆవులకు 30 లీటర్లు, మేకలు, గొర్రెలకు రోజుకు 5 లీటర్లు చొప్పున నీరందేలా నిర్మాణాలు చేపట్టనున్నారు.

త్వరితగతిన పూర్తి చేస్తాం

వేసవిలో పశువులకు నీటి సమస్య లేకుండా త్వరలో తొట్టెలను అందుబాటులోకి తీసుకొస్తాం. ఒకేసారి ఎక్కువ పశువులు వినియోగించే విధంగా వీటిని నిర్మిస్తున్నాం. ముఖ్యంగా పశువులకు, గొర్రెలు, మేకలకు అనుకూలంగా వేరువేరుగా నీటి తొట్టెల నిర్మాణం చేపడతాం. వీటి నిర్వహణ బాధ్యతను ఆయా గ్రామ పంచాయతీలు చేపడతాయి.

\- శంకరనారాయణ, ఏపీడీ, ఆత్మకూరు